Rni Title Code No. TELTEL02115

# గరుడ వార్త

తెలుగు దినపత్రిక

www.garudavarthanews.com
www.garudavarthanews.in

సంపుటి : 1 సంచిక : 249 మేడ్చల్ మల్కాజ్‌గిరి 28 సెప్టెంబర్ 2023 గురువారం పేజీలు : 4

## రాజస్థాన్‌లో ఎన్ఐఏ దాడులు.. 12 మంది అదుపులోకి

రాజస్థాన్: ఖలిస్తానీ – గ్యాంగ్‌స్టర్ ముఠాల స్థావరాలే టార్గెట్‌గా జాతీయ దర్యాప్తు సంస్థ రాజస్థాన్ లో ఇవాళ ఉదయం నుంచి దాడులు నిర్వహిస్తోంది. శ్రీగంగానగర్, హనుమాన్‌గఢ్, జైసల్మేర్, జోధ్‌పూర్, ఝుంఝునుతో సహా ఐవ్ జిల్లాల్లోని పలు ప్రాంతాల్లో అధికారులు బందోబస్తు నిర్వహించారు. ఐదు జిల్లాల్లో రాష్ట్రవ్యాప్తంగా నిర్వహించిన దాడుల్లో ఖలిస్తానీ–గ్యాంగ్‌స్టర్‌ల ముఠాకు చెందిన 12 మందికి పైగా వ్యక్తుల్ని అదుపులోకి తీసుకున్నట్లు పోలీసులు తెలిపారు. రాజస్థాన్ యాంటీ టెర్రర్ స్క్వాడ్ డైరెక్టర్ జనరల్ అన్షుమన్ భోమ్లా ఈ దాడుల్ని ధ్రువీకరించారు. ఈ టాస్క్ పూర్తయ్యాక పూర్తి వివరాలు మీడియాకు వెల్లడిస్తామని వివరించారు. పట్టుబడిన వారిలో విద్యార్థి సంఘం నాయకుడు ఉన్నాడని అతనితో ఖలిస్తానీలకు పరిచయాలు ఉన్నట్లు చెప్పారు.

## గణపయ్యను సాగనంపేందుకు

# సర్వం సిద్ధం!



## గణేశ్ నిమజ్జనం.. హైదరాబాద్‌లో ట్రాఫిక్ ఆంక్షలు ఇలా!

హైదరాబాద్: నగరంలో గణేశ్ నిమజ్జనోత్సవానికి సర్వం సిద్ధమైంది. ఏకదంతుడి శోభాయాత్రలకు విఘ్నాలు తలెత్తకుండా ట్రాఫిక్ పోలీసు యంత్రాంగం చర్యలు చేపట్టింది. శోభాయాత్రలు సాగే దారుల్లో సాధారణ వాహనాల రాకపోకలకపై ఆంక్షలు విధించారు. గురువారం ఉదయం 6 గంటల నుంచి శుక్రవారం ఉదయం 10 గంటల వరకూ ఈ ఆంక్షలు అమల్లో ఉంటాయని పోలీసులు తెలిపారు. బాలాపూర్ నుంచి నుంచి ఎన్టీఆర్ మార్గ్ వరకు సాగే ప్రధాన శోభాయాత్రతో పాటు.. ఊరేగింపు జరిగే రహదారుల్లో సాధారణ ప్రజల వాహనాల రాకపోకలకు అనుమతి ఉండదు. ఇతర రాష్ట్రాలు, జిల్లాల నుంచి వచ్చే లారీలకు శనివారం రాత్రి వరకు నగరంలోకి అనుమతి ఉండదు. ప్రైవేటు బస్సు ఆపరేటర్లు ఓఆర్ఆర్‌తో పాటు ఇతర మార్గాల ద్వారా వెళ్లాలని ట్రాఫిక్ అధికారులు స్పష్టం చేశారు. హైదరాబాద్ పాతబస్తీలో కేశవగిరి, మహబూబ్ నగర్ చౌరస్తా, ఇంజిన్ బౌలి, నాగుల్ చింత, హిమ్మత్‌పురా, హరిబౌలి, అస్రా హాస్పిటల్, మొఘల్ పురా, మదీనా చౌరస్తా, ఎంజే బ్రిడ్జి, దారుల్ షిఫా చౌరస్తా, సిటీ కాలేజి వద్ద వాహనాల మళ్లింపు ఉంటుంది. చంచల్ గూడ జైలు చౌరస్తా, మూసారంబాగ్, చాదర్ ఘాట్ బ్రిడ్జి, సాలార్జంగ్ బ్రిడ్జి, అఫ్జల్ గంజ్, పుత్లీబౌలి చౌరస్తా, ట్రూప్ బజార్, జామ్ బాగ్ క్రాస్ రోడ్స్, కోఠి ఆంధ్రాబ్యాంకు వద్ద వాహనాలను దారి మళ్లిస్తారు. మధ్యమండలంలో చాపెల్ రోడ్డు ప్రవేశం, జీపీవో వద్ద గద్వాల్ సెంటర్, షాలిమార్ థియేటర్, గన్ ఫౌండ్రి, స్కైలైన్ రోడ్డు ప్రవేశం, దోమల్ గూడలోని భారత్ స్కౌట్స్ అండ్ గైడ్స్ కూడలి, బూర్గుల రామకృష్ణా రావు భవన్, ఇక్బాల్ మినార్, రవీంద్ర భారతి, ద్వారకా హెూటల్, ఖైరతాబాద్ చౌరస్తా, చిల్డ్రన్స్ పార్క్, వైస్రాయ్ జంక్షన్, కవాడిగూడ కూడలి, ముషీరాబాద్ చౌరస్తా, ఆర్టీసీ క్రాస్ రోడ్స్, లోయర్ ట్యాంక్ బండ్ కట్ట మైసమ్మ దేవాలయం, ఇందిరాపార్క్ జంక్షన్ వద్ద వాహనాల మళ్లింపు ఉంటుందని పోలీసులు తెలిపారు. పశ్చిమ మండలం పరిధిలో టోప్ ఖానా మసీదు, అలస్కా హెూటల్ కూడలి, ఉస్మాన్ గంజ్, శంకర్ బాగ్, సీనా హెూటల్, ఎగ్జిబిషన్ మైదానం సమీపంలోని అజంతా గేట్, ఆబ్కారీ లేన్, తాజ్ ఐలాండ్, ఏఆర్ పెట్రోల్ పంపు వద్ద వాహనాలు మళ్లిస్తారు. ఉత్తర మండలం పరిధిలో కర్బలా మైదానం, బుద్ధ భవన్, సెయిలింగ్ క్లబ్, నల్లగుట్ట కూడలి వైపు నుంచి నెక్లెస్ రోడ్డు, అప్పర్ ట్యాంక్ బండ్‌పైకి ట్రాఫిక్‌ను అనుమతించరు. సికింద్రాబాద్‌లో సీటీవో, వైఎంసీఏ, ప్యారడైజ్ చౌరస్తా, ప్యాట్నీ చౌరస్తా, బాటా, ఫూన్స్ మండీ వద్ద వాహనాలను మళ్లించనున్నారు.

**నిమజ్జనం చేశాక ఇలా వెళ్లాలి..** ఎన్టీఆర్ మార్గ్‌లో వినాయకుడిని నిమజ్జనం చేసిన తర్వాత నిర్వాహకులు ఖాళీ వాహనాలను నెక్లెస్ రోటరీ, ఖైరతాబాద్ ఫ్లైఓవర్, కేసీపీ మీదుగా తీసుకెళ్లాలని ట్రాఫిక్ పోలీసులు తెలిపారు. అప్పర్ ట్యాంక్ బండ్‌పై నిమజ్జనం చేసిన వారు వాహనాలను చిల్డ్రన్స్ పార్క్, డీబీఆర్ మిల్స్, కవాడిగూడ, ముషీరాబాద్ మీదుగా వెళ్లాలి. బైబిల్ హౌజ్ రైల్ ఓవర్ బ్రిడ్జి మీదుగా లారీలను అనుమతించబడవు.

**సందర్శకుల పార్కింగ్ ఇలా..** ట్యాంక్‌బండ్‌లో నిమజ్జనోత్సవం తిలకించేందుకు వెళ్లే ప్రజల వాహనాలు నిలిపేందుకు ప్రత్యేక కేంద్రాలు సిద్ధం చేశారు. సాగర్ చుట్టూ ఉండే ప్రత్యేక పార్కింగ్ కేంద్రాల్లోనే తమ వాహనా లను నిలపాలని పోలీసులు సూచించారు. ఖైరతాబాద్ చౌరస్తాలోని ఇనిస్టి ట్యూట్ ఆఫ్ ఇంజినీర్స్, ఖైరతాబాద్ ఎంఎంటీఎస్ స్టేషన్, ఆనంద్ నగర్ కాలనీ నుంచి రంగారెడ్డి జిల్లా జెడ్పీ కార్యాలయం దారి, బుద్ధ భవన్ వెనక వైపు, గోసేవా సదన్, లోయర్ ట్యాంక్ బండ్, కట్ట మైసమ్మ దేవాలయం, ఎన్టీఆర్ స్టేడియం, నిజాం కాలేజీ, పబ్లిక్ గార్డెన్స్‌లో పార్కింగ్ కేంద్రాలు ఉంటాయని తెలిపారు.

**ఆర్టీసీ బస్సులకు సైతం ట్రాఫిక్ ఆంక్షలు :** ఆర్టీసీ బస్సులకు సైతం ట్రాఫిక్ ఆంక్షలు అమల్లో ఉంటాయని పోలీసులు తెలిపారు. నిమజ్జనం రద్దీని బట్టి బస్సుల రాకపోకలపై నియంత్రణ ఉంటుందన్నారు. హుస్సేన్ సాగర్‌కు కొద్ది దూరంలోనే సిటీ బస్సులను నిలిపివేస్తామన్నారు. అక్కడి నుంచి ప్రజలు నడుచుకుంటూ వెళ్లాల్సి ఉంటుందని తెలిపారు. మెహిదీపట్నం బస్సులను మాసాబ్ ట్యాంక్, కూకట్ పల్లి బస్సులు ఖైరతాబాద్ చౌరస్తా, సికింద్రాబాద్ బస్సులు సీటీవో, ప్లాజా, ఎస్ బీహెచ్, క్లాక్ టవర్, చిలకలగూడ చౌరస్తా, ఉప్పల్ బస్సులు రామంతాపూర్ టీవీ స్టూడియో, దిల్ సుఖ్ నగర్ బస్సులు గడ్డి అన్నారం, చాదర్ ఘాట్, రాజేంద్రనగర్ బస్సులు దానమ్మ హట్స్, మిదాని బస్సులు ఐఎస్ సదన్, అంతర్ నగర బస్సులు నారాయణ గూడ వైఎంసీఏ వద్ద నిలిపివేయనున్నట్లు తెలిపారు.

**జిల్లాల బస్సుల మళ్లింపు ఇలా..** జిల్లాల నుంచి ఎంజీబీఎస్‌కు వెళ్లే ఆర్టీసీ బస్సులను సైతం వివిధ ప్రాంతాలకు మళ్లించనున్నారు. రాజీవ్ రహదారి, ఎన్‌హెచ్ 7 వైపు నుంచి వచ్చే వాహనాలు జేబీఎస్, వైఎంసీఏ, సంగీత్ చౌరస్తా, తార్నాక, జామై ఉస్మానియా ఫ్లైఓవర్, నింబోలి అడ్డా, చాదర్ ఘాట్ మీదుగా వెళ్లాలని సూచించారు. బెంగళూరు రహదారిపై వచ్చే వాహనాలు ఆరాంఘర్ చౌరస్తా, చంద్రాయణగుట్ట చౌరస్తా, ఐఎస్ సదన్, నల్గొండ క్రాస్ రోడ్స్, చాదర్ ఘాట్ మీదుగా మళ్లించనున్నారు. ముంబయి జాతీయ రహదారి వైపు నుంచి వచ్చే వాహనాలను.. గోద్రెజ్ కూడలి, నర్సాపూర్ చౌరస్తా, బోయిన్ పల్లి, జేబీఎస్, వైఎంసీఏ, సంగీత్, తార్నాక, జామై ఉస్మానియా ఫ్లైఓవర్, అడిక్ మెట్, నింబోలి అడ్డా మీదుగా వెళ్తాయని తెలిపారు.

## కేసీఆర్ కు ఏమైంది? : ప్రగతిభవన్ లో యశోదా ఆస్పత్రి వైద్యులు...

హైదరాబాద్ : తెలంగాణ ముఖ్యమంత్రి కే చంద్రశేఖర్ రావు స్వల్ప అస్వస్థతకు లోనయ్యారు. గతకొన్ని రోజులుగా ఆయన విపరీతమైన దగ్గు, జ్వరంతో బాధపడుతున్నారు. వైరల్ ఫీవర్ కారణంగా అనారోగ్యానికి గురయ్యారు. అయితే ఆందోళన చెందాల్సిన అవసరం లేదని.. త్వరలోనే ఆయన సాధారణ స్థితికి చేరుకుంటారని సమాచారం. అవును... కేసీఆర్ వారం రోజులుగా వైరల్ ఫీవర్, దగ్గుతో భాదపడుతున్నారు. దీంతో ప్రగతి భవన్ లో యశోద హాస్పిటల్ వైద్యుల పర్యవేక్షణలో సీఎం కేసీఆర్ కు వైద్యం అందుతోందని తెలుస్తోంది. ఇదే విషయాన్ని సీఎం కుమారుడు, రాష్ట్ర మంత్రి కేటీఆర్ కూడా నిర్ధారించారు. ఈ విషయాన్ని ఆయన తన "ఎక్స్" (ట్విట్టర్) ఖాతా ద్వారా వెల్లడించారు. ఇందులో భాగంగా... "సీఎం కేసీఆర్ గారు ఒక వారం రోజులుగా వైరల్ ఫీవర్, దగ్గుతో బాధపడుతున్నారు. ఆయనకు మెడికల్ బృందం ఇంటి వద్దే చికిత్స అందిస్తోంది. చాలా జాగ్రత్తగా పర్యవేక్షిస్తున్నారు. కొన్ని రోజుల్లోనే సీఎం కేసీఆర్ తిరిగి సాధారణ స్థితికి చేరుకుంటారని వైద్యులు చెప్పారు" అని ట్వీట్ చేశారు. ఆ సంగతి అలా ఉంటే మరోపక్క ఈ నెల 29న సచివాలయంలో రాష్ట్ర మంత్రివర్గ సమావేశం నిర్వహించాలని ముఖ్యమంత్రి కేసీఆర్ నిర్ణయించినట్టు తెలిసింది. గవర్నర్ కోటా కింద ఎమ్మెల్సీలుగా డాక్టర్ దాసోజు శ్రావణ్ కుమార్, కుర్ర సత్యనారాయణలను నామినేట్ చేయాలని రాష్ట్ర ప్రభుత్వం సిఫార్సు చేసిన సంగతి తెలిసిందే. అయితే ఆ సిఫార్సులను గవర్నర్ తమిళిసై సౌందరరాజన్ తిరస్కరించారు. ఈ నేపథ్యంలో తదుపరి తీసుకోవాల్సిన చర్యలపై మంత్రివర్గ భేటీలో చర్చించి నిర్ణయం తీసుకోనున్నారని సమాచారం. ఇదే సమయంలో ఎన్నికలు సమీపిస్తున్న వేళ అనుసరించాల్సిన వ్యూహాలు, ఎన్నికలకు సన్నద్ధతపై సైతం విస్తృతంగా చర్చించే అవకాశం ఉందని తెలుస్తుంది. కాగా... రాజ్యాంగంలోని ఆర్టికల్స్ 171(3), 171(5)లో నిర్దేశించిన



మేరకు సాహిత్యం, సైన్స్, కళలు, సహకార ఉద్యమం, సమాజ సేవ రంగాల్లో చెప్పుకోదగ్గ ప్రావీణ్యత కానీ ఆచరణాత్మక అనుభవం కానీ లేకపోవడంతో గవర్నర్ కోటా కింద ఎమ్మెల్సీలుగా వీరి అభ్యర్థిత్వాలను తిరస్కరిస్తున్నట్టు గవర్నర్ ప్రకటించిన సంగతి తెలిసిందే.

### కేంద్ర జల సంఘానికి తెలంగాణ ప్రభుత్వం లేఖ

## ఏపీపై చర్యలు తీసుకోవాలని

హైదరాబాద్ : కేంద్ర జల సంఘానికి తెలంగాణ ప్రభుత్వం బుధవారం లేఖ రాసింది. పోలవరం బ్యాక్ వాటర్ విషయంలో అభ్యంతరాలను పట్టించుకోవడం లేదంటూ సెంట్రల్ వాటర్ బోర్డు ఛైర్మన్‌కు రాష్ట్ర ఈఎన్‌సీ మురళీధర్ లేఖ రాశారు. పోలవరం బ్యాక్ వాటర్‌తో 954 ఎకరాలు ముంపునకు గురవుతున్నాయన్నారు. తొమ్మిది అంశాల్లో ఒక్కదానిపై ఏపీ చర్యలు తీసుకోలేదని ఈఎన్‌సీ పేర్కొన్నారు. పీపీఏ నుంచి సమన్వయం లోపం ఉందని లేఖలో రాష్ట్ర ప్రభుత్వం పేర్కొంది. సుప్రీంకోర్టులో కేంద్రం నివేదించినట్లు క్షేత్రస్థాయిలో చర్యలు తీసుకోవడం లేదని ప్రభుత్వం తెలిపింది. సీడబ్ల్యూసీ, పీపీఏ భేటీల్లో ఇచ్చిన హామీలు నెరవేర్చాలని లేఖలో ప్రభుత్వం పేర్కొంది. ఈ విషయంలో తక్షణమే చర్యలు చేపట్టాలని జల సంఘం ప్రభుత్వాన్ని కోరింది.



# త్వరలోనే శుభవార్త!

## అన్ని వర్గాలను ఆకట్టుకునేలా బిఆర్ఎస్ మేనిఫెస్టో

## హ్యాట్రిక్ సాధిస్తామన్న మంత్రి హరీష్‌రావు

మెదక్ : సీఎం కేసీఆర్ త్వరలోనే బీఆర్ఎస్ మేనిఫెస్టో విడుదల చేయబోతున్నారని, అన్ని వర్గాలు సంతోషపడేలా శుభవార్త ఉంటుందని రాష్ట్ర ఆర్థిక, వైద్యారోగ్య శాఖ మంత్రి హరీశ్‌రావు స్పష్టం చేశారు. మెదక్ జిల్లా తూప్రాన్ పట్టణంలో కొండా లక్ష్మణ్ బాపూజీ జయంతి సందర్భంగా వారి విగ్రహాన్ని మంత్రి హరీశ్‌రావు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో మంత్రి హరీశ్‌రావు మాట్లాడుతూ.. కొండా లక్ష్మణ్ బాపూజీ విగ్రహాన్ని ఆవిష్కరించుకుంటున్నందుకు ఎంతో సంతోషంగా ఉందన్నారు. తెలంగాణ రాష్ట్రం కోసం తన ప్రాణాలను తృణప్రాయంగా త్యాగం చేసిన గొప్ప నాయకుడు ఆయన.

పేదల కోసం ఎన్నో పోరాటాలు చేశారు. కేసీఆర్ మలిదశ తెలంగాణ ఉద్యమాన్ని ప్రారంభిస్తే టీఆర్ఎస్ పార్టీ కోసం తన ఇంటినిచ్చిన గొప్ప నాయకుడు కొండా బాపూజీ అని ప్రశంసించారు.

**తెలంగాణ రాష్ట్రం వచ్చాకనే తూప్రాన్ అద్భుతంగా అభివృద్ధి..** జీవితాంతం తెలంగాణ కోసం పరితపించిన ఆయన ఈ ప్రాంతం బాగుపడాలంటే ప్రత్యేక రాష్ట్రం రావాల్సిందేనని బలంగా నమ్మారని మంత్రి తెలిపారు. పద్మశాలి సమాజానికి ఆత్మగౌరవ పత్రిక కొండా లక్ష్మణ్ బాపూజీ. ఆయన జయంతి, వర్ధంతి కార్యక్రమాలను తెలంగాణ ప్రభుత్వం అధికారికంగా నిర్వహిస్తుంది. బాపూజీ సేవలకు గుర్తింపుగా తెలంగాణ హార్టికల్చర్ యూనివర్సిటీకి ఆయన పేరు పెట్టుకున్నాం. తెలంగాణ రాష్ట్రం వచ్చాకనే తూప్రాన్ అద్భుతంగా అభివృద్ధి చెందింది. ఉద్యమ సమయంలో కాంగ్రెస్ హయాంలో తూప్రాన్‌కు వచ్చినప్పుడు ఎటు చూసినా చెత్త చెదారంతో పందులతో అపరిశుభ్రంగా ఉండేది. ముఖ్యమంత్రి కేసీఆర్ పాలనలో పట్టణం అద్భుతంగా అభివృద్ధి చెందింది. కేసీఆర్‌కు ముందు, కేసీఆర్ వచ్చాక పట్టణంలో ఏం జరిగిందో మీరే బేరీజు వేసుకోవాలి. ఈ ఒక్క రోజే రూ. 50 కోట్ల విలువైన అభివృద్ధి కార్యక్రమాలకు శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు చేసుకున్నాం. ఇంత పురోగతి కనిపిస్తున్నా ఏమీ జరగలేదని కాంగ్రెస్ నాయకుడు షబ్బీర్ అలీ వ్యాఖ్యానించడం సరికాదన్నారు.

**ప్రతి ఆడపిల్లకు మేనమామ మన కేసీఆర్ :** తూప్రాన్ అభివృద్ధి కాలేదు అంటే సూర్యుడి మీద ఉమ్మి వేసినట్టే అని మంత్రి పేర్కొన్నారు. ఈ ప్రాంతంలో మంచినీళ్ల కోసం ఆడపడచులు పడ్డ కష్టాలు ఇప్పటికీ మర్చిపోలేం. ఈరోజు మంచినీళ్లు పట్టుకునే ప్రతి ఆడపడచు ముఖ్యమంత్రి కేసీఆర్‌ను గుర్తుచేసుకుంటున్నది. రెండు వేల రూపాయలు పెన్షన్ తీసుకుంటున్న ప్రతి అవ్వకు కేసీఆర్ పెద్ద కొడుకులాగా కనిపిస్తాడు. కల్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ తీసుకునే ప్రతి ఆడపిల్లకు మేనమామ మన కేసీఆర్. తెలంగాణ రాష్ట్రంలో సంక్షేమ పథకాలు పొందుతున్న ప్రతి ఒక్కరికి కేసీఆర్ కనిపిస్తారని తెలిపారు.

**నిజం ప్రచారం పెట్టకపోతే అబద్ధం రాజ్యమేలుతుంది..** పేద ప్రజల సంక్షేమం కోసం అహర్నిశలు పాటుపడుతున్న కేసీఆర్‌ను ప్రతిపక్షాలు కావాలని తిడుతున్నాయని మంత్రి హరీశ్‌రావు ధ్వజమెత్తారు. మీకు తిడుతున్న ప్రతిపక్షాలు కావాలా? సంక్షేమం రూపంలో కిట్లు ఇస్తున్న కేసీఆర్ కావాలా? అని అడిగారు. మహిళా పక్షపాతి అయిన కేసీఆర్ మహిళల కోసం అనేక సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నారు. నిజం ప్రచారం పెట్టకపోతే అబద్ధం రాజ్యమేలుతుంది. ప్రతిపక్షాల అబద్ధాలు తిప్పికొట్టాలంటే మీరంతా ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాల గురించి, అభివృద్ధి గురించి చాటి చెప్పాలి. కరోనా లాంటి మహమ్మారి వచ్చినా సంక్షేమ పథకాలను, అభివృద్ధిని ఆపని ఏకైక రాష్ట్రం తెలంగాణ. కరోనా విపత్తులో సైతం ఆసరా పెన్షన్ ఆగలే. కళ్యాణ లక్ష్మి ఆగలేదు అని హరీశ్‌రావు స్పష్టం చేశారు.

**కేసీఆర్ వల్లే గజ్వేల్ రూపురేఖలు మారిపోయాయి..** కేసీఆర్ గజ్వేల్ నుంచి ప్రాతినిధ్యం వహించడం మనందరి అదృష్టం అని హరీశ్‌రావు పేర్కొన్నారు. ఆయన ప్రాతినిధ్యం వల్లే గజ్వేల్ రూపురేఖలు మారిపోయాయి. అందుకే ఆయనను అత్యధిక మెజారిటీతో మళ్లీ గెలిపించుకోవాలి అని కోరారు.

సిద్దిపేట కంటే ఎక్కువ మెజారిటీతో ముఖ్యమంత్రి కేసీఆర్‌ను గెలిపించుకొని అభివృద్ధిని కొనసాగిద్దాం. అన్ని వర్గాల కోసం ముఖ్యమంత్రి ఆలోచన చేస్తున్నారు. త్వరలోనే బీఆర్ఎస్ మేనిఫెస్టోను విడుదల చేయబోతున్నాం. అన్ని వర్గాలు సంతోషపడేలా శుభవార్త త్వరలోనే వింటారు అని హరీశ్‌రావు పేర్కొన్నారు.

# సంపాదకీయం

## 66 దేశాలు తిరిగిన మోదీ..

## విదేశాంగ విధానంలో కెనడా దెబ్బ?

బహుశా భారత దేశంలోనే కాదు.. ప్రపంచంలోనే మరే దేశాధినేత, ప్రధాని కూడా తిరగనన్ని దేశాల్లో పర్యటించారు నరేంద్ర మోదీ. తొమ్మిదేళ్ల పైగా పాలనలో ఆయన 66 దేశాల్లో పర్యటించారు. పలుసార్లు పర్యటించిన దేశాలను కూడా కలుపుకొంటే మొత్తం ఆయన 72 పర్యటనలు చేశారు. ఈ క్రమంలో ఆయన ఎన్నో దేశాలకు తొలిసారి వెళ్లిన తొలి భారత ప్రధానిగా రికార్డులు నెలకొల్పారు. చాలా దేశాల్లో దశాబ్దాల తర్వాత పర్యటించిన భారత ప్రధానిగానూ చరిత్ర పుటల్లోకి ఎక్కారు.

**విదేశాంగంలో గొప్ప కదలిక :** ఇతర ప్రధానుల సంగతిని పక్కనపెడితే.. మోదీ బాధ్యతలు చేపట్టాక భారత విదేశాంగ విధానంలో చాలా మార్పు వచ్చిందని చెప్పక తప్పదు. 2015లో అనూహ్యంగా శత్రుదేశం పాకిస్థాన్ లో పర్యటించడం అందరినీ ఆశ్చర్యపరిస్తే, ఎన్నడూ లేని విధంగా మంగోలియాలోనూ ఆయన కాలిడి విశిష్టత చాటుకున్నారు. ఒకవిధంగా చెప్పాలంటే అత్యంత ఘన చరిత్ర ఉన్న భారత్ విధానాలను ప్రపంచ దేశాలకు చాటిచెప్పడంలో ఇలాంటి పర్యటనలు ఉపయోగకరమే. కాగా, ఇన్నేళ్ల మోదీ విదేశాంగ విధానంలో కీలక మార్పు జైశంకర్ వంటి వారిని మంత్రిగా నియమించడం. ప్రపంచ వేదికలపై భారత్ వైఖరిని బలంగా చాటడంలో జైశంకర్ అత్యంత ప్రతిభ చూపారు.

**గల్ఫ్ తోనూ బంధాలు బలం :** మోదీ ఇటీవల యూఏఈలో పర్యటించారు. ఆ సందర్భంగా ఆ దేశ కరెన్సీ దిర్హామ్ తో నేరుగా లావాదేవీలకు ఒప్పందం కుదుర్చుకున్నారు. అంటే.. మధ్యలో డాలర్ వంటి మరే దేశ కరెన్సీకీ అవకాశం లేకుండా చేయడమే. భారత దేశీయ చెల్లింపుల వ్యవస్థ యూపీఐని యూఈఈ చెల్లింపుల వ్యవస్థతో లింక్ చేసేందుకు ఒప్పందం చేసుకున్నారు. యూఈఏ అనే కాదు.. అనేక దేశాలతో కీలక భాగస్వామ్యాలను మోదీ కుదుర్చుకున్నారు.

**తేడా కొట్టింది కెనడాతోనే..** కొత్త దేశాలతోనూ సంబంధాలు పటిష్ఠం చేసుకుంటున్న మోదీ హయాంలో కెనడాతో మాత్రం తేడా కొట్టింది. దీనికి భారత ప్రభుత్వం నేరుగా కారణం కాదు. అయితే, ఖలిస్థానీ వివాదం ఇరు దేశాల సంబంధాలను దారుణంగా ప్రభావితం చేసింది. కెనడాలో 10 లక్షల మందిపైగా ఉన్న సిక్కులు అక్కడి రాజకీయాలను ముఖ్యంగా ప్రధాని టూడో ప్రభుత్వాన్ని బలంగా ప్రభావితం చేస్తున్నారు. నాలుగు దశాబ్దాలుగా ఖలిస్థానీ వాదానికి కేంద్రంగా మారిన కెనడాలో.. జూన్ 15న జరిగిన నిజ్జర్ హత్య సంచలనంగా మారింది. ఆ హత్య వెనుక భారత నిఘా వర్గాలు ఉన్నాయని ఏకంగా కెనడా ప్రధాని ట్రూడో అరోపించడం మరింత వివాదానికి దారితీసింది. అంతేగాక.. ఇరు దేశాలు దౌత్య సిబ్బంది బహిష్కరణలకు దిగాయి. కెనడా పౌరులకు భారత ప్రభుత్వం వీసాల జారీ నిలిపివేసింది. కెనడాలో ఉంటున్న హిందువులకు జాగ్రత్త అంటూ అడ్వైజరీ జారీ చేసింది. కెనడా ఉగ్రవాదులకు స్వర్గధామంగా మారిందనే తీవ్ర ఆరోపణ సైతం చేసింది. కెనడా నుంచి సైతం దీనికితగ్గట్లే ప్రతిస్పందనలు ఉంటున్నాయి. దీన్నిబట్టే ఇరు దేశాల సంబంధాలు ఏ స్థాయికి పడిపోయాయో స్పష్టమవుతోంది.

**యథా స్థితికి ఎప్పుడో..? :** కెనడా విశాల దేశం. భారతీయులకు విద్యావకాశాల పరంగా అమెరికా, యూకే, ఆస్ట్రేలియా తర్వాత కెనడా గమ్యస్థానంగా ఉంది. అలాంటి దేశంతో ద్వైపాక్షిక సంబంధాలు యథాస్థితికి వచ్చేది ఎన్నడనేది చెప్పడం కష్టమే. అందులోనూ ట్రూడో వంటి ఉండగా.. సాధ్యమయ్యే పని కాదని స్పష్టమవుతోంది. 2014 నుంచి ఎన్నో దేశాల్లోపర్యటించి వాటితో సంబంధాలను బలోపేతం చేసిన మోదీకి, ఆయన ప్రభుత్వం అనుసరిస్తున్న విదేశాంగ విధానికి కెనడా సవాలు విసిరిందనడంలో సందేహం లేదు.

# అక్రమార్జనకు సహకారం!



వరంగల్ :శుభలేఖలు సృష్టించి.. పెళ్లంటే భాజాలు, భజంత్రీలు, చుట్టాలు, విందు భోజనాలు, వారి వారి మతాచారాలు, వేద మంత్రాలు ఉంటాయి. వీటన్నింటికన్నా ముందు వధూవరులు ఉండాలి. కాజీపేట రైల్వే క్రెడిట్ కోఆపరేటివ్ సొసైటీలో పెళ్లి కోసం రుణం తీసుకునే కొందరికి ఈ తంతు ఏమీ ఉండదు. రుణం కోసం ఉత్తుత్తి శుభలేఖలు సృష్టిస్తారు. పెద్ద మొత్తంలో కమీషన్లు తీసుకొని ఈ సంఘంలో కొందరు అర్హత లేని వారికి అడ్డగోలు రుణాలు ఇస్తుండడంతో సంస్థకు బకాయిలు చెల్లించాల్సిన వారి సంఖ్య రోజురోజుకు పెరిగిపోతోంది. కాజీపేట రైల్వే క్రెడిట్ కోఆపరేటివ్ సొసైటీ (సీసీఎస్)లో డబ్బులిస్తే చాలు అర్హత లేకున్నా రుణాలు అందిస్తారన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. పెళ్లికాని వారికి పెళ్లయినట్లు వివాహ పత్రికలు సృష్టించి రుణాలు ఇస్తున్నారు. అర్హతలేని వారి పే స్లిప్‌లను ఏమార్చడం, జల్సాలు చేసే వారికి అడిగినంత డబ్బులు కట్టబెట్టడం, విహారయాత్రలు వెళ్లకున్నా, కార్లు కొనకున్నా రుణాలు అందిస్తుండటంతో సంస్థ లోటులోకి వెళుతోంది. ఇలాంటి పరిస్థితుల్లో అసలైన లబ్ధిదారులు రుణాలు పొందలేక, అవసరం తీర్చుకోలేకపోతున్నారు. ప్రతినెలా కొంత సొమ్మును పరపతి సంఘంలో దాచుకుని అవసరానికి వాడుకుందామని ముందుకెళ్లిన వారికి మాత్రం నిర్వాహకులు చుక్కలు చూపిస్తున్నారు.
ఏమిటీ సీసీఎస్..సీసీఎస్‌లో రైల్వే ఉద్యోగులు సభ్యులుగా ఉంటారు. దీనిని వారే నడిపిస్తారు. నెలకు కొంత జీతం నుంచి నేరుగా ఇందులో జమ అవుతుంది. అవసరం ఉన్న వారు ఇందులో నుంచి రుణాలు తీసుకుని వాయిదాలపై చెల్లిస్తారు. అందుకే కోట్ల రూపాయలు నిల్వ ఉంటాయి. రైల్వే గుర్తింపు ఉన్న సంస్థ ఇది. దీనికి డైరెక్టర్‌లను సభ్యులు ఎన్నుకుంటారు. డైరెక్టర్‌ల ఎన్నికలు సాధారణ ఎన్నికలను తలపిస్తాయి. గెలిచిన కార్మిక సంఘాల నేతలు ఇందులో వ్యవహారాలు చూస్తారు. కాజీపేట పరిధిలో 2,800 మంది సభ్యులు ఉన్నారు. వారి జీతాన్ని బట్టి రుణాలు అందిస్తారు. కనిష్ఠంగా 30 శాతం కంటే తక్కువ జీతం వచ్చే వారికి రుణాలు ఇవ్వరు. అయితే ఇలాంటి వారే ఇక్కడ ఎక్కువగా తీసుకుంటున్నట్టు సమాచారం. ఆర్థికంగా ఇబ్బందులు ఎదుర్కొంటున్న వారు కొందరైతే, జల్సాలకు అలవాటు పడ్డవారు, మద్యానికి బానిసలుగా ఉండే వారు నిర్వాహకుల మీద ఒత్తిడి తీసుకొచ్చి ఏదో రకంగా రుణం పొందడానికి శతవిధాల ప్రయత్నం చేస్తారు. ఇది నిర్వాహకులకు వరంగా మారింది. రుణాలు పొందిన వారు జీతం నుంచి తిరిగి చెల్లించకపోవడం వల్ల సంస్థకు నష్టం కలుగుతోంది. ఇది అనేక మంది కార్మికులు దాచుకుంటున్న సొమ్ము మీద ప్రభావం చూపుతోంది.
నిబంధనల ప్రకారమే ఇస్తున్నాం..
ఈ విషయంలో కాజీపేట సీసీఎస్ నిర్వాహకుడు రాజ్‌కుమార్‌ను వివరణ కోరగా పెళ్లి రుణాలు ఇవ్వడం లేదని, అన్ని నిబంధనల ప్రకారమే రుణాలు అందిస్తున్నామని తెలిపారు. కొన్ని సార్లు వారి అవసరాలను బట్టి అర్హతలేకున్నా ఇవ్వాల్సి వస్తుందని చెప్పారు. రుణాలు తిరిగి చెల్లించనివారు (డిఫాల్టర్స్) ఉన్న మాట వాస్తవమేనని కానీ ఎప్పటికైనా వారి నుంచి రికవరీ పెడతామని చెప్పారు. రుణాలు అందించినందుకు తాము ఎలాంటి ప్రయోజనం పొందడం లేదని వివరించారు.
కొన్ని ఉదాహరణలు..
జల్సాలకు అలవాటు పడిన ఒక రైల్వే కార్మికుడు రైల్వే క్రెడిట్ కోఆపరేటివ్ సొసైటీలో రుణం కోసం దరఖాస్తు పెట్టుకున్నారు. అప్పటికే ఆయన జీతం నుంచి ఈఎంఐలు ఉండటంతో సీసీఎస్ నిర్వాహకులు తిరస్కరించారు. దీంతో ఆయన ఓ దళారీ ద్వారా అర్హత లేకున్నా రుణం పొందారు. ఆ డబ్బులు ఇంట్లో ఇవ్వకుండా జల్సా చేశారు. దీంతో పూర్తిగా జీతం రాకుండా పోయింది. అతని భార్య ఈ విషయంపై ఆరా తీయగా ఆమెకు తెలియకుండా సీసీఎస్‌లో రుణం తీసుకున్నట్లు ఉంది. అర్హత లేకున్నా తన భర్తకు రుణం ఇచ్చి తన కుటుంబం గడవకుండా చేసినందుకు సీసీఎస్ ఎండీకి ఫిర్యాదు చేశారు. ఈ విషయంపై స్థానిక పోలీసు స్టేషన్‌లో కూడా ఫిర్యాదు చేశారు. ఈ వ్యవహారంలో నిర్వాహకులు సదరు ఉద్యోగికి రూ.3 లక్షల అప్పు ఇచ్చి అందులో రూ.లక్ష కమీషన్‌గా తీసుకొన్నట్టు, వాటిని తిరిగి తనకు ఇప్పించాలని భార్య ఫిర్యాదులో పేర్కొన్నారు.
సీసీఎస్ దళారుల పరపతితోనే అక్రమ రుణాలు మంజూరు అవుతున్నట్లు ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. ఇటీవల డోర్నకల్‌కు చెందిన ఒక ఉద్యోగి బంగారం రుణం(గోల్డ్‌లోన్) కోసం దరఖాస్తు చేసుకున్నారు. ఆయనకు అప్పటికే అప్పులున్నాయని గుర్తించి తిరస్కరించారు. ఒక దళారి (ఇతను కూడా రైల్వే ఉద్యోగే) తాను ఇప్పిస్తానని చెప్పి ముందస్తుగా తనకు రూ.15 వేలు ఇవ్వాలని కోరారు. దీనికి రుణం పొందే వ్యక్తి ఒప్పుకుని చెల్లించారు. వెంటనే రూ.3 లక్షల రుణం మంజూరైంది. డబ్బులు అందించేటప్పుడు అతనితో రూ.3 లక్షలకు సంతకాలు తీసుకుని కేవలం రూ.2.10 లక్షలు మాత్రమే ఇచ్చారు. రుణ గ్రహీత ఇదేం తీరని వాపోయారు. తర్వాత సదరు ఉద్యోగి సీసీఎం ఎండీకి ఫిర్యాదు చేశారు. కానీ అక్కడి నుంచి కూడా ఎలాంటి స్పందన రాలేదని ఉద్యోగి ఆరోపిస్తున్నారు.
కాజీపేటకు చెందిన ఒక సభ్యుడు ఇటీవల సికింద్రాబాద్‌కు మకాం మార్చారు. అతనికి రుణం పొందే అర్హతలేదు. నిర్వాహకులకు రూ.50 వేలు ఫోన్‌పే చేయగానే రుణం అందించారు. ఇలా డబ్బులు అందుకుంటున్న నిర్వాహకులు కోట్ల రూపాయలు దండుకుంటున్నట్లు ఆరోపణలు ఉన్నాయి.
అంతర్జాలంలో పంపి..స్థానికంగా ఉండే ఒక ఇంటర్‌నెట్ కేంద్రంలో ఉత్తుత్తి శుభలేఖలు ముద్రించి రుణాలు అందుకుంటున్నారు. కమర్షియల్ విభాగానికి చెందిన ఒక ఉద్యోగి తనకు కూతురు లేకున్నా నకిలీ పే స్లిప్‌లు సృష్టించి తాను దిల్లీలో ఉండి ఆన్‌లైన్‌లో పంపి రుణం పొందినట్లు తెలిసింది. ఇది స్థానికంగా చర్చనీయాంశమైంది. నిజంగా పెళ్లిళ్ల కోసం డబ్బులు అవసరం ఉన్న వారికి సకాలంలో రుణాలు అందడం లేదు. చాలా ఏళ్లుగా ఇలా రుణాల కుంభకోణం నడుస్తున్నట్టు తెలిసింది.

# మన ఊరి బడిని బాగు చేసుకుందాం!



వరంగల్ :ప్రభుత్వ పాఠశాలలను కార్పొరేట్ స్థాయిలో తీర్చిదిద్దేందుకు మన ఊరు–మన బడి పథకాన్ని ప్రభుత్వం అమలు చేస్తోంది. దీని కింద పలు పాఠశాలల్లో ప్రారంభించిన పనులు అసంపూర్తిగా దర్శనమిస్తున్నాయి. దీంతో విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారు. మరోవైపు చేసిన పనులకు బిల్లులు రావడం లేదని సర్పంచులు, గుత్తేదారులు చెబుతున్నారు. లాభనష్టాలు చూసుకోకుండా ఊరి బిడ్డల కోసం ఆలోచించి పనులు పూర్తి చేయాలని ఆయా గ్రామాల ప్రజలు కోరుతున్నారు. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా మన ఊరు మన బడి కార్యక్రమం కింద మొదటి దశలో ఎంపికైన బడుల్లో పనులు అసంపూర్తిగా ఉన్నాయి. రూ.30 లక్షలపైన కలిగిన పనుల్ని రాష్ట్ర స్థాయిలోనే గుత్తేదారులకు అప్పగించారు. అంతకంటే తక్కువ వాటిని జిల్లాల వారీగా కలెక్టర్లు పనులు చేయడానికి ముందుకొచ్చిన వారికి ఇచ్చారు. చాలా చోట్ల పనుల్లో వేగం కనిపించడం లేదు. మరుగుదొడ్లు, మూత్రశాలలు, వంటగదులు, ప్రహరీ, సంప్‌ల నిర్మాణం ఉపాధిహామీకి అనుసంధానం చేశారు. ఆ పనుల్ని చేసిన వారు ఆ శాఖ నుంచి బిల్లులు రావడం లేదంటూ పనులు ఆపేశారు.
చేసిన పనుల్లోనూ నాణ్యత ప్రమాణాలను పాటించడం లేదు. ఇష్టారాజ్యంగా చేస్తూ చేతులు దులుపుకొంటున్నట్లు ఆరోపణలు వస్తున్నాయి. క్షేత్రస్థాయిలోకి వెళ్లి నిరంతరం పనులు పర్యవేక్షించాల్సిన అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరించడం వల్లనే ఈ విద్యాసంవత్సరం ముగిసే నాటికి పూర్తి కావాల్సిన పనులు ఎక్కడివక్కడే ఉన్నాయని విద్యార్థుల తల్లిదండ్రులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.
ఆదర్శ బడులు ఫర్వాలేదు..ఉమ్మడి జిల్లాలో తొలి దశలో చాలా పాఠశాలలను ఎంపిక చేశారు. ముందుగా జిల్లాల వారీగా ప్రతి మండలానికి రెండు బడులను ఎంపిక చేసి వాటిలో పనులు పూర్తి చేయాలని నిర్దేశించుకున్నారు. వాటిని ఆదర్శ బడులుగా పేరు పెట్టారు. దాదాపు 90 శాతం బడుల్లో పనులు పూర్తయ్యాయి. చాలా చోట్ల అధికారికంగా ప్రారంభించాల్సి ఉంది.
కమీషన్ల గోలపనులు దక్కించుకున్న గుత్తేదారులకు కమీషన్ల వ్యవహారం వెంటాడుతోంది. ఉమ్మడి జిల్లాలోని చాలా ప్రాంతాల్లో పనులు చేయడానికి వారు సందేహిస్తున్నారు. కొందరు ప్రజాప్రతినిధులు తాము అడిగినంత కమీషన్ ఇవ్వాలంటూ డిమాండ్ చేస్తున్నారు. దాంతో పనులు చేయడానికి వారు ముందుకు రావడం లేదు.
వెన్నారం పాఠశాలను ఆదర్శంగా తీసుకుందాం
ఇది మహబూబాబాద్ జిల్లా డోర్నకల్ మండలం వెన్నారం ప్రభుత్వ ప్రాథమికోన్నత పాఠశాల. మొన్నటిదాక వరండాపై రేకులు, రంధ్రాలు పడిన గోడలు, ఆరు బయట వంటకాలతో అధ్వానంగా ఉండేది. మన ఊరు–మన బడితో రూపురేఖలే మారాయి. ఇందుకు కేటాయించిన రూ.18.50 లక్షల నిధులతో సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దారు. బాలబాలికలకు ప్రత్యేకంగా మరుగుదొడ్లు, ఇతర అన్ని వసతులు కల్పించారు. పనులను ఆరు నెలల్లోనే పూర్తి చేశారు. సర్పంచి బోయినపల్లి వెంకన్న స్వయంగా పర్యవేక్షించడం వల్లనే వేగవంతంగా జరిగి సుందరంగా రూపుదిద్దుకుంది.
నర్సంపేట పట్టణంలోని బాలుర ఉన్నత పాఠశాల ఆవరణలోని ప్రాథమిక పాఠశాలకు రూ.20 లక్షలు మంజూరయ్యాయి. వీటితో ప్రహరీ, తాగునీటి వసతి, విద్యుత్తు సౌకర్యం, తదితర మౌలిక వసతులు కల్పించాలి. పనులు పూర్తి కావడం లేదు. మరోవైపు ఆవరణలోని శిథిలమైన పాత భవనానికి చెందిన రాళ్లను ప్రహరీ పునాదికి, ఉన్నత పాఠశాల డైనింగ్ హాలు నిర్మాణానికి ఉపయోగించినట్లు తెలిసింది. ప్రహరీకి నిర్ణీత పద్ధతిలో నీటి క్యూరింగ్ చేయడం లేదు. పాత బడి భవనం రాళ్లు, మట్టిని అక్కడి నుంచి బయటకు తరలించి సొంతానికి వాడుకున్నట్లు సమాచారం. ఈ విషయమై పుర ఏఈ శాంతిస్వరూప్‌ను వివరణ కోరగా పరిశీలించి దానికనుగుణంగా ఎంబీ రికార్డు చేస్తామన్నారు.

# చదువుతో పాటు లోకజ్ఞానం ముఖ్యం

నల్గొండ : విద్యార్థులు చదువుతో పాటు నైపుణ్యాలు పెంపొందించుకుంటూ లక్ష్య సాధనతో ముందుకు సాగాలని జిల్లా అదనపు కలెక్టర్ భాస్కర్‌రావు సూచించారు. చదువు ఒక్కటే కాకుండా లోక జ్ఞానం ముఖ్యమని స్పష్టం చేశారు. నల్గొండ జిల్లా కేంద్రంలోని కాకతీయ డిగ్రీ, పీజీ కళాశాల సమావేశ మందిరంలో శుక్రవారం నిర్వహించిన ఉమ్మడి నల్గొండ జిల్లా స్థాయి 'ఈనాడు ప్రతిభా పాటవ పోటీల' ముగింపు కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. పత్రికలు చదవడం వల్ల ఉపయోగాలు ఉన్నాయని వివరించారు. పోటీ ప్రపంచంలో పత్రికలు చదవాలని సూచించారు. ప్రస్తుత ప్రపంచంలో సాఫ్ట్‌వేర్ ఒక్కటే ఉద్యోగం కాదని, వ్యాపార రంగాలు, టూరిజం, ఇతర ఎన్నో రంగాల్లో మంచి ఉద్యోగాలు ఉన్నాయని చెప్పారు. వందకు వంద మార్కులు రావడం వల్ల గొప్ప తెలివి తేటలు ఉన్నట్లు కాదని, బయట ఏం జరుగుతుందో తెలియాల్సిన అవసరం ఉందన్నారు. పిల్లల్లోఉన్న ప్రతిభను వెలికి తీసేందుకు ఈనాడు ప్రతిభా పాటవ పోటీల్లో పాల్గొన్న విద్యార్థులకు, విజేతలకు అభినందనలు తెలిపారు. రాష్ట్రస్థాయిలోనూ నైపుణ్యాలు, తెలివితేటలు ప్రదర్శించి ఉమ్మడి జిల్లాకు పేరు తేవాలని ఆకాంక్షించారు. ఈ సందర్భంగా నిర్వహించిన వ్యాసరచన, చిత్రలేఖనం, స్టోరీ టెల్లింగ్, క్విజ్ పోటీల విజేతలకు బహుమతులు అందజేశారు. మొత్తం 72 మంది విద్యార్థులు ఉమ్మడి జిల్లా స్థాయి పోటీల్లో పాల్గొనగా ఒక్కో విభాగంలో ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులు చొప్పున మొత్తం 12 మందికి బహుమతులు అందచేశారు. కాకతీయ డిగ్రీ, పీజీ కళాశాల ఇన్‌ఛార్జి కె.వెంకట్‌రెడ్డి మాట్లాడుతూ పత్రికాపఠనంతో జ్ఞానం పెరగడంతో పాటు భాష, నైపుణ్యం మెరుగుపడుతుందన్నారు. పోటీ ప్రపంచంలో పత్రికలు చదవాలని సూచించారు. పోటీలకు న్యాయనిర్ణేతలుగా చిత్రలేఖనంలో ఎం.రాజ్‌కుమార్, ఉపేంద్రాచారి, స్టోరీ టెల్లింగ్‌లో మేరెడ్డి యాదగిరిరెడ్డి, అలుగుబెల్లి రామచంద్రారెడ్డి, భాను శ్రీకోత్వాల్, వ్యాస రచనలో శీలం భద్రయ్య వ్యవహరించారు.
నాలుగు నెలలు... 25,982 మంది విద్యార్థులు... విద్యార్థుల్లో సృజనాత్మకత, సామర్థ్యాలను వెలికి తీయాలన్న సంకల్పంతో అక్టోబర్ నుంచి ఈనాడు ప్రతిభా పాటవ పోటీలు నిర్వహిస్తోంది. వ్యాసరచన, చిత్రలేఖనం, స్టోరీ టెల్లింగ్, క్విజ్ అంశాల్లో ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా పోటీలు నిర్వహించింది. 60 పాఠశాలలు ఎంచుకుని మొదటి దశలో 8, 9, 10 విద్యార్థులకు గత అక్టోబరు, నవంబరు, డిసెంబర్, జనవరి నెలల్లో పోటీలు జరిగాయి.మొదట పాఠశాల స్థాయిలో, రీజినల్ స్థాయిలో, ఉమ్మడి జిల్లా పరిధిలో ఈ పోటీలు జరిగాయి. అక్టోబర్‌లో జరిగిన పోటీలకు 7,448 మంది, నవంబర్‌లో 5,147, డిసెంబరులో 2,258, జనవరిలో 10,507, ఫిబ్రవరిలో 550 మంది పాల్గొన్నారు. శుక్రవారం జరిగిన పోటీకి 72 మంది హాజరయ్యారు. మొత్తం 25,982 మంది విద్యార్థులు పాల్గొన్నారు. ఒక్కో దశలో విజేతలను ఎంపిక చేస్తూ పాఠశాల, రీజనల్ స్థాయిలో ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులు అందజేశారు. ఉమ్మడి జిల్లా పరిధిలో చిత్రలేఖనం, వ్యాసరచన, క్విజ్, స్టోరీ టెల్లింగ్‌లలో ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాల్లో మొత్తం 12 మంది విద్యార్థులను ఎంపిక చేసి బహుమతులు అందజేశారు. ఈ 12 మంది రాష్ట్రస్థాయి 'ఈనాడు ప్రతిభా పాటవ పోటీ'ల్లో పాల్గొననున్నారు.
ఉమ్మడి నల్గొండ జిల్లాస్థాయిలో విజేతలు వీరే...
వ్యాసరచన విభాగంలో..కె.సమీరా (10వ తరగతి, ప్రేరణ ఉన్నత పాఠశాల నల్గొండ), వై.వీణా (9వ తరగతి, శ్రీచైతన్య ఉన్నత పాఠశాల, నల్గొండ), వి.సాయిచరణ్ (10వ తరగతి, సిటీ టాలెంట్ ఉన్నత పాఠశాల, సూర్యాపేట)లు వరుసగా ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులు గెలుచుకున్నారు.
చిత్రలేఖనం విభాగంలో..
డి.అనిత (10వ తరగతి, అబ్యాస ఉన్నత పాఠశాల మిర్యాలగూడ), ఈ.నందు(9వ తరగతి, దివ్య బాల ఉన్నత పాఠశాల భువనగిరి), ఎస్.రూప్‌తేజ్(9వ తరగతి, ఏకలవ్య ఉన్నత పాఠశాల, నల్గొండ)లు వరుసగా ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులు గెలుచుకున్నారు.
క్విజ్ పోటీలో..డి.మణికంఠ (10వ తరగతి, సందీప్ ఉన్నత పాఠశాల, నల్గొండ), టి.అభిరామ్‌రెడ్డి (10వ తరగతి, తేజ విద్యాలయం, కోదాడ), ఉమేష్‌రెడ్డి(9వ తరగతి, సందీప్ ఉన్నత పాఠశాల, నల్గొండ)లు వరుసగా ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులు గెలుపొందారు.
స్టోరీ టెల్లింగ్ పోటీలో..కె.శ్లోక (8వ తరగతి, శివాని ఉన్నత పాఠశాల, మిర్యాలగూడ), రాధిక శర్మ (8వ తరగతి, లిటిల్ ఫ్లవర్ ఉన్నత పాఠశాల, మిర్యాలగూడ), ఆర్.దీపిక (10వ తరగతి, కృష్ణవేణి పాఠశాల దేవరకొండ)లు వరుసగా ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులు గెలుపొందారు.

# సంఘం ఉంటేనే... సంక్షేమం

నల్గొండ : ఊరికో మత్స్య కార్మికుల సహకార సంఘం ఏర్పాటు లక్ష్యం ఉమ్మడి జిల్లాలో ఎప్పుడు నెరవేరుతుందోననే సందేహం కలుగుతోంది. సంఘం ఉంటేనే సంక్షేమ పథకాలు వర్తిస్తాయని, కార్మికులుగా గుర్తింపు పొందేందుకు తర్ఫీదు ఇస్తామని చెబుతూ మత్స్య శాఖాధికారులు విస్తృతంగా ప్రచారం చేస్తున్నా..కార్మికులు మాత్రం ముందుకు రావడం లేదు. దీంతో ఆశించిన లక్ష్యం ఆమడ దూరంలో నిలిచింది. గతంలో అయితే మత్స్య కార్మికులు ఉన్న పెద్ద గ్రామాల్లోనే సంఘాలు ఉండేవి. మిగతా చోట్ల కుంటలు, గుర్తింపు పొందని చెరువులన్నీ గ్రామ పంచాయతీ పాలకుల ఆధిపత్యంలో ఉండేవి. వీటిలో చేపలు వదలాలన్నా, పట్టుకోవాలన్నా గ్రామ పంచాయతీ పాలకుల అనుమతి తప్పనిసరిగా ఉండేది. దీని వల్ల మత్స్య కార్మికులకు ఉపయోగం లేదన్న ఉద్దేశంతో ప్రభుత్వం విధి విధానాలను మార్చి గ్రామ పంచాయతీల ఆధిపత్యాన్ని తగ్గించింది.
సంఘంలో ఉంటే పథకాలుఉమ్మడి జిల్లాలో 1740 గ్రామ పంచాయతీలు ఉండగా.. మత్స్య సహకార సంఘాలు 424 ఉన్నాయి. ఈ లెక్కన ఇంకా 1,316 సంఘాలు ఏర్పాటు చేయాలి. 45 మహిళా సంఘాలు ఉన్నాయి. పరిమితి లేకుండా మహిళా సంఘాలు ఏర్పాటు చేసుకునే అవకాశం ఉన్నా ఉపయోగించుకోవడం లేదు. అత్యధిక గ్రామాల్లో సంఘాలు లేక మత్స్య కార్మికులు ప్రభుత్వ సంక్షేమ పథకాలకు దూరంగా ఉన్నారు. అన్ని గ్రామాల్లోని కార్మికులు మత్స్యశాఖ అమలు చేస్తున్న వివిధ సంక్షేమ పథకాల్లో లబ్ధిదారులు కావాలంటే ఇకనైనా గ్రామ గ్రామాన మత్స్య సహకార సంఘాలను ఏర్పాటు చేసుకోవాలి.
అవగాహన కల్పిస్తున్నాం– వెంకయ్య, మత్స్య శాఖ జిల్లా అధికారి,



నల్గొండప్రభుత్వం మత్స్య కార్మికుల సంక్షేమాన్ని దృష్టిలో పెట్టుకుని ఊరికో మత్స్య సహకార సంఘాన్ని ఏర్పాటు చేయాలని ఆదేశించింది. దీనికి అనుగుణంగా కొత్త సంఘాల ఏర్పాటుకు అవగాహన కల్పిస్తున్నాం. త్వరలో 13 సంఘాలు ఏర్పాటు చేస్తాం. సభ్యులుగా అర్హత సాధించేందుకు శిక్షణ తీసుకోవాల్సి ఉంటుంది. తర్ఫీదు ఇచ్చేందుకు ఎనిమిది మంది శిక్షకులను సైతం ఏర్పాటు చేశాం. ఆయా గ్రామాలకు చెందిన కార్మికులు పిలిస్తే వీరిని పంపించి శిక్షణ ఇప్పించేందుకు సిద్ధంగా ఉన్నాం.
మత్స్య కార్మికులకు అప్పగింతజియో ట్యాగింగ్ అయిన కుంటలు, చెరువులు ఉమ్మడి జిల్లాలో 3 వేలు ఉన్నాయి. వీటన్నింటిలో మత్స్య సంపదను పెంచి కార్మికులకు ఉపాధి కల్పించాలన్న లక్ష్యంతో ప్రభుత్వం ప్రతి ఊరికో మత్స్య సహకార సంఘాన్ని ఏర్పాటు చేయాలని నిర్ణయించింది. దీనికి అనుగుణంగా చర్యలు చేపట్టాల్సిందిగా మత్స్య శాఖాధికారులను ఆదేశించింది. సంఘం ఏర్పాటు కావాలంటే ముందు సభ్యులుగా అర్హత సాధించాలి. చేపలు పట్టడంలో మెలకువలు నేర్చుకోవడంతో పాటు ఈత రావాలి. వీటన్నింటిపై శిక్షణ ఇచ్చేందుకు మత్స్యశాఖ నల్గొండ జిల్లాలో ఎనిమిది మంది శిక్షకులను సిద్ధం చేసింది. జిల్లాలోని ప్రతి గ్రామంలో కార్మికులు ఉన్న సంఘాల ఏర్పాటుకు అవగాహన లేక ముందుకు రావడం లేదు.

# రాయితీ దూరం.. యువతకేదీ ప్రోత్సాహం

పెద్దపల్లి: దళితుల ఆర్థిక అభ్యున్నతే లక్ష్యంగా ప్రభుత్వం తెలంగాణ స్టేట్ ప్రోగ్రాం ఫర్ ర్యాపిడ్ ఇంక్యూబేషన్ ఆఫ్ దళిత్ ఎంట్రప్రెన్యూర్స్(టీ-ప్రైడ్)ను ప్రవేశపెట్టింది. ఈ పథకంలో భాగంగా దళితుల్లో ఔత్సాహికులైన యువ సాంకేతిక పట్టభద్రులను పారిశ్రామికవేత్తలుగా, గుత్తేదారులుగా తీర్చిదిద్దడానికి ప్రతి సంవత్సరం యూనిట్లు, నిధులు కేటాయిస్తోంది. అట్టడుగున ఉన్న దళిత, గిరిజన వర్గాలను పారిశ్రామికవేత్తలుగా తీర్చిదిద్ది సమగ్ర ఆర్థికాభివృద్ధి సాధించడమే టీ ప్రైడ్ లక్ష్యం. కాగా కొన్నేళ్లుగా ప్రభుత్వం నుంచి రావాల్సిన రాయితీ సొమ్ము రాకపోవడంతో లబ్ధిదారులకు ప్రోత్సాహం కరవైంది.

గరిష్ఠంగా రూ.75 లక్షల రుణం

టీ ప్రైడ్ పథకం కింద సాంకేతిక, ఇతర కోర్సుల్లో పట్టభద్రులైన యువతకు రాయితీతో కూడిన రుణాలు ఇస్తారు. చిన్న, మధ్యతరహా పరిశ్రమల ఏర్పాటుకు దళిత, గిరిజనులతో పాటు దివ్యాంగులకు కూడా పెట్టుబడిలో 35 శాతం రాయితీ.. గరిష్ఠంగా రూ.75 లక్షల వరకు రుణం కల్పిస్తారు. మహిళలకు అదనంగా 10 శాతం కలుపుకొని 45 శాతం వరకు రాయితీ వర్తింపజేస్తారు. పథకం కింద స్టాంప్ డ్యూటీ, విద్యుత్తు ఖర్చులు, వడ్డీల రీయింబర్స్‌మెంట్, పెట్టుబడి రాయితీ వంటి సౌకర్యాలు కల్పిస్తారు. తెలంగాణ మౌలిక వసతులు, సదుపా



యాల సంస్థ(టీఎస్ఐఐసీ) ఏర్పాటు చేసే పారిశ్రామికవాడల్లో ఖాళీ స్థలాల కేటాయింపులో టీ ప్రైడ్‌కు ప్రాధాన్యం ఇస్తారు. జిల్లాలోని పెద్దపల్లి, మంథని, సుల్తానాబాద్‌లలో ఎక్కువగా బియ్యం మిల్లుల విడి భాగాల పరిశ్రమలు, సిమెంటు ఇటుకల తయారీ యూనిట్లను ఎక్కువ మంది ఎంచుకున్నారు. రామగుండం, మంథని ప్రాంతాల్లో కొందరు కార్లు, పొక్లెయిన్లు, ఇతర వాహనాలు తీసుకొని వ్యాపార పరంగా అభివృద్ధి చెందుతున్నారు.

2020 నుంచి పెండింగ్..

టీ ప్రైడ్ పథకానికి దరఖాస్తులు, లబ్ధిదారుల ఎంపిక ప్రక్రియ అంతా ఆన్‌లైన్‌లోనే ఉంటుంది. లబ్ధిదారుల బ్యాంకు ఖాతాలకే రాయితీ సొమ్ము జమ అవుతుంది. కొన్నేళ్లుగా రాయితీ సొమ్ము రాకపోవడంతో పరిశ్రమలు ఏర్పాటు చేసుకున్న యువత నిరుత్సాహానికి గురవుతున్నారు. రూ.25 లక్షల మూలధనం దాటితే రాష్ట్ర స్థాయి టీ-ప్రైడ్ కమిటీ, రూ.25 లక్షల కంటే తక్కువ మొత్తంతో రుణం తీసుకుంటే జిల్లా స్థాయి టీ-ప్రైడ్ కమిటీలు రుణాలు అందిస్తున్నాయి. 2020 నుంచి ఇప్పటివరకు ఎస్సీలు మొత్తం 337 యూనిట్లు తీసుకోగా వీరికి దాదాపు రూ.15.69 కోట్ల మేర రాయితీ చెల్లించాల్సి ఉంది. ఎస్టీలు 69 యూనిట్లు తీసుకోగా రూ.11.68 కోట్లు, దివ్యాంగులకు 25 యూనిట్లు మంజూరు కాగా రూ.6.26 కోట్లు చెల్లించాల్సి ఉంది. వీరందరికీ కలిపి మొత్తం 431 యూనిట్లకు గాను రూ.33.63 కోట్ల మేర రాయితీ సొమ్ము వారి ఖాతాలకు జమ చేయాల్సి ఉంది.

ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లాం

– మధుసూదనచారి, జిల్లా పరిశ్రమల శాఖ అధికారి

2020 నుంచి ఇప్పటివరకు ప్రభుత్వం నుంచి రాయితీ సొమ్ము రాలేదు. ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసిన తర్వాత సాధ్యాసాధ్యాలు పరిశీలించాక వారం రోజుల వ్యవధిలో యూనిట్ మంజూరు చేస్తున్నాం. ఆ తర్వాత ఇవ్వాల్సిన రాయితీ మొత్తాలు పెండింగ్‌లో ఉన్నాయి. ఈ విషయమై ఇప్పటికే పలుమార్లు రాష్ట్ర పరిశ్రమల శాఖ దృష్టికి తీసుకెళ్లాం. త్వరలో రాయితీ సొమ్ము కూడా మంజూరయ్యే అవకాశాలున్నాయి.

# గ్రంథాలయమా..? కళాశాల భవనమా..?

పెద్దపల్లి: అంతర్జాలం, ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం అందుబాటులోకి వచ్చిన తరువాత గ్రంథాలయాల మనుగడ ప్రశ్నార్థకంగా మారిపోయింది. విద్యార్థులు, యువతలో పుస్తక పఠనం తగ్గిపోయింది. దీంతో విద్యాలయాలతో గ్రంథాలయాలను అనుసంధానం చేసేందుకు కొంతకాలంగా ప్రయత్నాలు జరుగుతున్నాయి. ఈ క్రమంలో పలు ప్రాంతాల్లో పాఠశాలల భవనాల్లోనే శాఖ గ్రంథాలయాలను ఏర్పాటు చేశారు. పెద్దపల్లి జిల్లా కేంద్రంలో జిల్లా గ్రంథాలయ భవన నిర్మాణం కోసం స్థలం లభ్యత సమస్యగా మారడంతో జూనియర్ కళాశాల మైదానంలో నిర్మించేందుకు ప్రభుత్వం అనుమతులు మంజూరు చేసింది. విద్యార్థులలో పుస్తక పఠనంపై ఆసక్తి పెరిగేందుకు దోహదం చేస్తుందని భావిస్తున్న తరుణంలో గ్రంథాలయ భవనం నిర్మాణ స్థలంపై వివాదం చుట్టుముట్టింది. శిథిలమైన కళాశాల భవనం స్థలంలో నూతన భవనం నిర్మించకుండా గ్రంథాలయ చేపట్టడాన్ని విద్యార్థి సంఘాలు వ్యతిరేకిస్తున్నాయి.

అరకొర గదుల్లో తరగతులు

పెద్దపల్లిలోని బాలిక జూనియర్ కళాశాల పాత భవనం పూర్తిగా శిథిలం కావడంతో ఆరేళ్ల క్రితం ప్రభుత్వం కూల్చివేతకు ఉత్తర్వులు ఇచ్చింది. కానీ నిధుల కొరత కారణంగా కొత్త భవన నిర్మాణం చేపట్టలేదు. దీంతో ప్రస్తుతం కళాశాలలోని నార్త్‌బ్లాక్, ఎన్టీఆర్ బ్లాక్‌లలోనే తరగతులు నిర్వహిస్తున్నారు. ఎన్టీఆర్ బ్లాక్‌లో ప్రయోగశాలలోనే అరకొర వసతుల మధ్య తరగతులు నిర్వహిస్తున్నారు. దీంతో శిథిలమైన కళాశాల భవనం స్థానంలో గ్రంథాలయం నిర్మించాలనే ప్రతిపాదనను విద్యార్థి సంఘాల నాయకులు వ్యతిరేకిస్తున్నారు.

ప్రభుత్వ ఉత్తర్వుల ప్రకారమే నిర్మాణం

రఘువీర్‌సింగ్, జిల్లా గ్రంథాలయ సంస్థ ఛైర్మన్

గ్రంథాలయాలను విద్యాలయాలకు చేరువలో నిర్మించాలనే ప్రభుత్వ ఉత్తర్వులకు అనుగుణంగా జూనియర్ కళాశాల మైదానంలో స్థలాన్ని ఎంపిక చేశాం. శిథిలమైన భవనం తొలగించి నిర్మించడం వల్ల విద్యార్థులకు ఇబ్బంది లేదు. బాలికల జూనియర్ కళాశాల నూతన భవనం నిర్మాణానికి కేటాయించిన స్థలానికి ఇబ్బంది లేకుండా గ్రంథాలయ భవనం నిర్మిస్తున్నాం. దీన్ని మైదానంలోని మరో ప్రాంతానికి తరలిస్తే వాకింగ్ ట్రాక్‌కు ఇబ్బంది ఏర్పడుతుంది. కొందరు రాజకీయ దురుద్దేశంతోనే వివాదాలు లేవనెత్తుతున్నారు.

# పాఠశాలలకు సౌర విద్యుత్తు సౌకర్యమెప్పుడో?



కరీంనగర్ : జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలలకు ప్రతి నెలా రూ.వేలల్లో విద్యుత్తు బిల్లులు వస్తున్నాయి. బిల్లులు చెల్లించక పోవడంతో అధికారులు విద్యుత్తు కనెక్షన్లను తొలగిస్తున్నారు. ఈ నేపథ్యంలో పాఠశాలలకు సౌర విద్యుత్తు సౌకర్యం కల్పించి విద్యుత్తు బిల్లుల భారం తగ్గించాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఇందులో భాగంగా తొలివిడతలో విద్యార్థులు అధిక సంఖ్యలో ఉన్న ఉన్నతపాఠశాలల్లో సౌరశక్తి యూనిట్లు ఏర్పాటు చేయాలని ఆర్నెల్ల క్రితం సంకల్పించింది. జిల్లాలో 22 పాఠశాలలను ఎంపిక చేశారు. విడతల వారీగా జిల్లాలోని అన్ని పాఠశాలల్లో ఏర్పాటు చేస్తామని ప్రకటించినప్పటికీ మొదటి విడతలో ఆశించిన స్థాయిలో పురోగతి లేదు. తమ పాఠశాలల్లో సౌరశక్తి యూనిట్‌ను ఎప్పుడు ఏర్పాటు చేస్తారో అంటూ ఉపాధ్యాయులు, యాజమాన్య కమిటీ సభ్యులు ఎదురు చూస్తున్నారు. జిల్లాలో కేవలం ఏడు పాఠశాలలకు మాత్రమే సౌర విద్యుత్తు సౌకర్యం కల్పించగా.. 15 పాఠశాలల్లో నేటికీ పనులను ప్రారంభించలేదు.

ఎంతో ఉపయోగం

పలు పాఠశాలల్లో దాతల సహకారంతో ఫ్యాన్లు, ట్యూబ్‌లైట్లు, మైక్‌సెట్‌లు, నీటి వసతి కోసం బోరుమోటార్లు, మినరల్ నీటి యంత్రాలను ఏర్పాటు చేయడంతో జిల్లాలోని 80 శాతం పాఠశాలల్లో విద్యుత్తు వినియోగం పెరిగింది. దీంతో నెలకు సుమారు రూ.1000 నుంచి రూ.4 వేల వరకు విద్యుత్తు బిల్లులు వస్తున్నాయి. ప్రభుత్వం అందజేసే డబ్బులు విద్యుత్తు బిల్లులకే సరిపోతున్నాయని, ఇతర కార్యక్రమాలు నిర్వహించడం కష్టంగా మారిందని ప్రధానోపాధ్యాయులు వాపోతున్నారు. నిర్వహణ గ్రాంటు కింద మూడు మాసాల క్రితం ప్రభుత్వం పాఠశాలలకు 50 శాతం నిధులు అందజేసింది. విద్యార్థుల సంఖ్య వంద లోపు ఉన్న పాఠశాలలకు రూ.25 వేలకు గాను రూ.12,500 అందించగా.. వందకు పైగా ఉన్న పాఠశాలలకు రూ.50 వేలకు గాను రూ.25 వేలు అందజేశారు. ఈ సొమ్ములో అధిక మొత్తాన్ని విద్యుత్తు బిల్లుల చెల్లింపులకే ఖర్చు చేసినట్లు ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులు తెలిపారు. ఈ సమస్యను అధిగమించేందుకు పాఠశాలల్లో రూ.1.10 లక్షల ఖర్చుతో రెండు కిలోవాట్ల విద్యుత్తు అందించే సౌరశక్తి యూనిట్లను ఏర్పాటు చేయాలని ప్రభుత్వం సంకల్పించింది. వెంటనే సౌర విద్యుత్తు సౌకర్యం కల్పించాలని ఆయా పాఠశాలల ఉపాధ్యాయులు కోరుతున్నారు.

జిల్లాలో వివరాలివి.. సౌర విద్యుత్తు మంజూరైన బడులు 22

ఏర్పాటు చేసినవి : చిన్నముదూరు, కోలుకొండ, పాలకుర్తి, ఖిలాషాపూర్, శివునిపల్లి, ధర్మకంచ, నాగులకుంట.

పనులు ప్రారంభించనివి: కొడకండ్ల, కట్కూర్, పడమటికేశవాపూర్, చిల్పూరు, పల్లగుట్ట, స్టేషన్‌ఘన్‌పూర్, మల్కాపూర్, ఇప్పగూడెం, నవాబుపేట, దర్దేపల్లి, గూడూరు, తరిగొప్పుల, నర్మెట్ట, గానుగపహాడ్, పెంబర్తి

త్వరలో పూర్తి చేయిస్తాంటి.రాము, జిల్లా విద్యాశాఖాధికారి

నెడ్ క్యాప్ సంస్థ.. పాఠశాలల్లో సౌరవిద్యుత్తు ఏర్పాటు చేసే పనులను గుత్తేదారులకు అప్పగించింది. కేంద్ర ప్రభుత్వ బడ్జెట్‌కు ముందు ఏడు పాఠశాలల్లో పనులు పూర్తి చేసినప్పటికీ సౌరశక్తి యూనిట్ ఖర్చులు 20 శాతం పెరగడంతో బిల్లుల సవరింపుతో జాప్యం జరిగింది. నెడ్‌క్యాప్ సంస్థ అధికారులతో చర్చించి సౌరవిద్యుత్తు యూనిట్లను ఏర్పాటు చేసే పనులను పూర్తి చేయిస్తాం.

# ఇప్పటికి నిదానం.. ఇకపై ముమ్మరం



కరీంనగర్ : రేషన్ కార్డుదారులకు ఈకేవైసీ (ఎలక్ట్రానిక్ నౌ యువర్ కస్టమర్) ప్రక్రియ జిల్లాలో ప్రారంభమైంది. ఇప్పటి వరకు సుమారు 42 వేల మంది చేసుకున్నారు. ఈనెల 24 వరకు బియ్యం పంపిణీ ఉండటంతో ఈ ప్రక్రియ నిదానంగా సాగినా.. సోమవారం నుంచి మరింత ముమ్మరం చేయనున్నారు. ఇప్పటి వరకు బియ్యం తీసుకోవడానికి వచ్చిన వారి నుంచి డీలర్లు ఈకేవైసీ స్వీకరించారు. ఇకపై రేషన్ దుకాణాల్లో ఈ ప్రక్రియ మాత్రమే చేపట్టనున్నారు. నమోదు చేసుకున్న వారి వివరాలను డీలర్లు ఎప్పటికప్పుడు ఉన్నతాధికారులకు తెలియజేస్తున్నారు. కొన్ని చోట్ల లబ్ధిదారులు బారులుదీరి.. సమయం వెచ్చించాల్సి వస్తోంది.

తప్పని వసూళ్లు..నగరంలోని విద్యానగర్ ప్రాంతంలోని ఓ రేషన్ దుకాణంలో రూ.50 వసూలుకు పాల్పడినట్లు ఆరోపణలున్నాయి. ఆ డీలరు ఈకేవైసీ కోసం ముద్రించిన పత్రాన్ని లబ్ధిదారులకు ఇస్తూ ఫారాన్ని పూర్తి చేయాలని సూచించారు. ఇలా వివరాలు పూర్తి చేసి ఇచ్చిన వారి నుంచి ఒక్కో కుటుంబం నుంచి డబ్బులు వసూలు చేశారు. కొందరు నిలదీస్తే.. వారిని తరువాత రావాలని వెనక్కు పంపారు. ఎక్కువ మంది డీలర్లు డబ్బులు తీసుకోవడంలేదు.

మొత్తం కార్డులు : 2,62,595

లబ్ధిదారులు : 7,69,708

ఆధార్ అప్‌డేట్ చేసుకుంటేనే..జిల్లా వ్యాప్తంగా ఈకేవైసీ కోసం డీలర్లు వేలిముద్రలలను ఈపాస్ యంత్రాల ద్వారా స్వీకరిస్తున్నారు. అయిదేళ్లలోపు పిల్లలకు, 60 ఏళ్లు పైబడిన వారి ముద్రలు పడడంలేదు. వారికి ఐరీష్ విధానాన్ని ఉపయోగిస్తున్నారు. నేత్ర శస్త్రచికిత్స చేయించుకున్న వారికి ఇది సమస్యగా మారుతోంది. దీనిని ఎలా అధిగమిస్తారో వేచి చూడాలి. ఆధార్ అప్‌డేట్ చేసుకోని వారిలో కొందరికి వేలి ముద్రలు రావడంలేదు. అప్‌డేట్ చేసుకోవాలని డీలర్లు సూచిస్తున్నారు.

ఇతర ప్రాంతాల వారికీ అవకాశం

అందుబాటులో లేని వారు కూడా ఇతర ప్రాంతాల రేషన్ డీలర్ల వద్ద నమోదు చేసుకునే అవకాశముంది. కార్డు ఉన్న ప్రాంతంలో కాకుండా రాష్ట్రంలో ఎక్కడ ఉన్నా సమీపంలోని డీలర్ వద్దకు వెళ్లి కార్డు నంబరు చెబితే వారికి సంబంధించిన సమాచారం వస్తుంది. యంత్రంలో వేలిముద్రను నమోదు చేసుకునే అవకాశముంది. అందుబాటులో ఉన్న కుటుంబ సభ్యులు వారి పరిధిలో ఉన్న డీలర్ వద్ద నమోదు చేసుకోవచ్చు. వేరే ప్రాంతం వారు ఇక్కడ కూడా చేసుకోవచ్చు. దీనిపై పెద్దగా ప్రచారం లేకపోవడంతో లబ్ధిదారులు ఆసక్తి చూపడం లేదు. రేషన్ కార్డు ద్వారా ప్రభుత్వం నుంచి పొందే ప్రయోజనాలు భవిష్యత్తులో మరింత పకడ్బందీగా కొనసాగించేందుకు ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకున్నట్లు భావిస్తున్నారు.

పూర్తిగా ఉచితం..– సురేశ్‌రెడ్డి, జిల్లా పౌర సరఫరాల శాఖాధికారి

ఈకేవైసీ ఉచితంగానే చేయాలి. ఎవరూ డబ్బులు ఇవ్వొద్దు. ప్రభుత్వం కాలపరిమితి పెట్టలేదు. కానీ ప్రతి ఒకరూ తప్పని సరిగా చేసుకోవాలి. చేసుకునే ముందు రేషన్‌కార్డుతోపాటు ఆధార్ కార్డును వెంట తీసుకెళ్లాలి. సోమవారం నుంచి మరింత ముమ్మరంగా ఈ కార్యక్రమాన్ని చేపట్టనున్నారు.

# ముహూర్తం కుదిరితేనే సుందరీకరణ

కరీంనగర్ : కరీంనగర్ నగరపాలక సంస్థ పరిధిలో నగరాన్ని ఆకర్షణీయంగా తీర్చిదిద్దేందుకు.. ప్రధాన కూడళ్లను ఆధునికీకరణ చేసేందుకు ప్రణాళికలు రచించారు. స్మార్ట్‌సిటీలో భాగంగా ఇప్పటికే కొన్నింటిని అందుబాటులోకి తీసుకొచ్చారు. ప్రధాన చౌరస్తాలో సిగ్నలింగ్ వ్యవస్థ అందుబాటులోకి వచ్చింది. కూడళ్లు పూర్తయిన తర్వాత రద్దీని బట్టి వీటిని వినియోగంలోకి తేవాలని నిర్ణయించారు. సిగ్నళ్ల మధ్య దూరం తక్కువగా ఉండటంతో పదేపదే ఆగుతూ వాహనదారులు ఇబ్బందులు పడ్డారు. అన్ని హంగులతో నగర కూడళ్లను పూర్తి చేసేలా చర్యలు చేపట్టారు. రూ.4 కోట్లతో 13 కూడళ్లను అభివృద్ధి చేయాలని నిర్ణయించారు.

మిగతా చోట్ల సాగదీత..

నగరంలోని కూడళ్లను వేగవంతంగా పూర్తి చేయాలని పలుమార్లు సమీక్ష సమావేశాల్లో నగర మేయర్ వై.సునీల్‌రావు ఆదేశించినా.. అనుకున్న స్థాయిలో పనులు ముందుకు సాగడం లేదు. కొన్నింటికి అయితే నెల రోజుల్లో పూర్తి చేయాలని ఆదేశించి.. రెండు నెలలైనా కొలిక్కి రాలేదు. పద్మనగర్, కోతిరాంపూర్, సిక్కువాడీ, శాతవాహన విశ్వవిద్యాలయం, పాత శిశుమందిర్ జంక్షన్, కేసీఆర్ సర్క్యూట్ హౌస్, పీవీ నరసింహారావు విగ్రహం, మారుతినగర్, రేకుర్తిలో అంబేడ్కర్ జంక్షన్, సర్వోదయ స్కూల్ ఎదురుగా, సిక్కువాడి, నెహ్రూచౌక్ ప్రాంతాల్లో పనులు కూడా ప్రారంభం కాలేదు.

అధికారులు ఏమంటున్నారంటే

గుత్తేదారులు ఆలస్యం చేస్తుండటంతో నోటీసులు ఇచ్చామని నగర పాలక సంస్థ ఇంజినీరింగ్ అధికారులు చెప్పారు. ప్రస్తుతం కొందరు ముందుకు వచ్చారని, పనులు ప్రారంభించేలా చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు.

ఆహ్లాదకర చౌరస్తాలు..జిల్లా కేంద్రంలో అడుగు పెట్టగానే ఆహ్లాదంగా కనిపించేలా కూడళ్లను తీర్చిదిద్దారు. కమాన్, అంబేడ్కర్ చౌక్,



గాంధీచౌరస్తా, బాబూ జగ్జీవన్‌రాం, పాత పవర్‌హౌజ్, హెచ్‌కెఆర్ రోడ్డు, సదాశివపల్లి, తీగల వంతెన, తెలంగాణ చౌక్, నాకా చౌరస్తా, ఆర్‌అండ్‌బీ, మాతాశిశు కేంద్రం, పొట్టి శ్రీరాములు, ఆచార్య జయశంకర్ కూడళ్లను ప్రజలకు అందుబాటులోకి తెచ్చారు.

ఆగమేఘాల మీద..గుత్తేదారులు అభివృద్ధి పనులు సగం మేర చేసి వదిలేస్తున్నారు. ఆ తర్వాత చేయకపోవడం ప్రారంభోత్సవాలకు ముహూర్తం కుదిరితే తప్ప ముందుకు వెళ్లడం లేదు. అప్పుడు గడువు ముంచుకొచ్చే సమయంలో ఆగమేఘాల మీద తూతూమంత్రంగా పనులు చేయడానికి ఆసక్తి కనబరుస్తున్నట్లు తెలుస్తోంది.

# ఈ-పంచాయతీ.. కనిపించని ప్రగతి

నల్గొండ : క్షేత్ర స్థాయిలో పారదర్శకత పాలన అందించడానికి ఎనిమిదేళ్ల క్రితం సమగ్ర సేవా కేంద్రాని (ఈ-పంచాయతీ)కి ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా మొదట మేజర్ పంచాయతీలను ఎంపిక చేసి కంప్యూటర్లు, ప్రింటర్లు పంపిణీ చేశారు. నిర్వహణకు ఆపరేటర్లను తాత్కాలిక పద్ధతిన నియమించి స్థానికంగా ధ్రువపత్రాలను జారీ చేశారు. మిషన్ భగీరథలో భాగంగా టీ-ఫైబర్ పేరిట అన్ని పంచాయతీలకు ఇంటర్నెట్ కనెక్షన్ ఇచ్చేందుకు ఏర్పాట్లు చేశారు. కానీ.. దాదాపు నాలుగేళ్లు గడిచినా ఇంతవరకు అంతర్జాల సేవలు అందుబాటులోకి రాలేదు. ప్రస్తుతం కంప్యూటర్లు, ఇతర సామగ్రి మూలనపడ్డాయి. ఆపరేటర్లు మాత్రం మండల పరిషత్తు కార్యాలయాల్లో విధులు నిర్వహిస్తున్నారు. వీరికి ప్రతి నెలా గ్రామ పంచాయతీల నుంచి వేతనాలు చెల్లిస్తున్నా.. సేవలు మాత్రం మండల కేంద్రానికే పరిమితం చేశారు.

సకాలంలో అందని నివేదికలు



రోజూవారీగా అనుమతులు, కార్యకలాపాలన్నింటినీ పంచాయతీ కార్యదర్శులు అంతర్జాలంలో నిక్షిప్తం చేయాల్సి ఉంది. ప్రస్తుతం మండల కేంద్రాలకు వెళ్లి నివేదికలు సిద్ధం చేయాల్సి వస్తోంది. అక్కడ అందరికీ సరిపడా యంత్రాలు లేక పనులు పెండింగ్‌లో పడిపోతున్నాయి. గతంలో జనన, మరణ ధ్రువీకరణ పత్రాలను రాతపూర్వకంగా జారీ చేసే అధికారం పంచాయతీ కార్యదర్శులకు ఉండేది. ప్రస్తుతం ఈ-పంచాయతీ పోర్టల్‌ను ఆధునికీకరించి యూబీడీ (యూనిఫైడ్ బర్త్, డెత్)గా రూపొందించారు. దీంతో ఏది జారీ చేయాలన్నా కంప్యూటర్ ఉండాల్సిందే అన్న విధంగా మారింది.

నిర్వహణకు పది శాతం నిధులు

పంచాయతీల్లో ఈ-పంచాయతీ సేవలు అందడం లేదు. కానీ.. వీటి నిర్వహణ పేరిట కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ద్వారా పంచాయతీలకు వచ్చే నిధుల నుంచి పది శాతం జమ చేసుకుంటున్నారు. వీటిని ఎంపీవోల ఆధ్వర్యంలో ఆపరేటర్లకు వేతనాలు, ఇతర ఖర్చుల పేరిట వినియోగిస్తున్నట్లు అధికారులు చెబుతున్నారు. గ్రామస్థాయిలో అందించని సేవలకు తామెందుకు డబ్బులు జమ చేయాలని పలువురు సర్పంచులు అభ్యంతరం చెబుతున్నారు.

# మిరప పంటకు ముమ్మందు మంచిరోజులు!

నల్గొండ : పస్తుత వర్షాభావం పంటలను వెంటాడుతోంది. మిరప మార్కెట్ మాత్రం రైతులకు గంపెడాశల్ని చూపిస్తోంది. ఇటీవల వాతావరణంలో చోటుచేసుకుంటున్న పరిణామాలను బట్టి ఉద్యానవన శాస్త్రవేత్తలు పై విధంగా అంచనా వేస్తున్నారు. మిరపకు మునుముందు మంచి ధర ఉండొచ్చన్న విషయాన్ని స్పష్టంగా చెబుతున్నారు.

అంచనాలు తలకిందులై:

చైనా, బంగ్లాదేశ్, మలేషియా తదితర విదేశాలకు ఎగుమతయ్యే పంట దిగుబడుల్లో మన ఉమ్మడి జిల్లా మిరపకాయ కూడా ఉంటోంది. హైదరాబాద్, ఖమ్మం, గుంటూరు మార్కెట్‌ల ద్వారా మన మిరపకాయ విదేశాలకు ఎగుమతవుతుంది. ఐతే.. ఇతర దేశాలైన చైనా, మనదేశ పంట కొనుగోలుదారులు ఎక్కువగా మధ్యప్రదేశ్ మిరప దిగుబడులపైనే ఆశలు పెట్టుకుంటారు. కానీ.. ఈసారి మాత్రం ఇటీవల అక్కడ భారీ వర్షాలు, వరదలతో తీవ్ర పంటనష్టం వాటిల్లింది. వారి అంచనాలు తలకిందులయ్యాయి.

ఎగుమతి లేకున్నా..:



గత సీజన్ మొత్తమ్మీద మిరప పంట దిగుబడులు తగ్గినా.. ఎకరానికి గరిష్ఠంగా 20–30 క్వింటాళ్ల వరకొచ్చాయి. ఒకానొక దశలో క్వింటా ధర గరిష్ఠంగా రూ.25 వేలు దాటింది. కొన్నాళ్ల వరకే ఉన్న గరిష్ఠ ధరలు నిదానంగా తగ్గుతుండటంతో శీతల గిడ్డంగుల్లో నిల్వ చేసుకున్నారు. గత నాలుగు నెలల నుంచి మిరపకాయ ఎగుమతీ ఆగింది. ఐనా.. ధరలూ స్థిరంగానే ఉన్నాయి. క్వింటా గరిష్ఠంగా రూ.18 – 22 వేల వరకు ఉంది. ఈ దశలో ప్రస్తుత మిరపకాయ నిల్వ కూడా మన దేశ అవసరాలకు వరకే సరిపోతుందని అంచనా. ఎగుమతులకు అవకాశం వస్తే ఆమాత్రం నిల్వలు కూడా ఉండకపోవచ్చని పేర్కొంటున్నారు. ఈ దశలో ధర పెరిగే అవకాశం ఉందని వ్యాపార వర్గాలూ పేర్కొంటున్నాయి.

నర్సరీలలో లక్షల్లో మిరప మొక్కలు:

ఆంధ్రప్రదేశ్, కర్ణాటక జలాశయాల ఆయకట్టులో పండించే పంటల్లో మిరప వేయొద్దని ఇప్పటికే అక్కడి ప్రభుత్వాలు చెప్పేశాయని శాస్త్రవేత్తలు పేర్కొంటున్నారు. ఆయా రాష్ట్రాలతో పాటు తెలంగాణలోని ఉమ్మడి నల్గొండ జిల్లాలో సుమారు 10 వేల ఎకరాల్లో మిరప వేశారు. వాతావరణం దోబుచులాటతో అంచనా తగ్గింది. ఐనా నర్సరీలలో మాత్రం ఇంకా మిరప మొక్కలు పెంచుతూనే ఉన్నారు.

వాతావరణం అనుకూలిస్తే మంచిరోజులే:నరేష్, ఉద్యానవన శాస్త్రవేత్త, కేవీకేజిల్లాలో ప్రస్తుతం ప్రతికూల వాతావరణమే ఉంది. ఇప్పుడున్న పరిస్థితులను బట్టి మరో రెండు, మూడు వారాలు వానల్లేకుంటే మిరప రైతు ఆశలు ఆవిరైనట్టేనని చెప్పుకోవచ్చు. అనుకూల వాతావరణం ఏర్పడితే మాత్రం ఆశించిన పంట దిగుబడులు పొందే అవకాశం ఉంది. రానున్న రెండు నెలల్లో దేశీయంగా మిరప అధిక వినియోగం ఉండొచ్చు. దీని దృష్ట్యా మిరపకు డిమాండ్ ఉండొచ్చు. ధరలు పెద్ద మొత్తంలో పెరిగే అవకాశం ఉంది.

# బకాయిల భారం

ఖమ్మం : ఉత్తర మండల విద్యుత్తు పంపిణీ సంస్థకు ప్రభుత్వ శాఖల విద్యుత్తు బిల్లుల బకాయిలు భారంగా మారాయి. రోజురోజుకూ భారీగా పేరుకుపోతున్న ఆ సంస్థ కుదేలవుతోంది. బలవంతంగా వసూలు చేయవద్దని ఉన్నతాధికారుల ఆదేశాలతో.. అధికారులకు ఏం చేయాలో పాలుపోవడం లేదు. ప్రజలకు అసౌకర్యం కలగకూడదనే ఉద్దేశంతో కార్యాలయాలకు సరఫరాను నిలిపివేయడం లేదు. దీంతో రావాల్సిన బకాయిలు చేతికి దక్కే పరిస్థితులు కనిపించడం లేదు. కొన్ని కార్యాలయాల్లో..ఖమ్మం జిల్లాలో 2022 జులై చివరి నాటికి ప్రభుత్వ సంస్థలు, శాఖల విద్యుత్తు కనెక్షన్ల బాపతు బకాయి రూ.22.58



కోట్లు ఉంది. 2023 ఆగస్టు చివరి నాటికి ఈ మొత్తం రూ.35.58 కోట్లకు చేరుకుంది. వీటిలో మిషన్ భగీరథతోపాటు, నీటిపారుదల శాఖ, గ్రామీణ నీటి సరఫరా, నగరపాలక సంస్థ, పంచాయతీలు(నీటి పథకాలు), రైల్వేలు, పంచాయతీల వీధి దీపాలు, వైద్యం, విద్య, రభ శాఖ, రెవెన్యూ, పంచాయతీరాజ్, పోలీస్ వంటి వివిధ ప్రభుత్వ సంస్థల బకాయిలు అధికంగా ఉన్నాయి.ప్రభుత్వ శాఖల బకాయిలు భారీగా పేరుకుపోయాయి. వాటి వసూలుకు ప్రయత్నిస్తున్నాం. ప్రజలకు అసౌకర్యం కలగొద్దని సరఫరా నిలిపివేయడం లేదు.శ్రీధర్, సీనియర్ అకౌంట్స్ అధికారి ఎన్పీడీసీఎల్, ఖమ్మం

# ఒక్క అడుగు పరిశుభ్రత వైపు..

ఖమ్మం : 'మన గ్రామంలోని చెత్తా చెదారాన్ని తొలగిద్దాం.. పరిశుభ్రమైన స్వచ్ఛ గ్రామంగా తీర్చిదిద్దుదాం' అనే నినాదంతో స్వచ్ఛ భారత్ మిషన్(గ్రామీణ్), డీఆర్‌డీఏ ఆధ్వర్యంలో జిల్లాలో 'స్వచ్ఛతా హీ సేవా' కార్యక్రమాలను నిర్వహిస్తున్నారు. సెప్టెంబరు 15న ప్రారంభమైన ఈ కార్యక్రమం అక్టోబరు 2 గాంధీ జయంతి వరకు కొనసాగనుంది. ఈ మేరకు జిల్లా అధికారులు ప్రతి గ్రామం స్వచ్ఛ గ్రామంగా రూపుదిద్దుకోవాలని కార్యాచరణ రూపొందిస్తున్నారు. గాంధీ జయంతిని పురస్కరించుకుని 2019లో ప్రధాన మంత్రి నరేంద్రమోదీ 'స్వచ్ఛతా హీ సేవా' కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. గతంలో నిర్వహించిన ఈ కార్యక్రమంతో రాష్ట్రస్థాయిలో, రేగులచెలక, జిల్లాస్థాయిలో కొర్లగూడెం, లక్ష్మీపురం, కిష్టాపురం, దాచపురం, పమ్మి, కూసుమంచి, కుర్నవల్లి, తిరుమలాయపాలెం, మేడిపల్లి, కాకర్లపల్లి, తల్లాడ, కల్లూరు, కొణిజర్ల, బోనకల్లు గ్రామాలు పురస్కారాలు అందుకున్నాయి. ఈ ఏడాది సైతం అదే ఒరవడితో ముందుకెళ్తే మరిన్ని పురస్కారాలు అందుకునే అవకాశం ఉంది.

ప్రతి ఒక్కరూ పాల్గొనేలా..

కార్యక్రమంలో ప్రతి ఒక్కరూ పాల్గొని పరిశుభ్రమైన గ్రామాలుగా తీర్చిదిద్దాలని అధికారులు ప్రజలకు పిలుపునిచ్చారు. యువత, స్వయం సహాయక సంఘాల మహిళలతో అవగాహన కలిగిస్తున్నారు. ఈ ఏడాది జిల్లాలో అన్ని పంచాయతీల్లో స్వచ్ఛ కార్యకలాపాలను నిర్వహిస్తున్నారు.ప్రతి గ్రామ పంచాయతీలో స్వచ్ఛతా ర్యాలీ, స్వచ్ఛ ప్రతిజ్ఞ, మానవహారంతో పాటు మహాశ్రమదానం, వాటర్ బాడీస్ క్లీనింగ్ చెయ్యాలి.

గ్రామ పంచాయతీ అన్ని ముఖ్యమైన ప్రదేశాల్లో పేరుకుపోయిన చెత్తను తొలగించాలి.

ప్రతి గ్రామ పంచాయతీలో యువతను భాగస్వామ్యం చేసి స్వచ్ఛతా రన్ నిర్వహించాలి.



గ్రామంలోని మురుగు కాలువలు శుభ్రం చేయాలి. నీరు నిల్వ ఉన్న ప్రదేశాల్లో ఆయిల్ బాల్స్ వదలాలి.

గ్రామ పంచాయతీ ట్రాక్టరుకు అవసరమైన మరమ్మతులు, శుభ్రపరచడం, రంగులు వేయించాలి.

గ్రామంలోని పాఠశాలలు, అంగన్‌వాడీ కేంద్రాలు, గ్రామ పంచాయతీ కార్యాలయాలు, అన్ని ప్రార్థన మందిరాల పరిసరాల్లో పేరుకుపోయిన చెత్తను తొలగించాలి.

పాఠశాల విద్యార్థులకు తడి, పొడి చెత్త ఇంట్లోనే వేరు చేయడం, ఒకసారి వాడి పడేసే ప్లాస్టిక్‌పై పూర్తి అవగాహన, స్వచ్ఛతా క్విజ్ కార్యక్రమాలు ఏర్పాటు చేయాలి.

పంచాయతీ సిబ్బంది, స్వయం సంఘాల మహిళలు అన్ని గృహాలకు తిరిగి చెత్త కుండీలు వాడేలా, మహిళలు వ్యక్తిగత పరిశుభ్రత, నెలసరి సమయంలో జాగ్రతలు పాటించేలా సూచనలు చేస్తారు.

స్వచ్ఛత ప్రాధాన్యం తెలిపేలా గ్రామాల్లో వాల్ పెయింటింగ్స్ వేయించాలి. అక్టోబరు 2న గ్రామసభ నిర్వహించాలి.

జిల్లాలోని పర్యాటక ప్రదేశాలైన నేలకొండపల్లి, పాలేరు వంటి ప్రదేశాల్లో శుభ్రం చేయడం, చెరువుల దగ్గర ప్లాస్టిక్, ఇతర వ్యర్థాలు తొలగించడం, కూసుమంచి, తీర్థాల, నీలాద్రి ప్రాంతాల్లో శుభ్రం చేయడం వంటి కార్యక్రమాలను స్థానికులు, గ్రామ పంచాయతీ సిబ్బంది, ఎస్‌హెచ్‌జీ మహిళలతో నిర్వహిస్తున్నాం. ముగ్గుల పోటీలు, సఫాయి కార్మికులకు సన్మానం వంటి కార్యక్రమాలను చేపట్టాం. తడి పొడి చెత్త వేరు చేసే షెడ్డును సందర్శించి, సేంద్రియ ఎరువుల తయారీని పరిశీలించనున్నాం.ఎం.విద్యాచందన, డీఆర్‌డీఓ, ఖమ్మం

# అభయారణ్యం విశిష్టతలు అదృశ్యం!




పాల్వంచ : రాష్ట్రంలోని పర్యాటక కేంద్రాల్లో పాల్వంచ మండలంలోని కిన్నెరసానికి ప్రత్యేక స్థానం ఉంది. కరోనా ప్రభావం నుంచి తేరుకున్నాక ఇక్కడకు వచ్చే సందర్శకుల్లో ప్రముఖులు, శిక్షణ అధికారులు, ఉన్నతాధికారులు ఎక్కువగా ఉండటం విశేషం. సెలవు దినాల్లో సుమారు 800 మంది వరకు తరలివస్తుంటారు. ప్రకృతి అందాలు, జలాశయం మధ్య పచ్చని కొండలు, బోటింగ్, జింకల పార్కు మొదలైనవి ఎక్కువగా ఆకర్షిస్తున్నాయి. విద్యార్థులు, ప్రకృతి ప్రేమికులను ఆకట్టుకోవడంలో పర్యావరణ విద్యా కేంద్రం (ఈఈసీ) ముందుంటుంది. ఇది.. కిన్నెరసాని అభయారణ్యం విశిష్టతలను కళ్లకు కడుతుంది. వన్యప్రాణులు, పక్షులను ప్రత్యక్షంగా చూసినట్లు అనుభూతి కలిగేలా ఈ కేంద్రాన్ని తీర్చిదిద్దారు. కానీ సందర్శకులకు మాత్రం దీన్ని అందుబాటులో ఉంచడం లేదన్న విమర్శలు వినిపిస్తున్నాయి.

సందర్శకుల్లో నిరాశ

కిన్నెరసానిలో పర్యావరణ విద్యా కేంద్రాన్ని రూ.10 లక్షలతో తీర్చిదిద్దారు. డిసెంబరు 26, 2017న ప్రారంభించారు. స్థానిక అభయారణ్యంలో కనిపించే వన్యప్రాణులు, అడవి విశిష్టతలపై బొమ్మలు, చిత్రపటాలు ఏర్పాటు చేశారు. సీడీల రూపంలో వివరాలు ప్రదర్శించేందుకు గదిలో ఏర్పాట్లు కూడా చేశారు. కానీ ఎవరైనా అధికారిక సందర్శనలు చేపట్టిన సమయంలోనే ఈ కేంద్రం తెరుచుకుంటోంది. ఆ తర్వాత తాళాలు పడుతున్నాయి. అభయారణ్య విశిష్టతలు తెలుసుకునేందుకు పర్యాటకులు, విద్యార్థుల్లో ఉత్సాహం ఉన్నా స్థానిక అధికారులు అభ్యంతరం వ్యక్తం చేస్తున్నారు. దీంతో నిరాశతో వెనుదిరగాల్సి వస్తోంది. సందర్శనలో పర్యావరణ విద్యా కేంద్రం ఓ భాగం. దానికీ టిక్కెట్ వసూలు చేస్తున్నారు. కానీ లోపలకు మాత్రం అనుమతించడం లేదు. దీనిపై తరచూ పర్యాటకులు అధికారులను ప్రశ్నిస్తున్నా పట్టించుకోవడం లేదు. దూర ప్రాంతాల నుంచి విహారయాత్రకు, క్షేత్రస్థాయి అధ్యయనాలకు వచ్చే విద్యార్థులు అభయారణ్యం విశేషాలు తెలుసుకునేందుకు ఉత్సాహం చూపుతున్నారు. కానీ కేంద్రానికి తాళాలు వేసి కనిపిస్తుండటంపై పెదవి విరుస్తున్నారు.

రేంజర్ శ్రీనివాసరావును వివరణ కోరగా పర్యావరణ విద్యా కేంద్రాన్ని సందర్శకులకు అందుబాటులో ఉంచుతున్నట్లు చెప్పారు. ఎవరైనా లోపలకు వెళ్లాలని చెబితే అనుమతిస్తున్నామన్నారు. ఏమైనా సమస్యలుంటే మా దృష్టికి తీసుకురావచ్చు.

# పర్యావరణ హిత వేడుక.. బర్తన్ బ్యాంక్ కానుక



పాల్వంచ :ఒకసారి వాడి పడేసే(సింగిల్ యూజ్) ప్లాస్టిక్‌ను కేంద్ర ప్రభుత్వం దేశవ్యాప్తంగా నిషేధించింది. దీన్ని కఠినంగా అమలు చేయాలని రాష్ట్ర ప్రభుత్వాలను ఆదేశించింది. ఈ నేపథ్యంలో తెలంగాణ సర్కారు రాష్ట్రంలోని బల్దియాల్లో ప్లాస్టిక్ వినియోగాన్ని పూర్తిగా తగ్గించే లక్ష్యంతో వినూత్న కార్యక్రమానికి రూపకల్పన చేసింది. అదే.. 'బర్తన్(వంట పాత్రలు) బ్యాంక్'

వివాహాలు, శుభకార్యాలు, విందుల్లో విరివిగా వాడిపారేసే ప్లాస్టిక్ పేపర్లు, ప్లేట్లు, గ్లాసులు, కప్పులకు పురపాలకాలు ప్రత్యామ్నాయం చూపుతాయి. వాటి స్థానంలో స్టీల్ సామగ్రిని అతి తక్కువ ధరతో ప్రజలకు అద్దెకు అందుబాటులోకి తేనున్నాయి. పట్టణ సమాఖ్యల ద్వారా వంట పాత్రల నిధి(బర్తన్ బ్యాంక్)లు ఏర్పాటు చేస్తున్నాయి. 'మెప్మా' ఆధ్వర్యంలో ప్రయోగాత్మకంగా తొలుత జిల్లాకు ఒక 'బర్తన్ బ్యాంక్' నెలకొల్పాలని ఆ సంస్థ డైరెక్టర్ ఆదేశాలు జారీ చేశారు. ఉభయ జిల్లాల్లో కార్యక్రమానికి వెంటనే శ్రీకారం చుట్టారు. మూడు చోట్ల స్టీల్ బ్యాంక్‌లు ప్రారంభించారు. తర్వాత అన్ని చోట్ల ప్రారంభించేలా కార్యాచరణ రూపొందించుకోవాలని కమిషనర్లకు ఆదేశాలు అందాయి. వారు మెప్మా సీఓలు, ఆర్పీలు, సంఘాల మహిళలకు అవగాహన కల్పిస్తున్నారు. ప్లాస్టిక్ వాడకాన్ని తగ్గించి 'స్వచ్ఛ సర్వేక్షణ్'లో ముందడుగు వేయడానికీ, మెప్మా సభ్యురాళ్లకు ఉపాధి కల్పించాలనే సదుద్దేశంతో వినూత్న కార్యక్రమం చేపడుతున్నట్లు ఆ శాఖ చెబుతోంది.

ఇవీ విశేషాలు..

ఖమ్మం నగరపాలకం, నగరంలోని రంగనాయకులగుట్ట రెండు చోట్ల, భద్రాద్రి జిల్లాలోని పాల్వంచ పురపాలకంలో బర్తన్ బ్యాంక్‌లు ఇప్పటికే ప్రారంభించారు.

500 మంది సామర్థ్యంతో జరుపుకొనే వేడుకకు సరిపడా రూ.1.60 లక్షలతో స్టీల్ సామగ్రి ఇక్కడ అందుబాటులో ఉంది. త్వరలో షామియానాలు, కుర్చీలనూ సమకూర్చనున్నట్లు అధికారులు తెలిపారు.

ఇక్కడ భోజనం, టిఫిన్ ప్లేట్లు, తాగునీరు, టీ గ్లాసులు, స్టీల్ ట్రేలు (పెద్దవి, చిన్నవి), చెంచాలు, మిఠాయి పళ్లేలు, బేషన్లు, బకెట్లు, లాడిల్స్ (కర్రీ సర్వీసింగ్ స్పూన్) డోంగాలు, భోజనం వడ్డించే గంటెలు, నీటి జగ్గులు, కట్లరి ట్రే, వేస్ట్ టబ్స్, జాలి టబ్స్ (రైస్ కడిగేవి), 10, 20, 40 కిలోల వంట గిన్నెలు సహా మొత్తం 18 రకాల సామగ్రి అందుబాటులో ఉంటాయి.

నిర్వహణ బాధ్యతను స్లమ్ లెవల్ ఫెడరేషన్(ఎస్ఎల్ఎఫ్), టౌన్ లెవల్ ఫెడరేషన్(టీఎల్ఎఫ్)లకు అప్పగిస్తున్నారు.

బయట షామియానా వ్యాపారులతో పోల్చి చూస్తే తక్కువ ధరలు వసూలు చేస్తారు. తద్వారా వేడుకల నిర్వాహకులపైనా భారం తగ్గుతుంది.మహిళా సమాఖ్యల ఆర్థిక బలోపేతానికి బర్తన్ బ్యాంక్‌లు దోహదపడతాయి.

స్టీల్ సామగ్రి వినియోగం ద్వారా ప్లాస్టిక్‌ను ఎలా తుదముట్టించ వచ్చో సమాఖ్యలు ప్రజలకు అవగాహన కల్పిస్తాయి.

ప్లాస్టిక్ నిర్మూలనే లక్ష్యంప్లాస్టిక్ వినియోగాన్ని సాధ్యమైనంత తగ్గించి.. స్వచ్ఛ పురపాలకాలుగా మార్చే క్రమంలో 'బర్తన్ బ్యాంక్'ల ఏర్పాటుకు మరింత ప్రాధాన్యం ఇస్తున్నాం. శుభకార్యాలు, ఇతర అన్ని వేడుకలకు స్టీల్ సామగ్రిని తక్కువ అద్దెపై వినియోగించుకోవాలని ప్రజలను కోరుతున్నారు. ఈ మేరకు సమాఖ్యల ద్వారా విస్తృత ప్రచారం కూడా చేస్తాం. ఎవరైనా ఈ సదుపాయాన్ని వినియోగించుకోవచ్చు.

ఎ.స్వామి, పాల్వంచ పురపాలక కమిషనర్

# గురుకులాల్లో.. వసతి అధోగతి

ఖమ్మం : పేద విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించే లక్ష్యంతో ప్రభుత్వం గురుకులాలను ప్రతిష్ఠాత్మకంగా ప్రారంభించింది. దాదాపు అన్ని మండలాల్లోనూ వీటిని నెలకొల్పారు. కానీ చాలా వరకు సమస్యలకు నిలయాలుగా మారాయి. కార్పొరేట్‌కు దీటుగా విద్య అంటూ రూ.కోట్లు విడుదల చేస్తున్నా.. బోధన ఫర్వాలేదనిపిస్తున్నా.. వేధించే సమస్యలు మాత్రం వెక్కిరిస్తున్నాయి. అరకొర వసతుల నడుమ చదువు కొనసాగించే పరిస్థితి విద్యార్థులది. చాలాచోట్ల మెనూ సక్రమంగా అమలుకావడం లేదు. దాదాపు అన్నింటా తరగతి గదులే వసతి కేంద్రాలయ్యాయి. వసతి గృహాలున్నా పర్యవేక్షణ లోపం వల్ల అక్కడి పరిస్థితి మరీ దయనీయంగా ఉంది. అద్దె భవనాల్లో సమస్యలు నిత్యకృత్యమయ్యాయి. సొంత భవనాలు సమకూర్చి సౌకర్యాలు కల్పించాలన్నది విద్యార్థులు, తల్లిదండ్రుల నివేదన.సమస్యలతో సహవాసం ఉమ్మడి జిల్లాలోని బీసీ, ఎస్సీ, ఎస్టీ గురుకులాల్లో బోధన పరంగా చూస్తే ప్రభుత్వం ఎక్కడా రాజీ పడటం లేదు. బోధన, బోధనేతర సిబ్బంది భర్తీకి నియామకాలు చేపట్టడంతో చాలా సమస్యలు తొలగాయి. విద్యాలయాలు, వసతి గృహాల్లో ఎదురయ్యే సమస్యలే బాధ కలిగిస్తున్నాయి. ఏటా విద్యార్థుల సంఖ్య గణనీయంగా పెరుగుతోంది. కొన్ని కళాశాలలుగా అప్‌గ్రేడ్ అవుతున్నాయి. తదనుగుణంగా మాత్రం వసతులు కల్పించడం లేదు. దీంతో బాలబాలికలకు ఇబ్బందులు తప్పడం లేదు. 2017 నుంచి అన్నివర్గాల వారికి గురుకులాలు అందుబాటులోకి వచ్చాయి. కానీ పక్కా భవనాలు నిర్మించలేదు. ఆరు తరగతులకు మొత్తం 480 మంది వరకు విద్యార్థులు ఉంటుండగా.. తగిన తరగతి గదులు, వసతి భవనాలు లేవు. చాలాచోట్ల తరగతుల నిర్వహణ, వసతికి ఒకే గదులు వినియోగించాల్సి వస్తోంది. ప్రయోగశాలల కొరత తీవ్రంగా ఉంది. భోజనశాలలు కిక్కిరిసిపోతున్నాయి. మరుగుదొడ్ల కొరతతో ఉగ్గబట్టుకోవాల్సిన దుస్థితి. ఏటా అద్దె భవనాలకు మారాల్సి రావడం శాపంగా మారింది. గురుకులం ఒకచోట మంజూరైతే.. భవనాల్లేక నియోజకవర్గాలు మార్చి మరీ నిర్వహిస్తున్న వైనం నెలకొంది.

రఘునాథపాలెం బీసీ గురుకులంలోని విద్యార్థుల సంఖ్య.. 392. ఇక్కడ వసతి గృహం లేదు. తరగతి గదులే వసతి కేంద్రాలుగా మారాయి. మరుగుదొడ్లూ సరిపడా లేవు. పరిసరాల్లో అపరిశుభ్రత సరేసరి. భోజనంలో సమయపాలన పాటించడం లేదని విద్యార్థులు వాపోతున్నారు. సమస్యలపై ప్రశ్నించిన వారిని వేరే గురుకులాలకు బదిలీ చేయడం వివాదాస్పదమైంది.

ఏన్కూరు మండలం కేంద్రంలోని తెలంగాణ గురుకుల విద్యాలయ వసతి గృహం శిథిలావస్థకు చేరింది. 150 మందితో ప్రారంభమైన విద్యాలయంలో ప్రస్తుతం పాఠశాల, కళాశాలలో కలిపి 650 మంది ఉంటున్నారు. వీరికి సరిపడా వసతి గదులు, మరుగుదొడ్లు, భోజనశాల లేవు. ప్రహరీ లేకపోవడం మరో ప్రధాన సమస్య. గతంలో ఇద్దరు విద్యార్థులు చెరువు వద్దకు బహిర్భూమికి వెళ్లి మృత్యువాతపడ్డారు.

నేను మధిర మండలంలోని కృష్ణాపురం గురుకులంలో ఇంటర్ రెండో సంవత్సరం చదువుతున్నాను. ఈ గురుకులంలో మొత్తం 600 మంది విద్యార్థులు చదువుకుంటున్నారు. ఇక్కడ 50 మాత్రమే మరుగుదొడ్లు ఉన్నాయి. దీనివల్ల రోజూ ఉదయం పూట ఇబ్బందులు పడుతున్నాం. వసతిగృహంలో మంచాలు లేకపోవడం వల్ల కింద పడుకుంటున్నాం.చైతన్య, ఇంటర్ ద్వితీయ, కృష్ణాపురం గురుకులం, మధిర మండలం

'నేను ఏడోతరగతి చదువుతున్నాను. గురుకులంలో భోజనశాల లేదు. ఆరుబయట కూర్చొని భోజనం చేస్తున్నాం. చుట్టూ ప్రహరీ లేకపోవడం వల్ల పశువులు, కుక్కలు, కోతుల బెడద ఉంది. వసతి గృహంలో గదులు సరిపడా లేవు. రాత్రి వేళల్లో తరగతి గదుల్లోనే నిద్రిస్తున్నాం.జగదీశ్ రామ్, తెలంగాణ గురుకులం, ఏన్కూరు

# పేరు ఘనం.. తీరు అధ్వానం!

భూపాలపల్లి : క్రీడల్లో యువతను ప్రోత్సహించే దిశగా రాష్ట్ర ప్రభుత్వం ప్రతి పంచాయతీ, ఆవాస గ్రామాల్లో క్రీడా ప్రాంగణాలు ఏర్పాటు చేసింది. ఇంతవరకు బాగానే ఉన్నా ఏ ఒక్క చోట ఆటలు ఆడుకునేందుకు వీలుగా లేవు. ప్రభుత్వ ఆదేశాలు, అధికారుల ఒత్తిడితో గ్రామ పంచాయతీ పాలకవర్గాలు ఎక్కడపడితే అక్కడా క్రీడా ప్రాంగణాల బోర్డులను ఏర్పాటు చేసి చేతులు దులుపుకొన్నారు. చెరువు గట్లు, కస్తూర్బా, ప్రభుత్వ పాఠశాలలు, ఊరికి దూరంగా ఇలా ఎక్కడ పడితే అక్కడ క్రీడా ఏర్పాటు చేయడంతో యువతకు, క్రీడాకారులకు ఎందుకూ పనికి రాకుండా దర్శనమిస్తున్నాయి. జిల్లా వ్యాప్తంగా 342 క్రీడా ప్రాంగణాలను ఏర్పాటు చేశారు. వీటిలో చాలా వరకు ఎందుకు పనికిరాకుండా ఉన్నాయి. అధికారులు, ప్రజాప్రతినిధుల నిర్లక్ష్యంతో క్రీడా ప్రాంగణాల్లో పిచ్చి మొక్కలు దర్శనమిస్తున్నాయి. క్రీడా ప్రాంగణం బోర్డు, ఒక డబుల్ బార్‌ను ఏర్పాటు చేసి వదిలేశారు. ఎలాంటి సౌకర్యాలు లేకుండా ఏర్పాటు చేసిన క్రీడా ప్రాంగణాల్లో తాము ఎలా సాధన చేయాలని గ్రామీణ యువత నిరాశ చెందుతున్నారు.

క్రీడా ప్రాంగణాలకు సంబంధించి క్రీడాకారులకు ఉపయోగపడేలా రాష్ట్ర ప్రభుత్వం కిట్లను పంపిణీ చేసింది. ఒక్కో కిట్‌లో క్రికెట్ బ్యాట్, బ్యాటింగ్, కీపింగ్ గ్లౌజులు, బ్యాటింగ్ ప్యాడ్లు, బంతులు, నాలుగు వాలీబాల్స్, రెండు నెట్లు, సైకిల్ పంపు, డంబెల్స్, డిస్కస్‌త్రో, టెన్నికాయిట్ రింగ్స్, స్కిప్పింగ్ తాళ్లు, తదితర వాటితో కలిపి ఒక కిట్‌గా ఏర్పాటు చేసి గ్రామాలకు పంపిణీ చేయాల్సి ఉంటుంది. అందుకు సంబంధించి జిల్లా వ్యాప్తంగా 354 కిట్లను మున్సిపాలిటీ, మండల పరిషత్ కార్యాలయాల్లో నిల్వ చేసి త్వరలో పంపిణీ చేసేందుకు చర్యలు తీసుకుంటున్నారు. ఇది కాటారం మండలం అంకుషాపూర్



గ్రామ పంచాయతీలోని క్రీడా ప్రాంగణం.. గ్రామానికి దూరంగా నిర్మించడంతో అక్కడకు వెళ్లడానికి ఎవరూ సాహసించడం లేదు. సమీపంలోనే ఒర్రె ఉండటంతో వరదకు ప్రాంగణంలోని మట్టి కోతకు గురైంది.చిట్యాల మండలంలోని ఏలేటి రామయ్యపల్లిలో ప్రభుత్వ స్థలం లేకపోవడంతో చెరువు కట్టపై ప్రాంగణాన్ని ఏర్పాటు చేశారు. ఎలాంటి క్రీడా పరికరాలు లేకపోవడం, స్థలం కొంచమే ఉండటంతో యువత ఇబ్బందులు పడుతున్నారు.ఇక్కడ కస్తూర్బా గాంధీ పాఠశాలలో కనిపిస్తున్న క్రీడా ప్రాంగణం పలిమెల మండలం పంకెన గ్రామ పంచాయతీలో ఏర్పాటు చేశారు. పాఠశాలలో బాలికలు చదువుకుంటారు. అక్కడకు వెళ్లి యువకులు క్రీడలు ఆడటం జరిగేపని కాదు. దీంతో కేవలం బోర్డుకే పరిమితమైంది.

ఈ చిత్రంలో మొక్కల పెంపకం చేపట్టిన ప్రదేశం క్రీడా ప్రాంగణమే.. ఇది మహాముత్తారం మండలం కొర్లకుంట గ్రామ పంచాయతీ పరిధిలోనిది. మొక్కలు తొలగించాలని గతంలో పంచాయతీ కార్యదర్శికి విన్నవించినా ఫలితం లేదని యువత అంటున్నారు.

ఆటలకు అనువుగా ఉండాలి.. పానెం బాలు, పంకెన పలిమెల మండలం

గ్రామీణ యువతకు క్రీడా ప్రాంగణాలు ఏర్పాటు చేయాలనే ప్రభుత్వ నిర్ణయం బాగానే ఉన్నా.. క్షేత్ర స్థాయిలో పరిస్థితి భిన్నంగా ఉంది. పంకెన గ్రామంలో ఏర్పాటు చేసిన క్రీడా ప్రాంగణం కస్తూర్బా పాఠశాలలో ఉండటంతో అక్కడకు వెళ్లి ఆడుకునే పరిస్థితి లేదు. అక్కడి నుంచి వేరే చోటుకు క్రీడా ప్రాంగణం మారిస్తే అందరికీ అందుబాటులో ఉంటుంది.

స్థలాల కొరతతోనే..పురుషోత్తం, జిల్లా గ్రామీణాభివృద్ధి శాఖ అధికారి

గ్రామీణ ప్రాంతాల్లో స్థలాల కొరతతో ఉన్న స్థలంలో ఏర్పాటు చేశాం.. పాఠశాలలో ఏర్పాటు చేసిన క్రీడా ప్రాంగణాల ద్వారా విద్యార్థులు కూడా ఆటలకు వినియోగించుకునే అవకాశం ఉంటుంది. అలాగే దాతలు ముందుకొచ్చి భూమి అందించేలా చూడటంతో పాటు, ఎవరైనా భూమి విక్రయించడానికి సిద్ధంగా ఉంటే కొనుగోలు చేసేలా గ్రామాల్లో చర్యలు తీసుకుంటున్నాం.

# అసైన్డ్ భూముల రైతులకు నిరాశే..

భూపాలపల్లి: పంటల సాగు నమ్ముకొని జీవించే అసైన్డ్ భూముల రైతులకు వానకాలం సీజన్‌లో పంట రుణాలు అందక తిప్పలు పడుతున్నారు. వానాకాలం సీజన్‌లో పంట సాగు చేసుకొని, పెట్టుబడికి అవసరమని బ్యాంకు రుణాల కోసం వెళ్తే.. అందడం లేదు. ఇప్పటికే పత్తి, మిర్చి పంటల ఎదుగుదల మొదలై ఇటీవల కురుస్తున్న వర్షాలకు అన్నదాతల్లో ఆశలు చిగురిస్తున్నాయి. వర్షాలతో పత్తి రైతులు ఎరువులు చల్లుకునేందుకు సిద్ధమవుతుండగా బ్యాంకు అధికారుల తీరు గుబులు కలిగిస్తోంది. ఒకవైపు అప్పు కింద ఎరువులు తెచ్చుకునేందుకు వ్యాపారులను ఆశ్రయిస్తే బస్తాకు అదనంగా రూ.30 నుంచి రూ.50 వసూలు చేయడమే కాకుండా అప్పు తిరిగి చెల్లించే వరకు వడ్డీ వసూలు చేస్తున్నారు. దీంతో రైతులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ధరణిలో భూ వివరాలు చూపించడం లేదని.. అందుకే రుణాలు ఇవ్వడం లేదని బ్యాంకర్లు చెబుతున్నారు. భూపాలపల్లి జిల్లాలోని 11 మండలాల్లో 70,298 ఎకరాల వరకు అసైన్డ్ భూములున్నాయి. ఈ భూములకు ప్రభుత్వం చెల్లించే రైతు బంధు, రైతు బీమా పథకాలు అందడం లేదు. దీంతో సాగుదారులు తీవ్రంగా నష్టాల పాలవుతున్నారు.గతంలో ఇచ్చినా..అసైన్డ్ భూముల రైతులకు ఇదివరకు పంట రుణాలు ఇచ్చినప్పటికీ ఇప్పుడు కుదరదని అధికారులు తెగేసి చెబుతున్నారని సాగుదారులు ఆందోళన చెందుతున్నారు. 2018 వరకు రుణాలు తీసుకున్న అన్నదాతలకు ఇటీవలే ప్రభుత్వం విడుదల చేసిన రుణమాఫీ పొందిన వారికి సైతం రెన్యువల్ చేయడం లేదని వాపోతున్నారు. రుణమాఫీ కింద జమైన నగదు చెల్లించుకుని, కొత్తగా అసైన్డ్ భూములకు రుణాలు ఇవ్వడం లేదని పలువురు రైతులు తెలిపారు. అసైన్డ్ భూముల వివరాలను ప్రభుత్వం బ్యాంకులకు ఇచ్చిన ధరణి వివరాల నివేదికలో నమోదు చేయకపోవడంతో.. తమ లాగిన్‌లో భూ వివరాలు కనిపించడం లేదని, పాసు పుస్తకాలు ఉన్నప్పటికీ ఆన్‌లైన్‌లో వివరాలు రాకపోవడంతో రుణాలు అందించే పరిస్థితులు లేవని కొందరు బ్యాంకు అధికారులు చెబుతున్నారు. ధరణి రికార్డులు లేని సమయంలో పహణీ చూపించి, రుణాలు పొందామని, ధరణి కారణంగా రుణాలు పొందలేక పోతున్నామని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

రైతులను ఆదుకోవాలి.. పోషమల్లు, రాంపూర్

ఉన్న రెండు ఎకరాల అసైన్డ్ భూమిలో పత్తి సాగు చేశాను. ఇటీవల కురిసిన వర్షాలతో ఎరువులు చల్లుకునేందుకు నగదు లేక రుణాల కోసం బ్యాంకు అధికారులను ఆశ్రయిస్తే ఇవ్వడం లేదు. భూ వివరాలు ధరణిలో కనిపించడం లేదని చెబుతున్నారు. తమకు ప్రభుత్వం అందించిన నూతన పట్టాదారు పాసు పుస్తకాన్ని తీసుకొని వెళ్లినా రుణం మాత్రం మంజూరు చేయడం లేదు. సాగు చేసుకుంటున్న రైతులందరికీ రుణాలు అందించేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలి.

# అంపశయ్యపై క్రీడా శాఖ...!

ఖమ్మం : యువజన క్రీడా శాఖ అద్భుతాలు చేస్తోందనే ప్రచారం ఉంది. సదుపాయాలు మెరుగుపడాలని భావించిన మంత్రి అజయ్‌కుమార్ రూ.వందల కోట్లు గుమ్మరించి రాష్ట్రంలో మరెక్కడా లేని అత్యాధునిక క్రీడా భవనాలు, సదుపాయాలు కల్పించారు. పరిశీలన కోసం వచ్చిన కేంద్ర ప్రభుత్వ క్రీడాధికారులు ఇక్కడి భవనాలను చూసి ఔరా అన్నారు. ఇంతవరకు పరుగులు పెట్టిన ప్రగతి నాణేనికి ఓవైపు అయితే మరోవైపు ఈ సదుపాయాలను సంరక్షించాల్సిన క్రీడాశాఖ అంపశయ్యపై కొట్టుమిట్టాడుతోంది.

**నియామకాలేవి..?**

2016 తర్వాత స్పోర్ట్స్ అథారిటీకి చెందిన ఉద్యోగి జిల్లా క్రీడాశాఖ పగ్గాలు చేపట్టలేదు. దశాబ్దాలుగా నియామకాల్లేవు. సీనియర్ శిక్షకులు, జాతీయ, అంతర్జాతీయ ఫలితాలు సాధించిన శిక్షకులు ఉద్యోగ విరమణ పొందారు. వారి స్థానంలో ఆ స్థాయి శిక్షకులు రాలేదు. ఆ ప్రభావం ఫలితాలపై పడింది. స్పోర్ట్స్ అథారిటీకి చెందిన శిక్షకులు ఖమ్మం జిల్లాలో ఇద్దరే మిగిలారు. అథ్లెటిక్స్, వాలీబాల్ అంశాల్లోనే క్రీడాకారుల భవిష్యత్తుకు ఉపకరించే పతకాలు, ఫలితాలు వస్తున్నాయి. ఒకటి, రెండు క్రీడాంశాలు మినహాయిస్తే ప్రైవేటు టోర్నీల్లో ఫలితాలనే గొప్ప విజయాలుగా చూపే ప్రయత్నాలు జరుగుతున్నాయి.

**ఒకే గొడుగు కిందకు చేర్చటంతో..**

రాష్ట్ర ప్రభుత్వం కొన్ని శాఖలను ఒకే గొడుగు కిందకు చేర్చింది. ఈ పరిణామం స్పోర్ట్స్ అథారిటీ ఉనికికే ప్రమాదం తెచ్చిపెట్టింది. 2016లో మరో శాఖకు చెందిన అధికారిని డీవైఎస్ఓగా నియమించింది. అప్పటివరకు స్పోర్ట్స్ అథారిటీ అధికారులు, శిక్షకుల కనుసన్నల్లో



కొనసాగిన పటేల్ స్టేడియం క్రమంగా ఆ శాఖ చేతుల్లోంచి జారిపోయింది. ఆ తర్వాత నుంచి ప్రైవేటు వ్యక్తులు, వ్యవస్థలు, సంఘాలు స్టేడియంలో తిష్ఠ వేశాయి. దశల వారీగా స్టేడియం ప్రాభవం, ఆదాయం తగ్గి ప్రైవేటు ఆదాయాలు, వారి ప్రతిభాపాటవాలు వెలుగులోకి వచ్చాయి. పరిస్థితిని డీవైఎస్ఓ నియంత్రించలేని దశకు చేరింది. గతంలో ఇద్దరు డీఎస్‌డీఓలు ఆరోపణల ఆధారంగానే బదిలీ అయ్యారు. స్పోర్ట్స్ అథారిటీకి చెందిన సీనియర్ శిక్షకుడు ఉన్నా ఇతర శాఖల్లోని వారిని డీవైఎస్ఓగా ఎంచుకుంటున్న తీరు విమర్శలకు తావిస్తోంది.

ఉద్యోగం ఇక్కడ చేసినా ఎక్కడ చేసినా పారదర్శక విధానాలు అవలంబిస్తాను. డీవైఎస్ఓ ఎవరుండాలని యువజన క్రీడల శాఖ నిర్ణయిస్తే బాగుంటుంది. విధి నిర్వహణలో సొంత నిర్ణయాలు ఎప్పుడూ తీసుకోలేదు. స్టేడియంలో జరిగిన అభివృద్ధి పనుల్లో పాలుపంచుకున్నాననే సంతృప్తి మాత్రం ఉంది.

పరంధామరెడ్డి, డీవైఎస్ఓ

**ప్రక్షాళన చేయాల్సిందే..**

స్టేడియంలో ఏ క్రీడా ప్రాంగణం ఏ ప్రాతిపదికన ప్రైవేటు సంఘాలకు అప్పగించారు. అక్కడ పిల్లల నుంచి సేకరిస్తున్న ఫీజులు కార్యాలయం వరకు వస్తున్నాయా, ఫలితాలెలా ఉన్నాయి. కొందరికి అద్దెప్రాతిపదికన, మరికొందరికి ఉచితంగా, ఇంకొందరికి ప్లే అండ్ ప్లే పద్ధతిలో ప్రాంగణాలు ఎలా కేటాయించారనే ప్రశ్నలు తలెత్తుతున్నాయి. ఇదిలా ఉంటే తమకెందుకు ఇవ్వరనే క్రీడా సంఘాలకు జవాబు చెప్పుకోలేని పరిస్థితిలో అధికారులు ఉంటున్నారు. ఉదారభావంతో తీసుకున్న నిర్ణయాలే ప్రమాదంగా పరిణమించాయి.

**జోరుగా చర్చ..**ఆర్నెళ్లుగా భద్రాద్రి జిల్లాలో పనిచేస్తున్న కొందరు అధికారులు ఖమ్మం వచ్చేందుకు ప్రయత్నాలు ముమ్మరం చేశారు. ఈ క్రమంలో డీవైఎస్ఓ పోస్టుపై వారి దృష్టి పడింది. తీవ్రంగా యత్నించినా ఉన్నతాధికారులు అంగీకరించలేదు. సర్దార్ పటేల్ స్టేడియంలో తిష్ఠ వేసిన ప్రైవేటు శక్తులు ఓ ఉద్యోగ సంఘం నాయకుడి సహకారంతో డీవైఎస్ఓను బదిలీ చేయించేందుకు యత్నించాయి. రెవెన్యూశాఖ నుంచి ఎన్‌ఓసీ పొంది యువజన క్రీడాశాఖ అనుమతి కోసం ఎదురు చూస్తున్న సునీల్‌కుమార్‌కు ఉభయ జిల్లాల్లో రెవెన్యూశాఖ, క్రీడారంగంలో వివాద రహితుడిగా పేరుంది. ఆయన బాధ్యతలు తీసుకున్న తర్వాత స్టేడియంలో నిర్ణయాత్మక శక్తులుగా ఎదిగిన ప్రైవేటు వ్యవస్థలతో ఎంతకాలం మనగలుగుతారనే చర్చ ఇప్పుడు జోరుగా సాగుతోంది.

# నైపుణ్య శిక్షణ.. ఉపాధికి నిచ్చెన

నల్గొండ : ప్రస్తుత పోటీ ప్రపంచంలో నైపుణ్యానికే ప్రాధాన్యం. ఉద్యోగ సాధనలో వెనుకబడితే ఎంత చదివినా ప్రయోజనం ఉండదు. జీవనోపాధికి ఉద్యోగం సాధించలేకపోతే.. స్వయం ఉపాధి రంగాన్నైనా ఎంచుకోవాలి. అవకాశాలు దక్కించుకోవాలంటే నైపుణ్యాభివృద్ధికి శిక్షణ తీసుకోవడం తప్పనిసరి. యువత ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కోవద్దనే ఉద్దేశంతో ప్రభుత్వం గ్రామీణ ప్రాంతాల్లో న్యాక్ (నేషనల్ అకాడమీ ఆఫ్ కన్‌స్ట్రక్షన్) ద్వారా ఉచిత శిక్షణ కేంద్రాలు మరిన్ని ఏర్పాటు చేసేందుకు కార్యాచరణ రూపొందించింది.

**ఇప్పటికే 3 వేల మందికి పైగా..**

ఉమ్మడి నల్గొండ జిల్లాలో గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో ఇప్పటికే న్యాక్ ఆధ్వర్యంలో 3 వేల మందికి శిక్షణ ఇచ్చారు. మహిళలకు కుట్టు, పురుషులకు భవన నిర్మాణ పనుల్లో నైపుణ్యాల పెంపునకు సంబంధించి కార్యక్రమాలు నిర్వహించారు. నల్గొండ జిల్లాలో నల్గొండ, మిర్యాలగూడ, ఈదులూరులో శిబిరాలు ఏర్పాటు చేసి శిక్షణ ఇచ్చారు. సూర్యాపేట జిల్లాలో హుజూర్‌నగర్, మఠంపల్లి, మునగాల... యాదాద్రిలో కక్కిరేణి, ఎస్.లింగోటం, మన్నారంలో శిక్షణలు పూర్తి చేశారు. గ్రామాలకు వచ్చి తర్ఫీదు ఇస్తుండటంతో ఎక్కువ మంది ఆసక్తి చూపుతున్నారు.

**గ్రామాల్లో వివరాల సేకరణ..**

కనీసం 30 మంది కార్మిక శాఖ గుర్తింపు కార్డులు కలిగి ఉన్న గ్రామాల్లోనే నైపుణ్య శిబిరాలు ఏర్పాటు చేస్తున్నారు. ఆసక్తి ఉన్న వారి వివరాలు సేకరిస్తున్నారు. దారిద్ర్య రేఖకు దిగువన ఉన్న కుటుంబాలకు చెందిన వారికి మాత్రమే అవకాశం కల్పిస్తున్నారు. కోర్సును బట్టి కనిష్ఠంగా 15 రోజులు..గరిష్ఠంగా మూడు నెలలు శిక్షణ ఇస్తున్నారు. ఈ కాలంలో భవన నిర్మాణంలో పనుల్లో శిక్షణ తీసుకునే వారికి రోజుకు రూ.300 ఇస్తారు. కుట్టు శిక్షణ తీసుకునే మహిళలకు 80 శాతం హాజరు ఉంటే ఉచితంగా కుట్టు మిషను ఇస్తారు. పూర్తి కాగానే స్వయం ఉపాధి యూనిట్లు నెలకొల్పేలా ప్రోత్సహిస్తున్నారు. ప్రైవేటు సంస్థల్లో ఉపాధి అవకాశాలను కల్పిస్తున్నారు. ఈ ఏప్రిల్ నుంచి మరిన్ని గ్రామాల్లో కేంద్రాల ఏర్పాటుకు ఇప్పటి నుంచే కసరత్తు చేస్తున్నారు.

సద్వినియోగం చేసుకోవాలి– సాహెన్ సుల్తానా, న్యాక్ ఉమ్మడి జిల్లా అసిస్టెంట్ డైరెక్టర్, నల్గొండగ్రామీణులకు ఇబ్బందులు కలుగకూడదన్న ఉద్దేశంతో అక్కడికే వెళ్లి శిక్షణ కేంద్రాలు ఏర్పాటు చేస్తున్నాం. పంచాయతీల్లో అందుబాటులో ఉన్న ప్రభుత్వ భవనాలను ఎంపిక చేస్తున్నాం. వచ్చే ఆర్థిక సంవత్సరం మరిన్ని గ్రామాల్లో ఏర్పాటుకు ప్రణాళికలు సిద్ధం చేశాం. ఈ సదుపాయాన్ని పల్లె ప్రజలు సద్వినియోగం చేసుకోవాలి.

# పట్టణ ప్రగతికి అడ్డంకి..!



మణుగూరు : 'పట్టణ ప్రగతి' ప్రారంభమైన తొలి ఏడాది వైరా పురపాలికకు నెలకు రూ.33 లక్షలు అందాయి. రెండో ఏట ఈ మొత్తం రూ.22.20 లక్షలకు కుదించగా ఇప్పుడు రూ.11.25 లక్షలకు పరిమితమైంది. కొత్తగూడెం మున్సిపాలిటీకి ఆరంభంలో నెలకు రూ.70 లక్షలకు పైగా నిధులు జమవగా.. ప్రస్తుతం రూ.26.48 లక్షలకు తగ్గిపోయింది.పురపాలికల స్థితిగతులు మార్చేందుకు ప్రభుత్వం నిర్వహిస్తున్న పట్టణ ప్రగతి కార్యక్రమం లక్ష్యం నీరుగారుతోంది. అభివృద్ధి పనులకు అవసరమయ్యే నిధులను ప్రతినెలా పురపాలికల ఖాతాల్లో సర్కారు జమ చేస్తుంటుంది. అయితే ఐదు నెలలుగా నిధుల జాడ కనిపించకపోవటంతో అభివృద్ధి పనుల్లో వేగం మందగిస్తోంది.

**ఆరంభశూరత్వమేనా..?**

2020 ఫిబ్రవరిలో 'పట్టణ ప్రగతి'ని ప్రభుత్వం ప్రారంభించింది. పారిశుద్ధ్య నిర్వహణ మొదలుకొని మౌలిక వసతుల కల్పన వరకు పట్టణ ప్రగతి నిధులను వినియోగించుకోవచ్చునని సూచించింది. ఏడాది వరకు కార్యక్రమం సజావుగా సాగినా రెండో ఏట నుంచి పురపాలికలకు నిధులు సరిపడా అందటం లేదు. అప్పుడప్పుడు నాలుగైదు నెలలకోసారి నిధులు మంజూరయ్యేవి.

**పారిశుద్ధ్య కార్మికులకు అందని వేతనాలు**

తాగునీరు, పారిశుద్ధ్యం, పురపాలికకు అవసరమైన వాహనాలు, సామగ్రి కొనుగోలు, విద్యుత్తు సంబంధిత ఖర్చులు, అత్యవసర సమయంలో సిబ్బందికి వేతనాలు, హరితహారం, పార్కుల నిర్వహణ తదితరాలకు పట్టణ ప్రగతి నిధులను వినియోగించుకోవచ్చు. ఖమ్మం, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాల్లోని పురపాలికలకు గత ఆగస్టు, సెప్టెంబర్, అక్టోబర్ నిధులను చాలా ఆలస్యంగా జమచేసిన ప్రభుత్వం.. ఆతర్వాత రూపాయి కూడా విడుదల చేయలేదు.ఐదు నెలలుగా నిధులు అందకపోవటంతో పురపాలికల్లో అభివృద్ధి పనులు ఆగిపోయాయి. బిల్లులు అందకపోవటంతో గుత్తేదారులు చేతులెత్తేస్తున్నారు. ఏజెన్సీల ద్వారా నియమితులైన పారిశుద్ధ్యం, ఇతర విభాగాల కార్మికులకూ వేతనాలు అందటం లేదు. పారిశుద్ధ్యం వంటి విభాగాల్లోనూ పురోగతి మందగించింది.

**నిధులు మంజూరైతే..**

అనిత, పుర కమిషనర్, వైరా

వైరా మున్సిపాలిటీకి సంబంధించి ఐదు నెలలుగా పట్టణ ప్రగతి నిధులు జమకాలేదు. అభివృద్ధి పనులకు ఆటంకం ఏర్పడుతోంది. ప్రభుత్వం నిధులు మంజూరు చేస్తే పనుల్లో వేగం పుంజుకుంటుంది.

# అడవికి నిప్పు..మానవాళికి ముప్పు



ఖమ్మం : వేసవి కాలంలో అడవుల్లో తరచూ అగ్నిప్రమాదాలు సంభవించే అవకాశం ఉంది. వీటి నివారణకు అటవీశాఖ జాగ్రత్తలు తీసుకుంటోంది. జిల్లాలో ఖమ్మం, కారేపల్లి, కూసుమంచి, మధిర, సత్తుపల్లి, తల్లాడ ఫారెస్ట్ రేంజిలున్నాయి. కారేపల్లి రేంజి చీమలపాడు, భీమవరం, గౌరారం ప్రాంతాల్లో 50 కి.మీ.లు, గుబ్బగుర్తి ప్రాంతంలో 5 కి.మీ మేరకు, సత్తుపల్లి డివిజన్‌లోని పెనుబల్లి, కనకగిరి అడవుల్లో అగ్నిప్రమాదాల నివారణకు ఫైర్‌లైన్స్‌ను అధికారులు ఏర్పాటు చేస్తున్నారు.కారేపల్లి రేంజిలోని చీమలపాడులోని 2 కి.మీ విస్తీర్ణం.

**అప్పుడప్పుడు ప్రమాదాలు సంభవించే ప్రాంతం**

చీమలపాడు రిజర్వు ఫారెస్టు

**తక్కువ ప్రమాదాలు జరిగే ప్రాంతం**

గుబ్బగుర్తి అటవీ ప్రాంతం

**అడవుల్లో మంటల నివారణకు సూచనలు**

బాటసారులు, పశువులు, గొర్రెల, మేకల కాపలాదారులు అడవుల్లో బీడీలు, చుట్టలు వెలిగించకూడదు.

తేనె, ఇప్ప పువ్వు వంటి కలపేతర అటవీ ఉత్పత్తులు సేకరించే గిరిజనులు లేదా ఇతరులు అడవికి నిప్పు పెట్టకూడదు.

అటవీ పరిసర వ్యవసాయ భూముల్లో వ్యర్థాలను మండించకూడదు.

పోడు వ్యవసాయం కోసం అడవులను నరికి నిప్పు పెట్టకూడదు.

బీడి ఆకు సేకరణకు ముందు చేసే ప్రూనింగ్ కోసం అడవికి నిప్పు పెట్టొద్దు.

అటవీ చట్టం–1967, వన్యప్రాణి సంరక్షణ చట్టం– 1972 ప్రకారం అడవిలో నిప్పు పెట్టడం, పొగతాగటం, చెట్లను నరకటం, వన్యప్రాణులను వేటాడటం నిషిద్ధం. అటవీ సంపదను అక్రమంగా అమ్ముకోవటం, పోడు వ్యవసాయం చేయుటం చట్టరీత్యా నేరం.అడవుల్లో అగ్నిప్రమాదాల నివారణకు అటవీశాఖ ఆధ్వర్యంలో అవగాహన సదస్సులు నిర్వహిస్తున్నాం. గోడపత్రికలు, బ్యానర్లు, సదస్సుల ద్వారా ప్రజలను చైతన్యపరుస్తున్నాం. ఎక్కడ ప్రమాదాలు జరిగినా వెంటనే సమాచారం చేరవేయాలని పశువులు కాపరులు, ఎన్‌జీవోలను కోరుతున్నాం. ఫైర్‌లైన్స్ ఏర్పాటు చేయటంతో పాటు ఫైర్‌ఫైటర్స్‌ను అందుబాటులో ఉంచుతున్నాం.

సిద్ధార్థ విక్రమ్‌సింగ్, డీఎఫ్ఓ

**చెట్టు విలువ తెలుసా..?**

ఏడాదిలో ఒక చెట్టు 12 కిలోల కార్బన్ డయాక్సైడ్‌ను తీసుకుని ఆరుగురు సభ్యులున్న కుటుంబానికి సరిపడా ఆక్సిజన్ అందిస్తుందని అంచనా.

ఒక చెట్టు కూలితే నష్టం రూ.34లక్షలు.

రూ.6.4లక్షల విలువైన మట్టి కొట్టుకుపోకుండా కాపాడుతుంది.

రూ.10.5లక్షల విలువైన చల్లదనాన్నిస్తుంది.

రూ.6.4లక్షల విలువైన భూసారాన్ని అందిస్తుంది.

రూ.5.5లక్షల విలువైన గూడు, నీడ అందిస్తుంది.

పూలు, పండ్లు, తేనె, ఆహ్లాదం అదనం.

# పని చేస్తేనే కూలి

ఖమ్మం : గ్రామీణ పేదలకు పని కల్పించేందుకు ఉపాధి హామీ పథకాన్ని కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తోంది. పనికి వచ్చే కూలీకి రోజువారీ గరిష్ఠ వేతనంగా రూ.257ను నిర్ణయించింది. వారు చేసిన పని కొలత ప్రకారం ఈ వేతనం అందిస్తారు. కానీ గరిష్ఠ వేతనం పూర్తిస్థాయిలో కూలీలకు అందడం లేదు. దీన్ని నివారించి కూలీలకు మేలు చేయడంతోపాటు, మెటీరియల్ కాంపోనెంట్ నిధులు అధికంగా వచ్చేలా చూడాలని ప్రభుత్వం నిబంధనలను కఠినతరం చేసింది.జిల్లాలో ప్రస్తుతం 3,03,649 ఉపాధి హామీ పథకం జాబ్ కార్డులున్నాయి. వీటిలో 6,44,652 మంది కూలీలుగా నమోదై ఉన్నారు. ప్రస్తుతం 1,90,913 యాక్టివ్ జాబ్‌కార్డుల్లో 3,21,199 మంది కూలీలున్నారు. 1,41.987 జాబ్‌కార్డుల్లోని 2,30,280 మంది కూలీలు ఉపాధి పనులకు హాజరవుతున్నారు.

**రూ.140 మాత్రమే...**

2022–23 ఆర్థిక సంవత్సరంలో జిల్లాలో 81.16 లక్షల పనిదినాలు కల్పించాలని లక్ష్యంగా పెట్టుకున్నారు. మార్చి 1వ తేదీ వరకు 53.54 లక్షల పనిదినాలు కల్పించారు. దీంతో రూ.75.09 కోట్లు వేతనంగా అందించారు. అంటే కూలీలకు రోజువారీ సరాసరి కనీస వేతనం రూ.140 మాత్రమే ఉంది. అంటే గరిష్ఠ వేతనంలో సగానికి కొద్దిగా ఎక్కువ ఉంది. మరికొద్ది రోజుల్లో ఈ వార్షిక సంవత్సరం పూర్తవుతుంది. ప్రస్తుతం రూ.140 ఉన్న రోజువారీ కనీస వేతనాన్ని రూ.257 లకు చేర్చాలంటే భారీగా కసరత్తు చేయాలి. 2023–24లో ప్రభుత్వం ఆశించిన మేర కూలీలకు పని కల్పించి చేయించగలిగితే కొంత మేర సత్ఫలితం ఉంటుంది. ప్రభుత్వం ఆశిస్తున్నట్లు పని చేస్తే 53.54 లక్షల పని దినాలకు గరిష్ఠ వేతనం రూ.257 అందేలా పని చేయించగలిగితే రూ.137 కోట్లకుపైగా కూలీలకు వేతనంగా అందుతుంది.

**రెండు ఫొటోలు...**ఉపాధి పనులకు వచ్చే కూలీల హాజరును ధ్రువీకరిస్తూ క్షేత్ర సహాయకులు చరవాణి ద్వారా రోజుకు రెండు ఫొటోలను పని ప్రదేశం నుంచి వెబ్‌సైట్లో అప్‌లోడ్ చేయాలి. ఈ ఏడాది జనవరి నుంచి ఈ నిబంధన అమల్లోకి వచ్చింది. పని ప్రదేశంలో ఉదయం 6 నుంచి 11 గంటల మధ్య, మధ్యాహ్నం 2 నుంచి సాయంత్రం 6 గంటల మధ్య కూలీలు పని చేస్తున్నట్లు ఫొటోలను తీసి నమోదు చేస్తారు. గతంలో ఒక్కటి అప్‌లోడ్ చేస్తే సరిపోయేది. ప్రస్తుత నిబంధన ప్రకారం ఎక్కువ పని జరిగి గరిష్ఠ వేతనం అందుతుందని ప్రభుత్వ ఆలోచన. దానికి అనుగుణంగా మెటీరియల్ కాంపోనెంట్ నిధులు పెరిగే అవకాశం ఉంది.కూలీలతో కొలత ప్రకారం పని చేయిస్తుంటాం. జిల్లా సరాసరి కనీస వేతనం పెరగాలంటే అన్ని మండలాల్లో పని ఎక్కువ జరగాలి. కూలీలు రెండు పూటలా హాజరైతే ఎక్కువ పని జరుగుతుందని ఫొటోలు నమోదు చేసే నిబంధన పెట్టారు. కూలీలకు కూడా మంచిదే.

రామకృష్ణ, ఎంపీడీఓ, రఘునాథపాలెం

# మినీ స్టేడియం నిర్మాణానికి గ్రహణం

వరంగల్ : ములుగు జిల్లా కేంద్రంలో మినీ స్టేడియం నిర్మాణానికి అచ్చి రావడం లేదు. అడుగడుగునా ఆటంకాలే ఎదురవుతున్నాయి. మినీ స్టేడియం నిర్మాణానికి ప్రభుత్వం మంజూరు చేసి 9 సంవత్సరాలు కావస్తోంది. 2014లో అనుమతులు రాగా ఇప్పటి వరకు అది కార్యరూపం దాల్చడం లేదు. అన్ని ఆటంకాలను అధిగమించి సుమారు ఆరు నెలల కింద ఎట్టకేలకు పనులు ప్రారంభమయ్యాయి. కానీ నిధులు లేక సదరు గుత్తేదారు పనులు నిలిపివేశాడు. ఏళ్లు గడుస్తున్నా పనుల్లో పురోగతి లేదు. దీంతో దశాబ్ద కాలానికి చేరువవుతున్నా మినీ స్టేడియంపై జిల్లా యువత పెంచుకున్న కలలు నెరవేరడం లేదు. కల నెరవేరుతుందా లేదా అనే సందేహాలు వ్యక్తమవుతున్నాయి.

**ఆది నుంచీ ఆటంకాలే..**

ములుగు జిల్లా కేంద్రంలో మినీ స్టేడియం నిర్మాణానికి ఆది నుంచీ ఆటంకాలే ఎదురవుతున్నాయి. రాష్ట్ర క్రీడలు, యువజన సర్వీసుల శాఖ ఆధ్వర్యంలో 2014లో మినీ స్టేడియం నిర్మాణానికి ప్రభుత్వం రూ. 2.60 కోట్లతో అనుమతి ఇచ్చింది. ప్రభుత్వ ఉత్తర్వులను ఆధారం చేసుకొని 2014 నుంచి అధికారులు స్థలాన్వేషణ ప్రారంభించారు. తొలుత ములుగు మండలం జాకారం సమీపంలో నిర్మాణానికి ప్రభుత్వ స్థలం కేటాయించారు. జిల్లా కేంద్రానికి స్థలం దూరంగా ఉండడంతో పాటు అక్కడ నెలకొన్న కొన్ని ఆటంకాలతో ఆ స్థలాన్ని రద్దు చేశారు. ఆ తర్వాత కొన్ని సంవత్సరాల తర్వాత ములుగులోని ప్రభుత్వ డిగ్రీ కళాశాల సమీపంలో సుమారు 6 ఎకరాల స్థలం కేటాయించారు. గుత్తేదారు అక్కడికి వెళ్లి పనులు ప్రారంభించే సమయంలోనే అటవీశాఖ



అధికారులు అడ్డుకొని పనులు నిలిపివేశారు. మినీ స్టేడియం నిర్మాణానికి కేటాయించిన స్థలం అటవీశాఖకు చెందినదని కారణాన్ని చూపుతూ గుత్తేదారుకు చెందిన జేసీబీని సీజ్ చేసి అతనికి జరిమానా కూడా విధించారు. అలా కొన్ని సంవత్సరాలు జాప్యం జరిగింది. ఇక లాభం లేదనుకొని సుమారు ఆరు నెలల కింద ములుగు మండలం బండారుపల్లి సమీపంలో ప్రభుత్వ స్థలాన్ని గుర్తించి స్టేడియం నిర్మాణానికి కేటాయించారు. అధికారుల ఆదేశాల మేరకు గుత్తేదారు పనులు ప్రారంభించారు. పునాదుల దశ నుంచి పిల్లర్లు నిర్మాణం ప్రారంభానికి ముందు చేసిన పనికి డబ్బులు చెల్లించడం లేదనే కారణంగా గుత్తేదారు పనులు నిలపివేశారు. పనులు నిలిచిపోయి సుమారు రెండు నెలలు కావస్తోంది. పనులు ఎప్పుడు ప్రారంభమవుతాయో తెలియని పరిస్థితి నెలకొంది.

**ఆర్థికశాఖ అనుమతి లేదని సమాచారం**

జిల్లా కేంద్రంలో స్టేడియం నిర్మాణానికి ప్రభుత్వం నుంచి ఉత్తర్వులు జారీ అయినప్పటికీ ఆర్థిక శాఖ నుంచి నిధుల విడుదలకు అనుమతి లేదని సమాచారం. ప్రభుత్వం నుంచి కేవలం స్టేడియం మంజూరు చేస్తూ ఉత్తర్వులు మాత్రమే వెలువడ్డాయని సమాచారం. అది కాగితాలకే పరిమితమైందనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. దీంతో ఇంజినీర్లు బిల్లులు చెల్లించడం లేదనే కారణంతో గుత్తేదారు పనులు నిలిపివేశారు. దీంతో అధికారులకు ఏం చేయాలో తోచడం లేదు. 2014లో మంజూరైన స్టేడియం నిధులు ఎప్పుడోస్తాయి, అసలు నిధులు వస్తాయా లేదా అనే సందేహాలు వ్యక్తమవుతున్నాయి. పనులు నిలిచిపోవడంతో స్టేడియం నిర్మాణ ప్రదేశం నిర్మానుష్యంగా మారింది. అయితే ఆర్థిక శాఖ నుంచి నిధుల అనుమతి కోసం అధికారులు కుస్తీ పడుతున్నట్లు తెలిసింది.బిల్లుల చెల్లింపునకు సిఫారసు చేశాం..దిలీప్, డీఈ, పీఆర్ ఇంజినీరింగ్‌శాఖములుగులోని మినీ స్టేడియం నిర్మాణానికి సంబంధించి ఇప్పటి వరకు గుత్తేదారుకు చేసిన పనుల పురోగతిని బట్టి బిల్లుల చెల్లింపు కోసం సిఫారసు చేశాం. త్వరలోనే బిల్లులు చెల్లిస్తాం.

# ఎండుతున్న పంటలు.. మండుతున్న గుండెలు

జనగామ : వానాకాలంలో వరి, పత్తి సాగు చేసినా ఆశించిన స్థాయిలో దిగుబడులు రాలేదు. రైతులు కొండంత ఆశతో యాసంగిలో సాగు చేసిన వరి పంటకు నాటు దశలోనే తెగుళ్లు సోకాయి. దాని నుంచి తేరుకోక ముందే సాగునీటి కష్టాలు చుట్టుముట్టాయి. అధికారులకు ముందస్తు ప్రణాళిక లేకపోవడంతో జిల్లాలోని జలాశయాలు, చెరువులు, వాగులకు నీరు చేరలేదు. దీంతో జనగామ, నర్మెట్ట, తరిగొప్పుల, బచ్చన్నపేట మండలాల్లో వేలాది ఎకరాల్లో పంటలు ఎండిపోయాయి.

**వెలవెలబోతున్న జలాశయాలు**గతేడాది వానాకాలంలో సాధారణ వర్షపాతం 74 సెం.మీ కాగా 144 సెం.మీ నమోదైంది. అయినప్పటికీ వరి సాగు విస్తీర్ణం పెరగడంతో నీటి వినియోగం పెరిగింది. రిజర్వాయర్లు, చెరువులు, వాగులు, బోరు బావులు, బావుల్లో నీళ్లు లేక వెలవెలబోతున్నాయి. ప్రస్తుత యాసంగికి చుక్క నీరు కూడా లేదు.

**పొట్ట దశలోనే..**యాసంగిలో ప్రధానంగా సాగు చేస్తున్న వరి పంటకు సాగునీటి కష్టాలు ఎదురయ్యాయి. జిల్లాలో 1.40 లక్షల ఎకరాల్లో వరి, 6వేల ఎకరాల్లో మొక్కజొన్న సాగు చేశారు. జనవరి చివరి నుంచే ఎండలు మండిపోతుండడంతో నీటి వినియోగం పెరిగింది. వరి పంట పొట్టకొచ్చే దశలో నీటి లభ్యత తగ్గిపోయింది. సగటున సుమారు 7 మీటర్ల లోతుకు భూగర్భ జలాలు పడిపోయాయి. జిల్లా వ్యాప్తంగా సుమారు 30 వేల ఎకరాల్లో వరి పంట ఎండిపోయింది. బొమ్మకూరు, స్టేషన్‌ఘన్‌పూర్, కన్నెబోయినగూడెం, వెల్దండ జలాశయాలు, చెరువులు, వాగులు పూర్తిగా ఎండిపోయాయి. దేవాదుల నిరు వస్తేనే పంటలు చేతికందే అవకాశముంటుంది.**అడుగంటిన చెరువు..**జనగామ మండలం వెంకిర్యాలలోని చెరువు ఎండిపోయింది. కన్నెబోయినగూడెం జలాశయంలో నీరు ఉంటే.. మండువేసవిలోనూ ఈ చెరువు నీటితో కళ కళలాడేది. యాసంగి ఆరంభం నుంచే చెరువులో నీటి మట్టం తగ్గిపోయింది దీంతో చెరువు పరివాహక ప్రాంతంలోని బోర్లు, బావులు అడుగంటాయి. నీరందించే పరిస్థితి లేకపోవడంతో చెరువు కింద ఉన్న సుమారు 300 ఎకరాల్లో వరి పంట ఎండిపోయే పరిస్థితి నెలకొంది. జనగామ, బచ్చన్నపేట, నర్మెట్ట, తరిగొప్పుల, లింగాలఘనపురం మండలాల్లో పరిస్థితులు నెలకొన్నాయి.

**పశువుల మేతగా..**రైతులు కరుణాకర్, యాదగిరి, భిక్షపతి తమకున్న 10 ఎకరాల్లో రూ.2.50 లక్షల పెట్టుబడి పెట్టి బావులు, వాగు ఆధారంగా వరి పంట సాగు చేశారు. పంట పొట్ట దశకు వచ్చిన క్రమంలో బోరు బావి, బావి ఎండిపోయాయి. బొమ్మకూరు రిజర్వాయర్ అడుగంటిపోవడంతో వాగుకు నీరందని పరిస్థితి ఏర్పడింది. దీంతో ఆరెకరాల్లో పంట పూర్తిగా ఎండిపోగా, మిగతా నాలుగెకరాల్లో పంట ఎండుముఖం పట్టింది. ఎండిన పంటను పశువులకు మేపుతున్నారు.



# ఏ ఆధారాలూ చూపించలేకపోయారు

సీతానగరం: తెదేపా అధినేత చంద్రబాబు ఏ తప్పూ చేయలేదని.. ఈ విషయం ప్రజలందరికీ తెలుసని ఆయన సతీమణి నారా భువనేశ్వరి అన్నారు. ప్రజల సొమ్ము దోచుకుని దాచుకునే అలవాటు చంద్రబాబుకు లేదని చెప్పారు. చంద్రబాబు అరెస్టును నిరసిస్తూ తూర్పు గోదావరి జిల్లా సీతానగరంలో తెదేపా ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న రిలే నిరాహార దీక్షా శిబిరాన్ని ఆమె సందర్శించారు. ఈ సందర్భంగా భువనేశ్వరి మాట్లాడారు. "చంద్రబాబు ఏం తప్పు చేశారని 19 రోజులుగా జైలులో నిర్బంధించారు. ఎలాంటి విచారణ లేకుండానే నిర్బంధిస్తారా? ఆరోపణల్లో వాస్తవాలేంటో తెలుసుకోరా? ఇప్పటివరకు ఆయన ఏం తప్పు చేశారో చెప్పలేకపోయారు.. ఏ ఆధారాలూ చూపించలేకపోయారు. ప్రజల మనిషిని జైల్లో నిర్బంధించారు. శాంతియుత నిరసనలనూ పోలీసులు అడ్డుకుంటున్నారు. లోకేశ్ పాదయాత్రను కూడా పలుమార్లు అడ్డుకున్నారు. నైపుణ్యాభివృద్ధి కేంద్రంలో శిక్షణ పొందిన యువత రూ.లక్షలు సంపాదిస్తున్నారు. చేయి చేయి కలిపి చంద్రబాబుకు అండగా నిలుద్దాం" అని భువనేశ్వరి అన్నారు.





# గీతా గోపీనాథ్ ట్వీట్‌కు సీఎం జగన్ రియాక్షన్

## 'థ్యాంక్ యూ..వాళ్ల చిరునవ్వులే ఆ విషయాన్ని చెప్తున్నాయ్'

గుంటూరు: అంతర్జాతీయ ద్రవ్య నిధి డిప్యూటీ మేనేజింగ్ డైరెక్టర్ గీతా గోపీనాథ్‌కు ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ధన్యవాదాలు తెలియజేశారు. ఏపీ నుంచి వెళ్లిన విద్యార్థులు ఐఎంఎఫ్ కార్యాలయంలో సందడి చేశారు. వాళ్లను ఆహ్వానించి ముచ్చటించినందుకుగానూ సీఎం జగన్ ఎక్స్ వేదికగా స్పందించారు. "మా పిల్లలను కలుసుకున్నందుకు, సాదరంగా వాళ్లను ఆహ్వానించినందుకు గీతాగోపినాథ్ గారికి థ్యాంక్స్. వాళ్ల చిరునవ్వులే ఆ విషయాన్ని చెబుతున్నాయ్" అని సీఎం జగన్ ట్వీట్ చేశారు. "చదువు అనేది వ్యక్తిగత జీవితాలను మార్చడమే కాకుండా మొత్తం సమాజాన్ని మార్చడంలో అతిపెద్ద ఉత్ప్రేరకం అని నేను నిజంగా నమ్ముతున్నాను. మా పిల్లలే ఇందుకు నిదర్శనం. అంతర్జాతీయ వేదికపై మన రాష్ట్రాన్ని ఎంతో గర్వంగా, ఆత్మవిశ్వాసంతో ప్రాతినిధ్యం వహిస్తున్న పిల్లలను చూసినప్పుడు నేను గర్వంతో నిండిపోయాను!" అని పోస్ట్ చేశారాయన. అంతకు ముందు గీతా గోపినాథ్ సైతం పిల్లలతో ఉన్న ఫొటోను తన ఎక్స్‌లో ట్వీట్ చేశారు. అమెరికా, ఐరాస పర్యటనలో భాగంగా.. వాళ్లను ఐఎంఎఫ్ ప్రధాన కార్యాలయం వద్ద కలుసుకున్నట్లు ఆమె పోస్ట్ చేశారు. వాళ్లను కలుసుకున్నందుకు సంతోషంగా ఉందని ఆమె ట్వీట్‌లో తెలియజేశారు.

# ఫ్యామిలీ డాక్టర్ కాన్సెప్ట్‌తో ప్రజలకు మెరుగైన వైద్య సేవలు

## శాసనమండలిలో మంత్రి విడదల రజినీ




అమరావతి: ఫ్యామిలీ డాక్టర్ కాన్సెప్ట్‌తో ప్రజలకు మెరుగైన వైద్య సేవలను అందిస్తున్నామని మంత్రి విడదల రజినీ పేర్కొన్నారు. బుధవారం శాసన మండలిలో మంత్రి రజినీ మాట్లాడారు.

**మంత్రి విడదల రజినీ ఏమన్నారంటే..** ఫ్యామిలీ డాక్టర్ కాన్సెప్ట్‌తో ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందుతున్నాయి. 105 రకాల మందులు 14 రకాల టెస్టులు చేస్తున్నారు. పీహెచ్సీలో ఇద్దరు డాక్టర్లు ఉంటే ఒక డాక్టర్ విధులు నిర్వహిస్తూ మరొక డాక్టర్ ఫ్యామిలీ డాక్టర్ కాన్సెప్ట్‌లో పాల్గొంటున్నారు. జీరో వేకెన్సీ విధానాన్ని సీఎం వైయస్ జగన్ తీసుకొచ్చారు. రాష్ట్రంలో 53 వేల 190 మంది మెడికల్ స్టాఫ్‌ను రిక్రూట్మెంట్ చేశాము. పేదవారికి ఆరోగ్య సమస్యలు వస్తే గతంలో వైద్యం అందని పరిస్థితి ఉండేది, టెస్టులో పరికరాలు కొరతగా ఉండేవి. సీఎం వైయస్ జగన్ మోహన్ రెడ్డి అధికారం చేపట్టాక గ్రామస్థాయిలోనే వైద్య సేవలను మెరుగుపరిచారు. ఫ్యామిలీ డాక్టర్ కాన్సెప్ట్ ద్వారా రెండు కోట్ల 30 లక్షల మంది ఈ సేవలనువినియోగించుకున్నారు. సీఎం వైయస్ జగన్ రాష్ట్రంలో 17 నూతన మెడికల్ కళాశాలలకు శ్రీకారం చుట్టారు. 8500 కోట్లతో ఈ కళాశాలలో ఏర్పడనున్నాయి. ప్రతి పార్లమెంట్ పరిధిలో ఒక మెడికల్ కాలేజీ ఉండా లన్నది సీఎం ఆకాంక్ష. ఈ విద్యా సంవత్సరంలో విజయనగరం, రాజమహేంద్రవరం, ఏలూరు, మచిలీపట్నం, నంద్యాలలో మెడికల్ కళాశాలలు ప్రారంభమయ్యాయి. 150 మెడికల్ సీట్లతో ఐదు మెడికల్ కాలేజీలలో 750 సీట్లు అందుబాటులోకి వచ్చాయి. రానున్న విద్యాసంవత్సరాల్లో మరిన్ని మెడికల్ కళాశాలలు అందుబాటులోకి రానున్నాయి. భారత దేశ చరిత్రలోనే నూతన మెడికల్ కాలేజీలు ఏర్పాటుతో వైయస్ జగన్‌మోహన్‌రెడ్డి చరిత్ర సృష్టించారు.



# వైసీపీ మీటింగ్‌లో అనంత్‌బాబు.. ఇదే కదా జగన్నాటకం అంటే..!!

దళిత యువకుడు, డ్రైవర్ సుబ్రహ్మణ్యం హత్య కేసులో జైలు శిక్ష అనుభవించి బెయిల్‌పై విడుదలైన ఎమ్మెల్సీ అనంత్‌బాబును తమ పార్టీ నుంచి సస్పెండ్ చేస్తున్నట్లు వైసీపీ గతంలో ప్రకటించింది. అయితే మంగళవారం నాడు సీఎం జగన్ నిర్వహించిన వైసీపీ మీటింగ్‌కు అనంత్‌బాబు హాజరుకావడం చర్చకు దారి తీసింది. ఇప్పటికే చాలా అంశాల్లో జగన్నాటకాలను నడిపిస్తున్న సీఎం జగన్మోహన్‌రెడ్డి ఇప్పుడు మరోసారి మీడియాకు అడ్డంగా దొరికిపోయారని కామెంట్లు వినిపిస్తున్నాయి. తమ పార్టీలో నీతిమంతులకే చోటు ఉంటుందని కట్టుకథలు వినిపించిన వైసీపీ అధినేత జగన్.. ఇప్పుడు సస్పెండ్ చేసిన వ్యక్తిని ఎలా మీటింగ్‌ను పిలిచారని రాజకీయ విశ్లేషకులు ప్రశ్నిస్తున్నారు. వైసీపీలో క్రిమినల్స్, గుండాలకే చోటు ఉంటుందని సంకేతాలు ఇస్తున్నారా అని నిలదీస్తున్నారు. డ్రైవర్ సుబ్రహ్మణ్యం మరణానికి తానే బాధ్యుడిని అని ఎమ్మెల్సీ అనంత్‌బాబు తమకు వాంగ్మూలం ఇచ్చినట్లు పోలీసులు ప్రకటించిన నేపథ్యంలో.. సీఎం జగన్ ఆదేశాల మేరకు ఆయన్ను పార్టీ నుంచి సస్పెండ్ చేస్తున్నట్లు మే 25, 2022న తాడేపల్లిలోని వైసీపీ కేంద్ర కార్యాలయం ప్రెస్‌నోట్ విడుదల చేసింది. అంటే హత్య జరిగిన ఆరు రోజులకు ఈ సస్పెన్షన్ చోటు చేసుకుంది. ఆ తర్వాత అనంత్‌బాబుపై సస్పెన్షన్ ఎత్తివేస్తున్నట్లు ఎక్కడా ప్రకటించలేదు. ఇప్పుడు ఎన్నికలు దగ్గర పడుతున్న వేళ వైసీపీ ముఖ్య నేతలతో సీఎం జగన్ నిర్వహించిన సమావేశానికి అనంత్‌బాబు ప్రత్యక్షం కావడం చర్చనీయాంశంగా మారింది. వల్లభనేని వంశీ మోహన్, పేర్ని నాని మధ్య అనంత్‌బాబు కూర్చున్న ఫోటోలు మీడియాలో దర్శనమిస్తున్నాయి. దీంతో సోషల్ మీడియాలో నెటిజన్‌లు వైసీపీ తీరుపై దుమ్మెత్తి పోస్తున్నారు. క్రిమినల్స్‌కు వైసీపీలో పెద్దపీట వేస్తున్నారని చెప్పడానికి ఇది మరో ఉదాహరణ మాత్రమే. గత నెలలో కూనవరంలో వరద ప్రాంతాల పరిశీలనకు సీఎం జగన్ వెళ్లిన సమయంలో అక్కడ నిర్వహించిన సమావేశంలో సీఎంతో పాటు వేదికపై అనంత్‌బాబు కూడా కనిపించారు. అంతేకాకుండా అనంత్‌బాబు బెయిల్‌పై విడుదలైన సమయంలో ఆయన ఫ్లెక్సీలకు వైసీపీ నేతలు దండలు వేయడం, పాలాభిషేకాలు చేయడం వంటి ఘటనలు కూడా ప్రజలు గమనించారు. ఈ ఘటనపై అప్పట్లో టీడీపీ యువ నేత నారా లోకేష్ కూడా స్పందించారు. దళిత యువకుడు సుబ్రహ్మణ్యంను అత్యంత కిరాతకంగా చంపిన ఎమ్మెల్సీ అనంతబాబుకు సీఎం జగన్ పాలాభిషేకం చేయించారని.. జైల్లో సకల సౌకర్యాలు, బయట ఫ్లెక్సీలతో ఊరేగింపులు చూస్తుంటే దళితులపై సాగుతున్న దమనకాండ అంతా జగన్ కనుసన్నల్లోనే జరుగుతోందని స్పష్టమవుతోందని లోకేష్ ఆరోపించిన సంగతిని పలువురు నెటిజన్‌లు గుర్తు చేస్తున్నారు.



# జడ్జిలపై దూషణ పర్వం..

## బుద్దా వెంకన్న సహా 26 మందికి నోటీసులు

## చంద్రబాబు అరెస్ట్.. 'క్యాంపెయిన్‌గా జడ్జిలను ట్రోల్ చేశారు'

గుంటూరు: స్కిల్ డెవలప్‌మెంట్ స్కామ్ కేసులో మాజీ సీఎం చంద్రబాబు నాయుడు అరెస్ట్ తర్వాత.. ఆయన పిటిషన్‌లను విచారించిన జడ్జిలపై రాజకీయపరంగా.. ఉద్దేశపూర్వకంగానే దూషణల పర్వం కొనసాగిందని ఏపీ ప్రభుత్వం కోర్టు దృష్టికి తీసుకెళ్లింది. ఈ మేరకు ఏపీ హైకోర్టులో ఇవాళ క్రిమినల్ కంటెంప్ట్ పిటిషన్‌పై విచారణ జరిగింది. పిటిషన్‌పై విచారణ నేపథ్యంలో.. టీడీపీ నేత బుద్దా వెంకన్న, గోరంట్ల బుచ్చయ్య చౌదరీ సహా 26 మందికి నోటీసులు జారీ చేయాలని బుధవారం హైకోర్టు ఏపీ డీజీపీని ఆదేశించింది. క్రిమినల్ కంటెంప్ట్ పిటిషన్‌పై వాదనల సందర్భంగా.. "క్యాంపెయిన్‌గా జడ్జిపై ట్రోలింగ్ చేశార"ని అడ్వొకేట్ జనరల్ శ్రీరామ్ తెలిపారు. ఇద్దరు హైకోర్టు జడ్జీలు, ఏసీబీ జడ్జి ఫ్యామిలీ టార్గెట్‌గా ట్రోలింగ్ నడిచిందని కోర్టు దృష్టికి తీసుకెళ్లారాయన. దీంతో ట్రోల్ చేసిన సోషల్ మీడియా ఖాతాలను పరిశీలించి.. ఆ 26 మందికి నోటీసులు ఇవ్వాలని డీజీపీకి ఆదేశాలు జారీ చేసింది ఏపీ హైకోర్టు. తదుపరి చర్యలు తీసుకోవాలని రిజిస్ట్రీని ఆదేశిస్తూ.. నాలుగు వారాలకు పిటిషన్‌పై విచారణ వాయిదా వేసింది హైకోర్టు.

**యెల్లో బ్యాచ్‌తో పాటు :** చంద్రబాబు అరెస్ట్ తర్వాత హైకోర్టు, దిగువ కోర్టు జడ్జిలపై దూషణల పర్వం కొనసాగింది. టీడీపీ నేతలు, చంద్రబాబు సానుభూతి పరులు న్యాయవ్యవస్థపై దుర్మార్గపు వ్యాఖ్యలు చేశారు. న్యాయమూర్తులపై నిందలు, ఆరోపణలు, విమర్శలు చేసింది పచ్చ మీడియా. దీంతో ఈ వ్యవహారంలో బుద్దా వెంకన్న సహా 26 మంది ప్రతివాదులుగా చేర్చింది ప్రభుత్వం. బుద్దా వెంకన్నతో పాటు ఎస్. రామకృష్ణ, మరికొన్ని సోషల్ మీడియా పేజీల నిర్వాహకులకు పరిశీలన తర్వాత నోటీసులు జారీ కానున్నాయి. అలాగే ప్రతివాదులుగా ఉన్న గూగుల్, ఎక్స్(ట్విటర్), ఫేస్‌బుక్‌కు కూడా నోటీసులు ఇవ్వాలని హైకోర్టు స్పష్టం చేసింది.

**మహాదారుణంగా..** స్కిల్ డెవలప్‌మెంట్ స్కామ్ కేసులో చంద్రబాబును ఏపీ సీఐడీ అరెస్ట్ చేసి ఏసీబీ కోర్టులో హాజరుపరిచింది. కోర్టులో 10 గంటల వాదనల తరువాత చంద్రబాబుకు రిమాండ్ విధించింది. ఆపై హైకోర్టులో క్వాష్ పిటిషన్ దాఖలు చేయగా.. దానిని హైకోర్టు కొట్టేసింది. అయితే ఈ తీర్పులను ఇచ్చిన జడ్జీలను సామాజిక మాధ్యమాల వేదికగా వికృత రూపాల్లో తూలనాడుతూ పోస్టులు వెల్లువెత్తాయి.

**రాష్ట్రపతి కార్యాలయం స్పందన :** మరోవైపు జడ్జీలపై అభ్యంతరకర పోస్టులపై రాష్ట్రపతి భవన్ పై స్పందించి పోస్ట్ లు పెట్టిన వారిపై చర్యలు తీసుకోవాలని ఏపీ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శికి రాష్ట్రపతి కార్యాలయం లేఖ రాసింది. తదనంతరం హైకోర్టులో కోర్టు ధిక్కరణ పిటిషన్ దాఖలు చేసింది ప్రభుత్వం. ప్రభుత్వం తరపున ఏజీ శ్రీరామ్ వాదనలు వినిపించారు.



# పెళ్లి వేడుకలో విషాదం.. ఘోర అగ్నిప్రమాదం.. 100 మందికి పైగా మృతి

మొసూల్: ఇరాక్ లో ఘోర ప్రమాదం చోటుచేసుకుంది. ఓ పెళ్లి వేడుకలో పేల్చిన బాణసంచా కారణంగా ఘోర అగ్నిప్రమాదం చోటుచేసుకొని 100 మందికి పైగా ప్రాణాలు కోల్పోయారు. ఇరాక్‌లోని నినెవేహ్ ప్రావిన్స్‌లో మంగళవారం రాత్రి ఈ దుర్ఘటన జరిగింది. స్థానిక మీడియా కథనాల ప్రకారం.. హమ్‌దానియా ప్రాంతంలోని ఓ ఫంక్షన్ హాల్‌లో నిన్న రాత్రి పెళ్లి వేడుక జరుగుతుండగా ఉన్నట్టుండి మంటలు చెలరేగాయి. చూస్తుండగానే అవి హాల్ అంతా వ్యాపించాయి. దీంతో ఈ వేడుకలో పాల్గొన్న అతిథులు, కుటుంబసభ్యులు అందులో చిక్కుకుపోయారు. సమాచారమందుకున్న పోలీసులు, అగ్నిమాపక సిబ్బంది వెంటనే అక్కడకు చేరుకుని సహాయక చర్యలు చేపట్టారు. ఈ దుర్ఘటనలో 114 మంది ప్రాణాలు కోల్పోయినట్లు నినెవేహ్ ప్రావిన్స్ ఆరోగ్యశాఖ వెల్లడించింది. మరో 150 మంది గాయపడ్డారు. క్షతగాత్రుల్లో కొంతమంది పరిస్థితి విషమంగా ఉంది. దీంతో మృతుల సంఖ్య మరింత పెరిగే అవకాశమున్నట్లు తెలుస్తోంది.

**టపాసుల పేల్చడంతో..** ప్రమాదానికి గల కారణాలపై స్పష్టత రాలేదు. అయితే, పెళ్లి వేడుకలో పేల్చిన బాణసంచా కారణంగానే ఈ ప్రమాదం చోటుచేసుకున్నట్లు స్థానిక మీడియా వర్గాలు పేర్కొన్నాయి. వేడుక జరుగుతున్న సమయంలో కొందరు టపాసులను పేల్చారు.

ఈ క్రమంలోనే షాండ్లియర్‌కు మంటలు అంటుకున్న క్షణాల్లో వ్యాపించినట్లు సదరు వర్గాలు తెలిపాయి. ఘటన సమయంలో వధూవరులు స్టేజీపై డ్యాన్స్ చేస్తున్నారు. ప్రమాదంలో వారు కూడా గాయపడినట్లు తెలుస్తోంది.

# అందుకే మోదీ, అమిత్ షా అపాయింట్‌మెంట్ కూడా ఇవ్వలేదు: మంత్రి రోజా



విజయవాడ: నారా లోకేష్ ఢిల్లీలో ప్రధాని మోదీ, కేంద్ర మంత్రి అమిత్ షా కాళ్లు పట్టుకోవడం కోసం తిరుగుతున్నారని మంత్రి రోజా ధ్వజమెత్తారు. ఇప్పటికే రాష్ట్రపతిని కలిసిన లోకేష్.. తప్పు చేసిన తన తండ్రిని కాపాడాలని కోరారని అన్నారు. ప్రజల సొమ్ము దోచేసినా చర్యలు తీసుకోకూడదని అడిగేందుకు ఢిల్లీ వెళ్లారని విమర్శించారు. అడ్డంగా దొరికిన చంద్రబాబును కాపాడేందుకు ఎవరూ సిద్ధంగా లేరని.. అందుకే మోదీ, అమిత్ షా అపాయింట్‌మెంట్ కూడా ఇవ్వలేదని మండిపడ్డారు. చంద్రబాబు స్కిల్ డెవలప్ మెంట్ సహా అమరావతి, ఫైబర్ నెట్ వంటి అనేక స్కాంలు చేశారని మంత్రి రోజా దుయ్యబట్టారు. ఇన్నర్ రింగ్ రోడ్డు లేదు కదా.. ఇంకా స్కాం ఎలా జరిగిందని లోకేష్ అడుగుతున్నారని.. రోడ్డు వేయకముందే ఇన్నర్ రింగ్‌రోడ్డు అలైన్‌మెంట్ పేరుతో దోచుకున్నారని విమర్శలు గుప్పించారు. ఆరు నెలల్లో రిటర్న్ గిఫ్ట్ ఇస్తానని లోకేష్ చెప్తుంటే అందరూ నవ్వుతున్నారని అన్నారు. స్కాంలలో ఇరుక్కుని లోకేష్ ఢిల్లీ పారిపోయాడని.. కాళ్ళ నుంచి కళ్ళ వరకూ భయంతో వణికిపోతున్నాడని ఎద్దేవా చేశారు. 'రెడ్‌బుక్ రాసుకుంటానని బెదిరిస్తున్న లోకేష్ సీఐడీ మెమోలో ఆయన పేరు రాశారని గుర్తు చేసుకోవాలి. హెరిటేజ్‌లో 2 శాతం షేర్లు అమ్మితేనే 400కోట్లు వస్తాయని భువనేశ్వరి చెప్తున్నారు. అంటే చంద్రబాబు ఆస్తి 20 వేల కోట్లా. చంద్రబాబు అఫిడవిట్ ఆ విషయం స్పష్టం చేశారా. కర్జూర నాయుడు చంద్రబాబుకు, ఆయన తమ్ముడికి చెరో ఎకరం ఇచ్చారు. అక్కడి నుంచి లక్షల కోట్లకు చంద్రబాబు ఆస్తి ఎలా పెరిగింది. హైదరాబాద్ లో చంద్రబాబు ఇల్లు రూ. 600 కోట్లు.. భువనేశ్వరి లోకేష్ 118 కోట్ల అయితే నోటీసులకు సమాధానం చెప్పాలి. ప్రపంచ దేశాల్లోని తెలుగువారంతా ఈ స్కామ్‌ల గురించి తెలుసుకోవాలి. భువనేశ్వరి, బ్రహ్మణి అబద్ధాలు చెప్తుంటే ఎన్టీఆర్ కూతురు, మనవరాలు అనే గౌరవం కూడా పోతుంది. చంద్రబాబు దోపిడీదారుడు అని అందరికీ తెలుసు. చంద్రబాబు టీమ్ వర్క్‌గా కుటుంబసభ్యులంతా దోపిడీలో భాగస్వామ్యం అయినట్టు ప్రజలకు స్పష్టమైంది' అని రోజా పేర్కొన్నారు.

# కేటీఆర్‌పై నన్నపనేని రాజకుమారి ఫైర్



ప్రకాశం: తెలంగాణ మంత్రి కేటీఆర్‌పై మాజీ మహిళా కమిషన్ ఛైర్మన్ నన్నపనేని రాజకుమారి విమర్శలు గుప్పించారు. బుధవారం మీడియాతో మాట్లాడుతూ.. హైదరాబాద్‌లో ఐటీ రంగాన్ని చంద్రబాబు అభివృద్ధి చేశాడని కేటీఆర్ గతంలో అన్నారని గుర్తుచేశారు. హైదరాబాద్‌లో ఐటీ ఉద్యోగుల ర్యాలీకి అనుమతించాలని కేటీఆర్‌ను లోకేశ్ అడిగారని.. హైదరాబాద్‌లో మీకేం పని అని కేటీఆర్ అనడం దారుణమని మండిపడ్డారు. ఉమ్మడి రాజధానిగా హైదరాబాద్‌పై ఏపికి ఇంకా హక్కు ఉందన్నారు. ప్రపంచ వ్యాప్తంగా చంద్రబాబు అరెస్ట్‌పై నిరసనలు చేస్తున్నారన్నారు. ఏపీ ముఖ్యమంత్రి చెల్లులు షర్మిల.. కేసీఆర్‌ను రోజూ తిడుతుందని... తెలంగాణలో మీకేం పని షర్మిలాని అన్నారా అని ప్రశ్నించారు. ఏపీ ప్రభుత్వంతో బీఆర్ఎస్ కలిసిపోయిందా అని నిలదీశారు. బీఆర్ఎస్ పార్టీ మీటింగ్‌లు ఏపీలో కూడా పెట్టారని తెలిపారు. ఏపీలో బీఆర్ఎస్‌కు ఏం పని అని తాము అడగలేదన్నారు. ఒరిస్సా, మహారాష్ట్రా వెళ్లి కేసీఆర్ ధర్నాలు ఎలా చేశాని అడిగారు. కేటీఆర్ వ్యాఖ్యలను వెనక్కి తీసుకోవాలని నన్నపనేని రాజకుమారి డిమాండ్ చేశారు.

# ముందస్తు బెయిలివ్వండి.. ఏపీ హైకోర్టుకు నారా లోకేష్..




అమరావతి: వైసీపీ ప్రభుత్వం అక్రమ కేసులు, ఆధారాలు లేకుండా అరెస్టులకు తెగబడుతున్న నేపథ్యంలో టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ ఏపీ హైకోర్టును ఆశ్రయించారు. ఐఆర్ఆర్ (ఇన్నర్ రింగ్ రోడ్) అలైన్‌మెంట్ కేసులో ముందస్తు బెయిల్ కోసం పిటిషన్ దాఖలు చేశారు. ఈ మేరకు ఆయన ఏపీ హైకోర్టును ఆశ్రయించారు. ఈ కేసులో లోకేష్‌ను ఏ14గా చేరుస్తూ ఏసీబీ కోర్టులో సీఐడీ మెమో దాఖలు చేసిన విషయం తెలిసిందే. దీంతో నారా లోకేష్ ముందస్తు బెయిల్ కోరారు.

## సంతోషం లేదా బాధ కలిగితే సామ్ ఏం చేస్తుంది?

సమంత రూత్ ప్రభు గత కొంతకాలంగా మయోసైటిస్ కి చికిత్స పొందుతున్న సంగతి తెలిసిందే. ఈ తీరిక సమయాన్ని తనదైన శైలిలో ప్రణాళికా బద్ధంగా గడిపేస్తోంది ఈ బ్యూటీ. ఇంతకుముందు అమెరికాలో మయోసైటిస్ చికిత్సను పూర్తి చేసుకుని ఇండియాకి వచ్చిన సమంత వెంటనే ముంబైకి వెళ్లారు. తన తదుపరి ప్రాజెక్ట్ గురించి వెల్లడిస్తుందనే అంతా భావిస్తున్నారు. ఇంతలో సామ్ సడెన్ సర్ ప్రైజ్ నిచ్చింది. తాజాగా అద్భుతమైన ప్రకృతి దృశ్యాలను ఆస్వాధిస్తున్నప్పటి ఫోటోలను షేర్ చేసిన సమంత ఆసక్తికర విషయాలను తెలిపింది. సామ్ అమెరికా పర్యటన ముగించినప్పటి నుండి కొత్త అప్ డేట్ లను చురుగ్గా పోస్ట్ చేస్తోంది. ఈ రోజు సమంత తన సోషల్ మీడియా ప్లాట్‌ఫారమ్‌లో అందమైన ప్రకృతి ఫోటోల బంచ్‌ను షేర్ చేసింది. తన కష్టకాలంలో ఎక్కువ ఇష్టపడే సినిమా గురించి కూడా సమంత వెల్లడించింది. ఈ పోస్ట్‌కు ప్రతిస్పందనగా అభిమానులు త్వరగా సామ్‌ను ఆప్యాయతతో పలకరించారు. తన ఇన్‌స్టాగ్రామ్ ఖాతాలో సమంత ఇలా పోస్ట్ చేసింది. నేను చిన్నతనంలో చాలా సంతోషంగా లేదా చాలా బాధగా అనిపించినప్పుడు... నేను సౌండ్ ఆఫ్ మ్యూజిక్ సినిమాని మళ్లీ చూసేదానిని. వాటన్నిటి నుంచి నేను తప్పించుకునే



మార్గమది. అది నన్ను నేను మర్చిపోయే మాయా ప్రపంచానికి తీసుకువెళుతుంది. నాకు ఇది ఒక ఆధ్యాత్మిక ప్రదేశం. అది ఓదార్పుగా వాస్తవం కాదు. నేను పెద్దయ్యాక సినిమాకి తిరిగి వెళ్లాను. కొన్ని సినిమాలు ప్రతి పునఃపరిశీలనతో మెరుగవుతాయి. కానీ సౌండ్ ఆఫ్ మ్యూజిక్ అలాగే ఉంటుంది. మన బాల్యంలోకి మనల్ని ప్రయాణించేలా చేస్తుంది. మీరు కూడా మీ బాల్యానికి తిరిగి వెళ్లండి... అని వ్యాఖ్యను జోడించింది. సమంత అభిమాని ఒకరు స్పందిస్తూ ఇలా వ్యాఖ్యానించారు, "జ్ఞాపకాలు గుండెకు శాశ్వతమైన రత్నాలు" అని రాయగా, మరొక అభిమాని, "చాలా కాలం తర్వాత మీరు ప్రశాంతమైన జీవితాన్ని అనుభవిస్తున్నారు. మీకు బోలెడంత ప్రేమ" అని వ్యాఖ్యానించారు. సమంత షేర్ చేసిన వాటిలో ప్రారంభ ఫోటోలో సమంతా సుందరమైన దృశ్యాన్ని ఆస్వాధిస్తున్నట్లు కనిపించగా, రెండవది మొత్తం ఆ పరిసర ప్రాంతాన్ని ప్రదర్శించే సంక్షిప్త వీడియోతో ఆకట్టుకుంది. మూడవ పోస్ట్‌లో 'సౌండ్ ఆఫ్ మ్యూజిక్' సినిమాలోని ఒక సన్నివేశాన్ని సమంత షేర్ చేసింది. సమంత చివరిసారిగా విజయ్ దేవరకొండ సరసన 'ఖుషి'లో కనిపించింది. తదుపరి వరుణ్ ధావన్‌తో కలిసి స్క్రీన్‌ను షేర్ చేసుకున్న 'సిటాడెల్' భారతీయ వెర్షన్ విడుదల కానుంది. రాజ్ అండ్ డికె దర్శకత్వం వహించిన సిరీస్ ఇది. ప్రస్తుతం 'సిటాడెల్ ఇండియా' గురించి పెద్దగా సమాచారం అందుబాటులో లేనప్పటికీ వీటి కథాంశాలను ప్రియాంక చోప్రా ఇటీవలే వెల్లడించారు. ప్రాంతీయ వెర్షన్లు పరస్పరం అనుసంధానించబడి ఉన్నాయని తెలిపారు.

## యూట్యూబర్ తో లేడీ సూపర్ స్టార్.. ఇప్పుడు అవసరమా?

లేడీ సూపర్ స్టార్ నయనతార ఇటీవల బాలీవుడ్ లో నటించిన జవాన్ సినిమా భారీ విజయాన్ని సొంతం చేసుకుంది. జవాన్ సినిమా తర్వాత నయనతార కి బాలీవుడ్ లో కూడా ఫుల్ డిమాండ్ పెరిగింది. కానీ అక్కడ ఇబ్బడి ముబ్బడిగా సినిమాలు చేయాలని ఆమె కోరుకోవడం లేదట. పెద్ద హీరోలు, ప్రముఖ నిర్మాతల సినిమాలకు కూడా నయన్ నో చెబుతుందట. ఇలాంటి సమయంలో ఆమె తమిళ్ లో కొత్తగా ఓకే చేసిన సినిమా అందరికీ షాకింగ్ గా ఉంది. ఒక వైపు వందల కోట్ల భారీ చిత్రాల్లో నటించే అవకాశాలు వస్తుండగా నయనతార మాత్రం చిన్న సినిమాల్లో, అది కూడా కొత్త



దర్శకుడితో వర్క్ చేసేందుకు సిద్ధం అవ్వడం తమిళ్ మీడియా వర్గాల వారిని మాత్రమే కాకుండా ఆమె అభిమానులను కూడా సర్ ప్రైజ్ కి గురి చేసింది అనడంలో సందేహం లేదు. తాజాగా డ్యూడ్ విక్కీ దర్శకత్వంలో నయనతార సినిమాను చేసేందుకు కమిట్ అయింది. తమిళ్ యూట్యూబ్ ప్రేక్షకులకు డ్యూడ్ విక్కీ సుపరిచితుడు. అతడు ఇప్పటి వరకు సినిమా లకు దర్శకత్వం వహించిందే లేదు. మొదటి సారి నయనతార సినిమా తో వెండి తెరపై దర్శకుడిగా తెరంగేట్రం చేసేందుకు సిద్ధం అయ్యాడు. సినిమాల అనుభవం లేని డ్యూడ్ విక్కీ కి నయనతార ఛాన్స్ ఇవ్వడం ను కొందరు ఫ్యాన్స్ తప్పుబడుతున్నారు. ఇలాంటి సమయంలో నయనతార ప్రయోగాలు చేయడం ఎంత వరకు సబబు అంటున్నారు. మొత్తానికి నయనతార కొత్త సినిమాకు సంబంధించిన హడావుడి సందడి ప్రస్తుతం తమిళ్ మీడియాలో కనిపిస్తుంది. తాజాగా విడుదల అయిన మోషన్ పోస్టర్ ప్రస్తుతం అందరి దృష్టిని ఆకర్షిస్తోంది. న్యాయ దేవత విగ్రహం ను చూపించడం వల్ల ఈ సినిమా న్యాయ వ్యవస్థకు సంబంధించినది అయి ఉంటుందని కొందరు భావిస్తున్నారు. ఏది ఏమైనా నయనతార సినిమా అనగానే ఆమె అభిమానులతో పాటు చాలా మంది ప్రేక్షకులు ఎదురు చూస్తున్నారు. ఈ సినిమా వారికి ఎలాంటి ఫీల్ ను కలిగిస్తుందో చూడాలి.





## ఫామ్‌లోకి ఆ హీరోయిన్స్.. ఇక సీనియర్ హీరోలకి నో టెన్షన్!



చిరంజీవి, బాలకృష్ణ, నాగార్జున, వెంకటేష్ వంటి సీనియర్ స్టార్ హీరోలకు ప్రతి సినిమా ప్రారంభం సమయంలో హీరోయిన్స్ సమస్య తీవ్రంగా ఉంటుంది. కొత్త వారిని ఎంపిక చేద్దామంటే మరీ వయసు చిన్న వారిగా కనిపిస్తున్నారు. సీనియర్ హీరోయిన్స్ ను తీసుకోవాలంటే వారిలో చాలా మంది ఫేడ్ ఔట్ అయినట్లుగా అనిపిస్తున్నారు. సీనియర్ హీరోయిన్స్ లో అనుష్క గత కొన్నాళ్లుగా సినిమాలకు దూరంగా ఉంటుంది. కాజల్ పెళ్లి కారణంగా సినిమాలు చేయలేదు. ఇటీవల వీరిద్దరూ మళ్లీ రీ ఎంట్రీ ఇచ్చారు. అనుష్క మిస్ శెట్టి గా అలరించింది. చిరంజీవికి జోడీగా కొత్త సినిమా లో నటించబోతున్నట్లు వార్తలు వస్తున్నాయి. కాజల్ త్వరలోనే బాలయ్య భగవంత్ కేసరి సినిమా తో ప్రేక్షకుల ముందుకు రాబోతుంది. ఇక పనైపోయింది అనుకున్న మిల్కీ బ్యూటీ తమన్నా కూడా జైలర్ సినిమాలో కొంత సమయం కనిపించి సందడి చేసింది. ఆమె కూడా సీనియర్ హీరోలకు మళ్లీ మోస్ట్ వాంటెడ్ అయ్యే అవకాశాలు ఉన్నాయి. త్రిష రెగ్యులర్ గా లేడీ ఓరింటెడ్ సినిమాలు చేస్తూ ఉంది. అయితే ఇకపై సీనియర్ స్టార్ హీరోలకు జోడీగా నటించేందుకు గ్రీన్ సిగ్నల్ ఇచ్చినట్లు తెలుస్తోంది. మొత్తానికి సీనియర్ హీరోల యొక్క హీరోయిన్ కరువు తీరి పోయే విధంగా అనుష్క, కాజల్ అగర్వాల్, త్రిష, తమన్నా లు మంచి ఫామ్ లోకి వచ్చి రెడీగా ఉన్నారు. వీరి మాత్రమే కాకుండా లేడీ సూపర్ స్టార్ నయనతార ఇంకా కొందరు తమిళ్ ముద్దుగుమ్మలు కూడా మేము రెడీ అన్నట్లుగా సీనియర్ హీరోలతో సినిమాలకు సిద్ధమవుతున్నారు. ఇప్పటి వరకు చెప్పుకున్న హీరోయిన్స్ తో పాటు శ్రియ కూడా ఏ హీరో తో అయినా సినిమా ను చేసేందుకు రెడీ అన్నట్లుగా ఉంటుంది. కనుక ముందు ముందు స్టార్ హీరోలతో సినిమాలు చేయబోతున్న దర్శకులకు ఎలాంటి టెన్షన్ లేదు అన్నట్లుగా సినీ విశ్లేషకులు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు.

## నయనతార అప్సెట్ షారుఖ్ ఖాన్ ఓదార్పు!



సౌత్ ఇండియన్ స్టార్ హీరోయిన్ నయనతార జవాన్ సినిమతో బాలీవుడ్ లోకి అడుగుపెట్టింది. షారుఖ్ ఖాన్ హీరోగా తెరకెక్కిన ఈ మూవీ బ్లాక్ బస్టర్ హిట్ సొంతం చేసుకొని వెయ్యి కోట్ల కలెక్షన్స్ దిశగా పరుగులు పెడుతోంది. పఠాన్ తర్వాత మరోసారి జవాన్ సినిమాతో షారుఖ్ కలెక్షన్స్ ప్రభంజనం సృష్టిస్తున్నారు. అయితే ఈ చిత్రంలో నయనతార లీడ్ రోల్ చేసిన ఆమె స్క్రీన్ స్పేస్ తక్కువగా ఉంటుంది. ఈ విషయంలో నయనతార దర్శకుడు అట్లీపై కోపంగా ఉందని, తనకి చెప్పిన విధంగా పాత్ర లేదని అసహనం వ్యక్తం చేసినట్లు కోలీవుడ్ సర్కిల్ లో వినిపిస్తోంది. ఆమె కంటే దీపికా పదుకునే పాత్రకి ఎక్కువ ప్రాధాన్యత ఇవ్వడంతో నయనతార హర్ట్ అయ్యిందనే టాక్ జోరుగా ప్రచారం అవుతోంది. అయితే తాజాగా అట్లీకి బర్త్ డే విషెస్ చెప్పడంతో ఈ విమర్శలకి నయనతార ఫుల్ స్టాప్ పెట్టింది. ఇదిలా ఉంటే తాజాగా షారుఖ్ ఖాన్ ట్విట్టర్ లో పెట్టిన పోస్ట్ చూసిన తర్వాత నిజంగానే నయనతార తన పాత్ర విషయంలో అప్సెట్ అయ్యిందనే టాక్ వినిపిస్తోంది. జవాన్ చిత్రంలో సింగిల్ మదర్ నర్మద చాలా బలమైన పాత్ర. ఆ పాత్ర అద్భుతంగా ఉంటుందని నేను భావించాను. అయితే దురదృష్టవశాత్తు నర్మద పాత్రకి స్క్రీన్ టైం తక్కువగా ఉంది అంటూ ట్వీట్ చేశారు. ఈ ట్వీట్ ప్రస్తుతం వైరల్ గా మారింది. ఓ అభిమాని పెట్టిన పోస్ట్ ని షారుఖ్ ఖాన్ రెప్లై ఇస్తూ ఈ విధంగా రెస్పాండ్ అయ్యారు. దీనిని బట్టి నయనతార పాత్ర నిడివి తగ్గడంపై షారుఖ్ ఖాన్ కూడా కొంత నిరాశ చెందినట్లు అర్ధమవుతోంది. ఈ చిత్రంలో షారుఖ్ ఖాన్ డ్యుయల్ రోల్ పోషించారు. దీపికా పదుకునే గెస్ట్ అపీరియన్స్ ఇచ్చారు. విజయ్ సేతుపతి పవర్ ఫుల్ విలన్ గా ఈ చిత్రంలో నటించాడు. ఇప్పటికి అదిరిపోయే కలెక్షన్స్ తో జవాన్ మూవీ నార్త్ ఇండియాలో రన్ అవుతోంది. ఈ చిత్రంతో ఆర్ఆర్ఆర్ మూవీ రికార్డులు బ్రేక్ చేయవచ్చనే టాక్ వినిపిస్తోంది.

## పూజాహెగ్డే టాలీవుడ్ కి గుడ్ బై చెప్పినట్లేనా?

పూజాహెగ్డే టాలీవుడ్ ని కాదని బాలీవుడ్ కి వెళ్లిన మాట వాస్తవం. డేట్లు కేటాయించలేనంటూ 'గుంటూరు కారం' ప్రాజెక్ట్ ని రిజెక్ట్ చేసిన సంగతి తెలిసిందే. ఈ సినిమా నుంచి అమ్మడు మధ్యలో తప్పుకుంది. అప్పటికే సినిమా షూటింగ్ దశలో ఉంది. ఈ నేపథ్యంలో ఆమె పార్టు చిత్రీకరణ మొదలు పెట్ట సమయంలో ప్రాజెక్ట్ నుంచి ఎగ్జిట్ అయింది. అప్పటికే అమ్మడి చేతిలో ఓ హిందీ సినిమా ఉంది. ఆ సినిమా కోసం 'గుంటూరు కారం' వదులుకుంది. ఆ తర్వాత మరో తెలుగు సినిమాలో నటించే అవకాశం వచ్చినా అమ్మడు నో చెప్పిందని ప్రచారం సాగింది. తాజాగా పూజ బ్యూటీ మరో రెండు హిందీ సినిమాలకు ఒకే చెప్పినట్లు తెలుస్తోంది. షాహిద్ కపూర్ హీరోగా



నటిస్తోన్న 'కోయి శక్' అనే సినిమాలో ఈ బ్యూటీని హీరోయిన్ గా ఎంపిక చేసారు. ఈ సినిమా వచ్చే నెల నుంచి రెగ్యులర్ షూటింగ్ జరుపుకోనుంది. ఇదొక ఇన్వస్టిగేటివ్ థ్రిల్లర్ జానర్ సినిమా. ఇందులో పూజాహెగ్డే పాత్ర చాలా శక్తి వంతంగా ఉంటుందని చిత్ర వర్గాలు అంటున్నాయి. అలాగే ఈ సినిమాతో పాటు ఆయుష్మాన్ ఖురానా.. రణవీర్ సింగ్ కొత్త ప్రాజెక్ట్ ల్లోనూ పూజ పేరును పరిశీలిస్తున్నట్లు బాలీవుడ్ మీడియా కథనాలు వెడెక్కిస్తున్నాయి. ఇలా అమ్మడి లైనప్ చూస్తే మళ్లీ టాలీవుడ్ కి రావడం కష్టమనే సంకేతాలు అందుతున్నాయి. పూజా కేవలం బాలీవుడ్ కెరీర్ పైనే ఫోకస్ చేసినట్లు తెలుస్తోంది. అందుకే తెలుగు సినిమాలు కాదని హిందీ సినిమాలకు సంతకాలు చేస్తోంది. ఇక్కడ మరో కారణం కూడా తెరపైకి వస్తుంది. తెలుగు పాత్రలు..హిందీ పాత్రల వ్యత్యాసాన్ని కూడా అమ్మడు తెరపైకి తెస్తోందిట. హిందీ పాత్రలకంటే తెలుగు పాత్రలకు శక్తివంతంగా ఉండటం లేదని...కేవలం కొంత మంది దర్శకులు తప్ప చాలా మంది గ్లామర్ వరకే పరిమితం చేస్తున్నారని.. అది కెరీర్ పైనా ప్రభావం చూపిస్తుందని భావిస్తుందిట. టాలీవుడ్ నుంచి ఉన్న పళంగా బాలీవుడ్ కి రావడానికి ప్రధాన కారణాల్లో ఇదీ ఒకటిగా లీకులందుతున్నాయి. ఇదే నిజమైతే అమ్మడు మళ్లీ టాలీవుడ్ వైపు రావడం కష్టమే.

## ఐశ్వర్య లక్ష్మి.. వ్హాటే బ్యూటీ

సౌత్ లో హీరోయిన్ గా తనకంటూ ప్రత్యేకమైన గుర్తింపు సొంతం చేసుకున్న అందాల భామ ఐశ్వర్య లక్ష్మి. ఈ మలయాళీ భామ నటిగా కెరియర్ మొదలు పెట్టింది కూడా మాతృభాషలోనే. తరువాత కోలీవుడ్ లోకి ఎంట్రీ ఇచ్చి అక్కడ సక్సెస్ ఫుల్ హీరోయిన్ గా ఎదిగింది. మణిరత్నం పొన్నియన్ సెల్వన్ సిరీస్ లో ఇంటరెస్టింగ్ రోల్ లో ఈ బ్యూటీ నటించింది. ఆ పాత్రకి మంచి గుర్తింపు వచ్చింది. తెలుగులో కూడా మట్టికుస్తీ, గాడ్సే, అమ్ము లాంటి చిత్రాలలో నటించి మెప్పించింది. నటిగా విమర్శకుల ప్రశంసలు సైతం ఈ భామ సొంతం



చేసుకుంటుంది. రీసెంట్ గా వచ్చిన దుల్కర్ సల్మాన్ కింగ్ ఆఫ్ కోతా సినిమాలో ఆమె నటించింది. ఐశ్వర్య లక్ష్మి సోషల్ మీడియాలో మంచి యాక్టివ్ గా ఉంటుంది. రెగ్యులర్ గా తనకి సంబందించిన ఫోటోలని, అప్డేట్స్ ని ఇన్ స్టాగ్రామ్ లో షేర్ చేస్తూ ఉంటుంది. ఇన్ స్టాగ్రామ్ లో ఈమెకి 3.1 మిలియన్ ఫాలోవర్స్ ఉన్నారు. దీంతో ఆమె ఎలాంటి ఫోటో షేర్ చేసిన క్షణాల్లో వైరల్ అయిపోతుంది. తాజాగా ఐశ్వర్య లక్ష్మి వైట్ కలర్ కాస్ట్యూమ్స్ లో హాట్ ఫోటోలని ఇన్ స్టాగ్రామ్ లో షేర్ చేసింది. ఇప్పుడు ఈ ఫోటోలు వైరల్ అవుతున్నాయి. వీటిని రెండు లక్షలకి పైగా నెటిజన్లు లైక్ చేయడం విశేషం. ఈ లుక్ లో ధవళ వస్త్రాలు ధరించిన దేవకన్యలా ఐశ్వర్య లక్ష్మి ఉండటం విశేషం. ఈ మధ్యకాలంలో గ్లామర్ పరంగా కూడా ఆమె హద్దులు చెరిపేసింది.రెగ్యులర్ గా డిఫరెంట్ కాస్ట్యూమ్స్ సోషల్ మీడియాలో సందడి చేస్తోంది. తనని తాను షోకేస్ చేసుకునే ప్రయత్నం చేస్తోంది. ఈ ఫోటోలకి విపరీతమైన రెస్పాన్స్ వస్తోంది. తెలుగులో సక్సెస్ కావడానికి ఐశ్వర్య లక్ష్మి వెయిట్ చేస్తోంది. సరైన బ్రేక్ ఇచ్చే కమర్షియల్ మూవీ చేయాలని చూస్తోంది. మరి అలాంటి ఆఫర్ ఎప్పుడు వస్తుందనేది చూడాలి. తెలుగులో ఛాన్స్ లు రాకపోయన తమిళ, మలయాళీ భాషలలో మాత్రం ఐశ్వర్య లక్ష్మికి ఆఫర్స్ మెండుగానే వస్తున్నాయి.

గరుడ వార్త

గురువారం 28 సెప్టెంబర్ 2023




హైదరాబాద్: టీఎస్‌పీఎస్సీ గ్రూప్-1 ప్రిలిమ్స్ కేసులో సింగిల్ జడ్జి ఇచ్చిన తీర్పును తెలంగాణ హైకోర్టు సమర్థించింది. ప్రిలిమ్స్ పరీక్ష రద్దు సబబేనని హైకోర్టు డివిజన్ బెంచ్ స్పష్టం చేసింది. గ్రూప్-1 ప్రిలిమ్స్ మళ్లీ నిర్వహించాల్సిందేనని ఉన్నత న్యాయస్థానం తేల్చి చెప్పింది. సింగిల్ జడ్జి తీర్పును సవాల్ చేస్తూ టీఎస్‌పీఎస్సీ చేసిన అప్పీల్‌ను హైకోర్టు డివిజన్ బెంచ్ కొట్టివేసింది. గ్రూప్ 1 ప్రిలిమ్స్ పరీక్ష రద్దు చేసి.. మళ్లీ నిర్వహించాలని హైకోర్టులో పలువురు అభ్యర్థులు పిటిషన్‌లు వేశారు. పరీక్షలో బయోమెట్రిక్ వివరాలు తీసుకోలేదని పేర్కొన్నారు. హాల్ టికెట్ నంబర్ లేకుండా ఓఎంఆర్ షీట్లు ఇచ్చారని అభ్యర్థులు కోర్టు దృష్టికి తీసుకెళ్లారు. అభ్యర్థుల పిటిషన్లను పరిగణనలోకి తీసుకుని హైకోర్టు సింగిల్ జడ్జి విచారణ చేపట్టారు. ప్రిలిమ్స్ పరీక్షను మళ్లీ నిర్వహించాలని ఆదేశించారు. సింగిల్ జడ్జి తీర్పును సవాల్ చేస్తూ టీఎస్‌పీఎస్సీ హైకోర్టు డివిజన్ బెంచ్‌లో అప్పీల్ చేసింది. అప్పీల్‌పై మంగళవారం విచారణ చేపట్టిన డివిజన్ బెంచ్.. టీఎస్‌పీఎస్సీపై ప్రశ్నల వర్షం కురిపించింది. "ప్రశ్న పత్రాల లీకేజీతో ఒకసారి గ్రూప్-1 పరీక్షను రద్దు చేసి మరోసారి నిర్వహిస్తున్నపుడూ మళ్లీ అదే నిర్లక్ష్యమా? గతంలో జరిగిన తప్పులను సరిదిద్దుకోరా? బయోమెట్రిక్ విధానం అమలు చేస్తున్నట్లు నోటిఫికేషన్‌లో పేర్కొని దాన్ని ఎందుకు అమలు చేయలేదు? మీ నోటిఫికేషన్‌లోని నిబంధనలను మీరే ఉల్లంఘిస్తారా? అలా ఎందుకు జరిగింది? లక్షల మంది నిరుద్యోగులు ఉద్యోగాల కోసం ఏళ్ల తరబడి ఎదురుచూస్తున్నారు. వారి ఆశలను నీరుగారుస్తారా" అని టీఎస్‌పీఎస్సీని ఈ సందర్భంగా హైకోర్టు ప్రశ్నించింది. నిరుద్యోగుల జీవితాలతో చెలగాటమాడుతున్నారని.. వారు ఆత్మహత్యలు చేసుకుంటున్నారని వ్యాఖ్యానించింది. అనంతరం సింగిల్ జడ్జి ఇచ్చిన తీర్పును సమర్థిస్తూ బుధవారం తీర్పు వెలువరించింది.

## కేసీఆర్ వల్లే రైతుకు విలువ పెరిగింది.. భూమికి ధర పెరిగింది : మంత్రి హరీశ్‌రావు



మెదక్ : రాష్ట్ర ఆర్థిక, వైద్యారోగ్య శాఖ మంత్రి హరీష్ రావు మెదక్ జిల్లా తూప్రాన్ పర్యటనలో భాగంగా మనోహరాబాద్‌లో నూతనంగా నిర్మించిన పీహెచ్‌సీ ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో జడ్పీ చైర్‌పర్సన్ హేమలత, ఫారెస్ట్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్ ఒంటేరు ప్రతాప్ రెడ్డి, జిల్లా కలెక్టర్ రాజర్షి షా, స్థానిక నాయకులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి హరీష్ రావు మాట్లాడుతూ.. మనోహరాబాద్‌లో పీహెచ్‌సీ ప్రారంభోత్సవం చేసుకోవడం తనకు చాలా సంతోషంగా ఉందన్నారు. మనోహరాబాద్ మండలం చేయాలన్న దశాబ్దల కలను ముఖ్యమంత్రి కేసీఆర్ నిజం చేశారు. ఈ రోజు మనోహరాబాద్ మండలమైంది. ఈ మండలంలో 24 గంటలు పనిచేసే పీహెచ్‌సీ ప్రారంభించుకుంటున్నాం. ఉచితంగా అన్ని రకాల పరీక్షలు, వైద్య సేవలు ఇక్కడ అందుబాటులో ప్రజలకు ఉంటాయన్నారు. గర్భిణీలకు చెకప్‌లు కూడా ఇక్కడ జరుగుతాయని మంత్రి తెలిపారు. కేసీఆర్ ముఖ్యమంత్రి కాకపోతే మనోహరాబాద్ మండలం అయ్యేదా..? ఇక్కడ ఇంతటి అభివృద్ధి జరిగేదా? అని మంత్రి అడిగారు. త్వరలో మనోహరాబాద్‌కు పోలీస్ స్టేషన్ మంజూరు చేస్తాం. ఈరోజు ప్రభుత్వ ఆసుపత్రిల్లో 76 శాతం డెలివరీలు జరుగుతున్నాయి. ప్రభుత్వ ఆసుపత్రిలో డెలివరీ అయితే కేసీఆర్ కిట్ తెచ్చి డెలివరీ అయ్యాక అమ్మ ఒడి వాహనాల్లో ఇంటి దగ్గర దింపుతున్నాం. ఈ రోజు పేద ప్రజల కష్టాలు అర్థం చేసుకుని కష్టాలు తీరుస్తున్న నాయకుడు ముఖ్యమంత్రి. ఎండాకాలంలో కూడా హల్దీ వాగు పారుతుంది అంటే కేసీఆర్ కృషివల్లే సాధ్యమైంది. తాగడానికి మంచినీళ్లు లేనటువంటి ప్రాంతంలో ఈరోజు ప్రతి ఇంటికి నీళ్లు వచ్చాయంటే కేసీఆర్ కృషి వల్లేనని చెప్పారు. 60 ఏళ్లు పాలించిన కాంగ్రెస్ చేయని అభివృద్ధిని ఇప్పుడు చేస్తానంటే నమ్ముతారా? ఈరోజు కేసీఆర్ వచ్చారు కాబట్టి రైతుకు విలువ పెరిగింది. భూమికి ధర పెరిగింది. సద్ది తిన్న రేవు తలవాలి .. పనిచేసిన కేసీఆర్‌ను ఆశీర్వదించాలి అని హరీశ్‌రావు కోరారు.

## మోదీపై కల్వకుంట్ల కుటుంబ సభ్యుల అక్కసు..




హైదరాబాద్: కల్వకుంట్ల కుటుంబానికి అసహనం ఎక్కువైందని బీజేపీ ఎంపీ లక్ష్మణ్ అన్నారు. ఈ సందర్భంగా బుధవారం ఆయన ఇక్కడ మీడియాతో మాట్లాడుతూ తెలంగాణ ప్రభుత్వం ఒక్క గ్రూప్ వన్ పరీక్ష కూడా సక్రమంగా నిర్వహించలేదని విమర్శించారు. ప్రధాని మోదీ మీద కల్వకుంట్ల కుటుంబ సభ్యులు అక్కసు వెళ్ళగక్కుతున్నారని, ఎన్డీయే హయాంలో మూడు రాష్ట్రాల ఏర్పాటులో ప్రజలకు నష్టం జరగలేదని అన్నారు. తెలంగాణ ఏర్పాటులో కాంగ్రెస్ తప్పును ఎత్తి చూపితే.. బీఆర్ఎస్ నేతలు ఎందుకు ఉలికిపడుతున్నారని ప్రశ్నించారు. కృష్ణ జలాల వాటా కోసం మాట్లాడితే దయ్యాలు వేదాలు వల్లించినట్లుగా ఉందన్నారు. పాలమూరు ప్రజలను కేసీఆర్ ప్రభుత్వం మోసం చేసిందని, నార్లపల్లి రిజర్వాయర్ వద్ద ఒక్క మోటార్ మాత్రమే ప్రారంభించి.. రంగురంగుల సినిమాలు చూపిస్తున్నారని లక్ష్మణ్ విమర్శించారు. ప్రాజెక్టులను అడ్డం పెట్టుకొని కమీషన్లు దండుకున్నారని ఆరోపించారు. బీఆర్ఎస్ ప్రభుత్వం లీకుల ప్రభుత్వం... లిక్కర్ ప్రభుత్వమని ఎద్దేవా చేశారు. బీసీ వ్యక్తిని బీఆర్ఎస్ పార్టీ నుంచి ముఖ్యమంత్రిని చేస్తారా? ఎమ్మెల్సీ కవితను ఆయన ప్రశ్నించారు. కమీషన్ల కోసమే బీసీ బంధు ఇస్తున్నారని, దళిత బంధుకు రూ. 10 లక్షలు ఇస్తే.. బీసీ బంధుకు లక్ష రూపాయలు మాత్రమేనా? అని నిలదీశారు. బీసీ సబ్ ప్లాన్ ఎందుకు అమలు చేయడం లేదని ప్రశ్నించారు. గవర్నర్ విషయంలో పోటీ పడి విమర్శలు చేస్తున్నారని, ఎమ్మెల్సీగా సిఫార్సు చేసిన వారు ఆర్టికల్ ప్రకారం అనర్హులని లక్ష్మణ్ వ్యాఖ్యానించారు.

## గవర్నర్ తమిళిసై బడుగు, బలహీన వర్గాల వ్యతిరేకి : మంత్రి గంగుల కమలాకర్

కరీంనగర్ : గవర్నర్ తమిళిసై బడు, బలహీన వర్గాల వ్యతిరేకి అని రాష్ట్ర పౌర సరఫరాల శాఖ మంత్రి గంగుల కమలాకర్ అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఎమ్మెల్సీ పదవులకు నామినేట్ చేసిన ఎస్టీ సామాజిక వర్గానికి చెందిన కుర్ర సత్యనారాయణ, బీసీ వర్గానికి చెందిన దాసోజు శ్రవణ్ ఎమ్మెల్సీ అభ్యర్థిత్వాలను తిరస్కరించడం పట్ల మంత్రి తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు. బుధవారం కరీంనగర్‌లో జరిగిన కొండా లక్ష్మణ్ బాపూజీ జయంతి వేడుకల్లో మంత్రి గంగుల పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. గవర్నర్ తమిళసై బడుగు, వర్గాల గురించి అనుసరిస్తున్న విధానంపై తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు.
అది ఆమె భావజాలమా అని ప్రశ్నించారు. గరవర్నర్ పోస్టుకు తనను నామినేట్ చేసింది బీజేపీయే కదా అని, అప్పుడు ఆమె నేపథ్యం చూడ లేదు కదా అని అన్నారు. గవర్నర్ తీరుతో బడుగు బలహీన వర్గాలు చాలా హర్ట్ అయ్యారని, ఇప్పటికైనా గవర్నర్ రాజకీయాలు చేయకుండా వారి ప్రతిపాదనలు ఆమోదించాలన్నారు. పౌర సరఫరాల విషయంలో కేవైసీ గురించి మాట్లాడుతూ.. ఈ నెల 30 వరకు గడువు ఇచ్చారని అన్నారు. పదేళ్లకోసారి ఆధార్ కార్డ్ అప్ డేట్ చేస్తారని, ఈ విషయంలో ఎవరు ఆందోళన పడాల్సిన అవసరం లేదన్నారు. కేంద్ర మంత్రి పీయూష్ గోయల్‌కు రాష్ట్ర ప్రభుత్వం తరపునా లేఖ రాసామని, మంత్రి స్పందన ఎలా ఉంటుందో చూసిన తర్వాత నిర్ణయం తీసుకుంటామని మంత్రి పేర్కొన్నారు. ప్రజల పక్షాన రాష్ట్ర ప్రభుత్వం ఉందని ఎవరు ఆందోళన చెందనవసరం లేదని స్పష్టం చేశారు. ఈ సందర్భంగా కొండా లక్ష్మణ్ బాపూజీ రాష్ట్రానికి చేసిన సేవలను కొనియాడారు. ఈ కార్యక్రమంలో కలెక్టర్ గోపి, తదితరులు పాల్గొన్నారు.

## ఆచార్య కొండా లక్ష్మణ్ బాపూజీ జయంతి.. నివాళులర్పించిన మంత్రి పువ్వాడ, ఎంపీ నామా

ఖమ్మం: మాజీ మంత్రి, స్వాతంత్ర్య సమర యోధుడు దివంగత ఆచార్య కొండా లక్ష్మణ్ బాపూజీ జయంతిని పురస్కరించుకుని రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పువ్వాడ అజయ్ కుమార్ ఆయనకు ఘనంగా నివాళులర్పించారు. బుధవారం ఖమ్మం నగరంలోని లకారం ట్యాంక్ బండ్ పై గల కొండా లక్ష్మణ్ బాపూజీ విగ్రహానికి రవాణా శాఖ మంత్రి పువ్వాడ అజయ్ కుమార్, ఎంపీలు నామా నాగేశ్వరరావు, వద్దిరాజు రవిచంద్ర, MLC తాతా మధుసూదన్, ఎమ్మెల్యేలు బానోత్ హరిప్రియ నాయక్, రాములు నాయక్, మేయర్ నీరజ, పోలీసు కమిషనర్ విష్ణు వారియర్, సుడా చైర్మన్ బచ్చు విజయ్ కుమార్, వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ దొరేపల్లి శ్వేత, BC సంఘం నాయకులు తదితరులు పూలమాలలు వేసి అంజలి ఘట్టించారు. అనతరం తెలంగాణ ప్రభుత్వం అధికారంగా నిర్వహిస్తున్న ఆచార్య కొండా లక్ష్మణ్ బాపూజీ 108వ జయంతోత్సవం కార్యక్రమంలో వారు పాల్గొన్నారు. అక్కడ కొండా చిత్రపటానికి వారు పూలమాలలు వేసి పుష్పాంజలి ఘట్టించారు. ఈ సందర్భంగా మంత్రి పువ్వాడ మాట్లాడుతూ.. స్వాతంత్ర్య సమరయోధుడైన బాపూజీ తన జీవితాంతం ప్రత్యేక తెలంగాణ కోసం పోరాడారని గుర్తు చేశారు. బాపూజీ అందించిన నిస్వార్థ సేవలను మంత్రి పువ్వాడ స్మరించుకున్నారు. తెలంగాణ తొలి, మలిదశ ఉద్యమంలో పోరాడి ఎంతో మందికి స్ఫూర్తిగా నిలిచారని కొనియాడారు. వారి పోరాట స్ఫూర్తితోనే కేసీఅర్ తెలంగాణ ఉద్యమాన్ని ఉవ్వెత్తున తీసుకెళ్లి తెలంగాణ రాష్ట్రాన్ని సాధించారన్నారు. కార్యక్రమంలో పద్మశాలి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కమర్తపు మురళి, బొమ్మ రాజేశ్వరరావు, పగడాల నాగరాజు, తదితరులు పాల్గొన్నారు.




భోపాల్: మనముందు చిన్నపిల్లలు కిందపడితే అయ్యో..! అంటూ పరిగెత్తి లేపేస్తుంటాం. అలాంటిది నడిరోడ్డుపై అర్ధనగ్నంగా రక్తమోడుతూ ఇంటింటికెళ్లి తలుపు తడుతూ సాయం కోరిన ఓ చిన్నారిని ఆదుకునే మాట అటుంచి.. చీదరించుకున్నారు. ఇంకా లోకం తెలియని ఆ 12 ఏళ్ల బాలికకు కామాంధుడు చేసిన గాయం ఒంటిని బాధిస్తుంటే.. ఈ ఛీత్కారాలు బాకుల్లా దిగాయి..! మధ్యప్రదేశ్‌లో వెలుగులోకి వచ్చిన దృశ్యాలు సంచలనం సృష్టిస్తున్నాయి. మధ్యప్రదేశ్‌లోని ఉజ్జయినికి 15 కిలోమీటర్ల దూరంలో ఉన్న బాద్‌నగర్ రోడ్డులో జరిగిన ఘటన తాజాగా వెలుగులోకి వచ్చింది. ఆన్‌లైన్‌లో కనిపించిన దృశ్యాలు తీవ్ర దిగ్భ్రాంతికి గురిచేస్తున్నాయి. ఈ వీడియోలో సుమారు 12 ఏళ్ల వయసున్న బాలిక అర్ధ నగ్నంగా నడిరోడ్డుపై తిరుగుతూ ప్రతి ఇంటి తలుపు తడుతూ కనిపించింది . అప్పటికే ఆమె వ్యక్తిగత అవయవాల నుంచి రక్తం కారుతూ ఉంది. అత్యాచారానికి గురికావడం వల్లే ఆమెకు ఆ దుస్థితి తలెత్తింది. ఆమెను చూసి దిగ్భ్రాంతికి గురైనా.. ఎవరూ సాయం చేయడానికి మాత్రం ముందుకు రాలేదు. ఆమె ఓ వ్యక్తి దగ్గరకు వెళ్లేందుకు ప్రయత్నించగా.. చీదరించుకొని పక్కకు వెళ్లిపొమ్మని సైగలు చేయడం కనిపించింది. దిక్కుతోచని ఆమె అలాగే నడుచుకుంటూ ఓ ఆశ్రమం ప్రాంగణంలోకి వెళ్లింది. అక్కడి నిర్వాహకులు అత్యాచారం జరిగిందని అనుమానించి, ఆమె ఒంటిపై టవల్ కప్పి స్థానిక ఆసుపత్రికి తరలించారు. పరీక్షించిన వైద్యులు..ఆమెపై అత్యాచారం జరిగిందని ధ్రువీకరించారు. గాయాలు తీవ్రంగా ఉండటంతో ఆ బాలికను ఇండోర్ ఆసుపత్రికి తరలించారు. అప్పటికే రక్తస్రావం ఎక్కువగా ఉండటంతో.. అక్కడున్న పోలీసులు రక్తదానానికి ముందుకువచ్చారని తెలుస్తోంది. ప్రస్తుతానికి ఆమె ఆరోగ్య పరిస్థితి నిలకడగా ఉన్నట్లు సమాచారం. ఈ ఘటనపై పోలీసులు పోక్సో చట్టం కింద కేసు నమోదు చేశారు. 'వైద్యపరీక్షల్లో ఆమెపై అత్యాచారం జరిగిందని నిర్ధారణ అయింది. నిందితుల్ని సాధ్యమైనంత త్వరగా గుర్తించేందుకు మేం ప్రత్యేక దర్యాప్తు బృందాన్ని ఏర్పాటు చేశాం. ఎవరికైనా ఈ ఘటనకు సంబంధించిన సమాచారం తెలిస్తే.. తెలియజేయాలని కోరుతున్నాం' అని ఉజ్జయిని పోలీస్ చీఫ్ సచిన్ శర్మ తెలిపారు. 'బాధితురాలు తన పేరు, చిరునామా వంటి వివరాలు స్పష్టంగా చెప్పలేకపోతోంది. ఆమె మాట్లాడుతున్న యాస ప్రకారం.. ఆమెది ఉత్తర్‌ప్రదేశ్‌లోని ప్రయాగ్‌రాజ్ అని భావిస్తున్నాం' అని తెలిపారు. 2019 నుంచి 2021 మధ్యకాలంలో మధ్యప్రదేశ్, మహారాష్ట్రలో అత్యధిక సంఖ్యలో మహిళలు, బాలికల అదృశ్యాలు నమోదైనట్లు నేషనల్ క్రైమ్ రికార్డ్స్ బ్యూరో వెల్లడించింది. 2021లో మధ్యప్రదేశ్‌లో అత్యధిక సంఖ్యలో అత్యాచార కేసులు నమోదయ్యాయి.




న్యూయార్క్: 'ఖలిస్థానీ' అంశం భారత్-కెనడా మధ్య దౌత్యపరమైన చిచ్చుపెట్టింది. దాంతో రెండు దేశాల మధ్య ఉద్రిక్తతలు కొనసాగుతున్నాయి. ఐరాస 78వ సాధారణ అసెంబ్లీ సమావేశాల్లో భాగంగా న్యూయార్క్ వెళ్లిన విదేశాంగ మంత్రి ఎస్ జై శంకర్.. ఈ వివాదంపై కౌన్సిల్ ఆన్ ఫారిన్ రిలేషన్స్‌లో మాట్లాడారు. ఖలిస్థానీ సానుభూతిపరుడు హర్‌దీప్ సింగ్ నిజ్జర్ హత్య వెనుక భారత్ హస్తం ఉండొచ్చంటూ ఇటీవల కెనడా ప్రధాని జస్టిన్ ట్రూడో చేసిన ఆరోపణలు దుమారం రేపిన విషయం తెలిసిందే. ఈ వ్యాఖ్యలను జైశంకర్ మరోసారి ఖండిస్తూ.. తన విధానాల ప్రకారం భారత్ అలాంటి చర్యలకు పాల్పడదని స్పష్టం చేశారు. ట్రూడో ప్రభుత్వం చేసిన ఆరోపణలకు సంబంధించి ఇంతవరకు వారివైపు నుంచి ఎటువంటి ఆధారాలు అందలేదని, నిజ్జర్ హత్యకు సంబంధించి తగిన సమాచారం అందిస్తే.. భారత్ చర్యలు తీసుకుంటుందని హామీ ఇచ్చారు. ఫైవ్‌ఐస్ కూటమిలో పంచుకున్న సమాచారం ఆధారంగానే ట్రూడో ఆ ఆరోపణలు చేసుండొచ్చని యూఎస్ దౌత్యవేత్త చేసిన వ్యాఖ్యలతో ఈ వివాదం మరింత ముదిరింది. దీనిపై రిపోర్టర్ మంత్రిని ప్రశ్నించగా.. ఆయన ఘాటుగా బదులిచ్చారు. 'నేను ఆ ఫైవ్ ఐస్(%ఖీఱఙవ జుఎవం అత్వశ్రీశ్రీఱస్త్రవఅషవ ఞాశ్రీశ్రీఱఅషవ%)లో భాగం కాదు. అలాగే ఎఫ్‌బీఐకి చెందిన వ్యక్తినీ కాను. మీరు ఈ ప్రశ్న అడగాల్సింది నన్ను కాదనుకుంటున్నా' అని సమాధానమిచ్చారు. ఫైవ్‌ఐస్.. అమెరికా, కెనడా, యూకే, ఆస్ట్రేలియా, న్యూజిలాండ్ దేశాల సమాహారం. విశ్వసనీయ సమాచార మార్పిడి దీని ప్రధాన లక్ష్యం. అలాగే, రాజకీయ లబ్ధి కోసం వేర్పాటువాద శక్తులు, హింస, తీవ్రవాదానికి సంబంధించి వ్యవస్థీకృత నేరాలపై కొందరు ఎటువంటి చర్యలు తీసుకోవడం లేదంటూ ట్రూడో సర్కారుపై పరోక్షంగా విమర్శలు చేశారు. ఈ నేరాల గురించి భారత ప్రభుత్వం కెనడాకు పెద్ద మొత్తంలో సమాచారాన్ని అందించిందని, అలాగే అప్పగింతల కోసం ఎన్నో అభ్యర్థనలు చేసిందని ఈ సందర్భంగా ప్రస్తావించారు.

## మోదీని నిలదీసే దమ్ము కేసీఆర్‌కి లేదు



హైదరాబాద్: ప్రధానమంత్రి నరేంద్రమోదీకి రాష్ట్రంలో అడుగు పెట్టే అర్హత లేదంటున్న ఈ బందిపోట్లకు.. ఆయనకు ఎదురెళ్లి నిలదీసే దమ్ము మాత్రం లేదని వైఎస్సార్ తెలంగాణ పార్టీ అధ్యక్షురాలు వైఎస్ షర్మిల ఎద్దేవ చేశారు. బుధవారం నాడు లోటస్ పాండ్‌లో ఆమె మీడియాతో మాట్లాడుతూ.."కేసీఆర్ అడగడు.. ఆయన ఇవ్వడు.. తొమ్మిదిన్నరేళ్లుగా ఇదే తంతు నడుస్తోంది. నిజంగా దొరకు రాష్ట్ర ప్రయోజనాలే ముఖ్యమైతే.. మోదీ వచ్చిన ఐదేళ్లలో ప్రతిసారి మొహాలు ఎందుకు చాటేశారు?. విభజన హామీల సంగతి ఏంటని ఎందుకు ప్రశ్నించలేదు? తెలంగాణకు దక్కాల్సిన నిధులపై ఎందుకు నిలదీయలేదు? పాలమూరు-రంగారెడ్డి ప్రాజెక్ట్ అనుమతులపై ఏం పోరాటాలు చేశారు. కేంద్రం ఇస్తామన్న 2 కోట్ల ఉద్యోగాల్లో రాష్ట్ర వాటా ఎందుకు అడగడం లేదు. బయ్యారం స్టీల్ ఫ్యాక్టరీ, ములుగు గిరిజన విశ్వ విద్యాలయం, కాజీపేట కోచ్ ఫ్యాక్టరీల సంగతిపై కేంద్రాన్ని ఎందుకు నిలదీయలేదు. ప్రతి ఏడాది బడ్జెట్లో రాష్ట్రానికి మొండిచేయి చూపిస్తుంటే.. మీ ఎంపీలు చేతకాని దద్దమ్మలు కాలేదా? గల్లీలో కుస్తీ, ఢిల్లీలో దోస్తీ ఇదే "బీజేపీ రాష్ట్ర సమితి" దోస్తానా కదా. దొరకు కుటుంబ క్షేమంపై ఆరాటం తప్ప రాష్ట్ర ప్రజల సంక్షేమంపై సోయి రాదు. కేసుల నుంచి తప్పించుకునేందుకు మోదీ వద్ద మోకరిల్లి రాష్ట్ర ప్రయోజనాలను తాకట్టు పెట్టిన ఈ కేసీఆర్ అండ్ కోకు రాష్ట్రంలో ఉండే అర్హతే లేదు" అని షర్మిల తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు.



## కేటీఆర్‌పై బండి సంజయ్ ఫైర్

కరీంనగర్ : పాలనలో మంత్రి కేటీఆర్ అన్ ఫిట్ అని బీజేపీ నేత బండి సంజయ్ అన్నారు. సీఎం కేసీఆర్ కొడుకు.. కేటీఆర్ అంతేనని.. అంతకు మించి ఏమీ లేదన్నారు. తెలంగాణలో అడుగుపెట్టే అర్హత మోదీకే ఉందని... మీ కుటుంబానికి లేదన్నారు. కృష్ణా జలాల వాటాపై కేసీఆర్ మోసం చేశారన్నారు. ఒక్క మోటార్ తో పది లక్షల ఎకరాల పారుతుందా? అని ప్రశ్నించారు. మన పాపాన కేసీఆర్ చెడ పుట్టిండని బండి సంజయ్ అన్నారు. "భాగ్యలక్ష్మి గుడి దగ్గరకు రా కేటీఆర్.. మేము ఇచ్చిన నిధులపై చర్చిద్దాం.. ఎన్నికలకు ఇదే రెఫరెండం. నువ్వు కేసీఆర్ కొడుకువే అయితే రా.. నీకు దమ్మింటే..నీలో తెలంగాణ రక్తం ఉంటే రా కేటీఆర్.. నువ్వెంత.. నీ బతుకు ఎంత..?" అని బండి సంజయ్ సంచలన వ్యాఖ్యలు చేశారు.

## తెలంగాణ గర్వించే గొప్ప మానవతావాది కొండా లక్ష్మణ్ బాపూజీ : మంత్రి జగదీష్ రెడ్డి

సూర్యాపేట : తెలంగాణ గర్వించే గొప్ప మానవతావాది కొండా లక్ష్మణ్ బాపూజీ అని విద్యుత్ శాఖ మంత్రి జగదీష్ రెడ్డి కొనియాడారు. కొండా లక్ష్మణ్ బాపూజీ జయంతి సందర్భంగా కలెక్టరేట్‌లో, పద్మశాలీ సంఘం నిర్వహించిన జయంతి వేడుకల్లో బాపూజీ చిత్ర పటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం మంత్రి మాట్లాడుతూ.. ఉద్యమకారుడిగా, ప్రజాస్వామికవాదిగా, పీడిత ప్రజల పక్షపాతిగా, నిబద్ధత కలిగిన గొప్ప రాజకీయ నాయకుడిగా పలు పార్శ్వాలతో కూడిన కొండా లక్ష్మణ్ బాపూజీ జీవితం నేటి తరానికి ఆదర్శనీయమన్నారు. అణగారిన వర్గాల హకుల సాధన కోసం, సహకార రంగాల పటిష్టత కోసం జీవితకాలం కృషి చేశాని ఆయన సేవలను కొనియాడారు. బహుజన నేతగా, నేతన్నలైన పద్మశాలీలను సంఘటితం చేశారని, తెలంగాణ కోసం నాడు తన మంత్రి పదవికి రాజీనామా చేసిన బాపూజీ స్ఫూర్తి మలిదశ తెలంగాణ సాధన పోరాటంలో ఇమిడి ఉన్నదని తెలిపారు. కొండా లక్ష్మణ్ బాపూజీ జయంతి, వర్ధంతులను రాష్ట్ర ప్రభు త్వం అధికారికంగా నిర్వహిస్తున్నదని చెప్పారు. రాష్ట్ర ఉద్యానవన విశ్వవిద్యాలయానికి కొండా లక్ష్మణ్ బాపూజీ పేరు పెట్టి గౌరవించుకున్నామని పేర్కొన్నారు. చేనేత రంగంలో ప్రతిభావంతులైన కళాకారులకు ఆయన పేరుతో ప్రభుత్వం అవార్డులను అందజేస్తున్నదని తెలిపారు. త్వరలో స్థల పరిశీలన అనంతరం పట్టణంలో ఆ మహనీయుడి విగ్రహాన్ని ఏర్పాటు చేయనున్నట్లు మంత్రి తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపీ బడుగుల లింగయ్య యాదవ్, కలెక్టర్ వెంకట్రావు, అడిషనల్ కలెక్టర్స్ ప్రియాంక, వెంకట్ రెడ్డి, జిల్లా గ్రంథాలయ చైర్మన్ నిమ్మల శ్రీనివాస్ గౌడ్, మున్సిపల్ చైర్మన్ పేరుమాళ్ల అన్నపూర్ణ, వైస్ చైర్మన్ పుట్టా కిశోర్, జడ్పీటీసీ జీడి భిక్షం, బీసీ సంఘం నాయకులు, బీఆర్ఎస్ రాష్ట్ర కార్యదర్శి వై.వీ, పద్మశాలి సంఘం జిల్లా అధ్యక్షుడు అప్పం శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

Printed, Published and owned by VISHWANATH V, Printed at S A Printers D No 3 92 Shed No 2, Sy No 45 and 49, Sadashiv Nagar Narapally Village, Ghatkesar Mandal, Medchal - Malkajgiri District, Telangana - 501301. and Published from D.No. 5-87, Near Gandhi Statue, Aliyabad, Shamirpet (M) - 500 078, Medchal-Malkajgiri District, Telangana State.
Editor : VISHWANATH V, Rni Title Code No. TELTEL02115, Phone No. 8977598262, Email Id : reportervishwanath@gmail.com